THE
MANORAMA.

A MONTHLY TELUGU MAGAZINE.

(Published in the third week of every month.)

EDITED BY

CHILAKAMARTHI LAKSHMINARASIMHAM.

Vol. 1. } RAJAHMUNDRY. FEBRUARY 1906. } No. 2.

CONTENTS.

		Page.
1.	TIT-BITS.	61.
2.	TALES OF RAJASTAN.	65.
3.	PANDIT ISWARA CHENDRA VIDYASAGAR. ...	73.
4.	KARPURAMANJARI (A Novel).	81.
5.	PHYSICAL GEOGRAPHY.—By Rao Bahadur K. Viresalingam Garu.	93.
6.	SELF-HELP.—By Mr. Ch. Veerabhadra Rao.	101.
7.	PRASANNAYADAVAM (A Drama).... ...	109.

Rajahmundry:

PRINTED AND PUBLISHED BY

Messrs S. GUNNESWARA ROW BROS.

AT THEIR CHINTAMANI PRESS.

1906.

పత్రికాధిపతి—చిలకమర్తి లక్ష్మీనరసింహము,
రాజమహేంద్రవరము.

విషయసూచిక.

1. వినోదములు. ... ... 61.
2. రాజస్థానకథావళి. ... ... 65.
3. పండిత ఈశ్వరచంద్రవిద్యాసాగరులు. ... ... 73.
4. కర్పూరమంజరి. ... ... 81.
5. భౌతికభూగోళశాస్త్రము—రావుబహదూరు.కం. వీరేశలింగముగారు. ... 93.
6. స్వయంసహాయము—చిలుకూరి వీరభద్రరావుగారు. ... ... 101.
7. ప్రసన్నయాదవ నాటకము. ... ... 109.

THE MANORAMA.

RATES OF SUBSCRIPTION (*Including Postage*)

For Patrons.	Rs. 25-0-0
For one year (*in advance*).	,, 3-0-0
Single Copy.	,, 0-4-6

చందానిర్ణయము. (అంచెకూలితోడ)

పోషకులకు సంవత్సరమునకు రు. 25- 0- 0

సంవత్సరమునకు (ముందుగా చెల్లించిన) రు. 3- 0- 0. విడిప్రతి యొకటికి 0- 4- 6.

ఈపత్రికను గోరువారు తత్పత్రికాధిపతిగారికి వ్రాసికొనవలయును.

ప్రకటనము.

ఆంధ్రదేశీయులారా!

దేశభాషలలో నెల్లను మధురమయిన మనయాంధ్రభాషలోఁ జరిత్రములు లేని లోపము చిరకాలమునుండి యుండియున్నది. ఆంధ్రభోజుఁడని సుప్రసిద్ధిని గాంచిన శ్రీకృష్ణదేవరాయని కాలముననే మనయాంధ్రభాష, రాజరాజనరేంద్రుని కాలానంతరమున మరల నభివృద్ధినొంద నారంభించినది. మనుచరిత్రాదిప్రబంధరాజనిర్మాణమునకుఁ

విజ్ఞాపనము.

అయ్యా !

ఈ సంచికతో మీకు రెండు సంచికల నంపితిమి. అందుచేఁ బత్రిక యోగు బాగులు మీ రరసి యుందురు. కావున పత్రిక యక్కఱలేనివారు తమయభిప్రాయమును మాకుఁ దెలియఁ జేయుదురని కోరుచున్నాము. అక్కఱలేనివారు తమయభిప్రాయమును మాకుఁ దెలియఁ జేయనియెడల, వారు చందాదారులుగ నుండుటకు సమ్మతించిన ట్లెంచుకొని మూడవసంచిక వి. పి. పి. మూలనుగాఁ బంపఁబడును.

చిలకమర్తి- లక్ష్మీనరసింహము,

పత్రికాధిపతి.

[illegible]

[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]

[illegible]

[illegible]

శ్రీ

మనోరమ.

ఇది మాసమున కొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము. 1. | రాజమహేంద్రవరము. ఫిబ్రవరినెల 1906. | సంచిక. 2.

వినోదములు.

9. ఒకబ్రాహ్మణుఁ డొకయూరికిఁ బోఁదలంచి యెన్నిమారులు వీధిగుమ్మమునకు వచ్చి చూచినను, దుశ్శకునమే యగుచుండెను. ఒకమారు తెలికవాఁడు, రెండవమారు వితంతువు, మూఁడవమా రొంటిబ్రాహ్మణుఁడు, నెదురుగా వచ్చుటచే, నాతఁడు రెండుమూఁడుదినములు పయనము మాని రాత్రి యందఱునిద్రపోయినవెనుకఁ బోవుట మంచిదని నిశ్చయించి యట్లుఁ బయనమై చీఁకటిలో రెండుజాములవేళ వీధిలోనికి వచ్చెను. ఆయూరినంబియింట చాలకాలమునుండి, రెండుపిల్లులుండి, వానికి మిక్కిలి బాధఁగలిగించుటచే, నతఁ డామార్జాలములను, నూరుబైట వదలిపెట్టఁ దలఁచి పగలైనచో నవి యానవాలుఁబట్టి, మరలవచ్చునని, చీఁకటిలో యర్ధరాత్రమునఁ దీసికొనిపోయి పారవేయుట మంచిదని నిశ్చయించి రెండుపిల్లుల చేరియొకచంక నిడుకొని, పైబ్రాహ్మణుఁడు వీధిలోనికి వచ్చునప్పటికి నెదురుగావచ్చుచు నాయనను బలుకరించెను. శకునభయముగల యాబ్రాహ్మణుఁడు మాటవలన నతనిని నంబిగాఁ గ్రహించి నీ వెక్కడికిఁ బోవుచున్నావని యడిగెను. నంబియుఁ దనబోవుచున్నపని నెఱిఁగింప బ్రాహ్మణుఁడు దుశ్శకునమయ్యె నను దుఃఖముతో నాయనా! నాపనిఁ జెడుపుటకు నీవుఁ జాలక, రెండుపిల్లులఁగూడ గావలెనా? యని పలికి విసుగుకొనుచు నింటికిఁ బోయెను.

10. ఒకపల్లెటూరిలో వేదముఁ జదువుకొన్నవారి కందఱకు నన్నదానముఁ జేయుదుననియు, తదితరులకు నన్నము పెట్టననియు, నొకబ్రాహ్మణుఁడు ప్రతిన జేసి చాలకాలము తనమాట నిలుపుకొని ప్రసిద్ధికెక్కెను. వేసవికాలమున నొకనాఁడు, వేదముఁ జదువుకొనని, యొక్క బీదబ్రాహ్మణుఁడు నడచి నడచి, వడదగిలి, రెండుజాముల వేళ యాతనియింటికి కన్నమన్నమని వచ్చెను. అన్నదాత వాని యవస్థను జాలినొందక "నీకు వేదము వచ్చునా?" యనియడిగెను. రాదనినచో ప్రాణభయమగునని యెంచి యాబ్రాహ్మణుఁడు వచ్చునని యబద్ధమాడి భోజనానంతరమున పరీక్ష నిత్తునని యనెను. అప్పుడు గృహస్థుఁ డతిథినిఁ జన్నీటిస్నానముఁ జేయించి, విసనికఱ్ఱతో విసిరి షడ్రసోపేతమగు భోజనము పెట్టి, లేచినవెనుక వేదముఁ జదువుమనెను. అతిథియు విశ్రమించిన వెనుకఁ జదువుదునని జెప్పి జాముసేపు నిదురించి లేచినతోడనే యజమానుఁడు, వానిని జూచి వేదపరీక్ష నిమ్మని, ముందు క్రమము, తరువాత పదము, జెప్పుమనియె. అతిథి యజమానునిజూచి "అయ్యా! క్రమము జెప్పెదవినుఁడు. మీరు బ్రతికియుండఁగా మీకుమారుఁడు చనిపోవుట అక్రమము, మీకుమారునిచేతిలో మీరుపోవుట క్రమము." అని దుష్ప్రలాపములాడెను. అప్పుడు యజమానుఁడు కోపించి వానిని కొట్టఁబోవ నూరందఱుఁ జేరి కలహము వారించి, బ్రాహ్మణుని యుక్తికి మెచ్చుకొని, యాకలిగొన్న వారికందఱకు నన్నదానముఁ జేయుటయుచితిగాని, యిట్లుసంబద్ధదానములు చేయుటయుచితముగాదనిరి.

11. ఒకబ్రాహ్మణుఁడు సంభావనకుఁ బోయి యజమానునిజూచి "అయ్యా చదువురాని, నీచపురుషుండకొడుకులకు వరహా యిచ్చి యాత్మస్తుతి పరనింద చేయని మహానుభావునకు నాకును వరహాయిచ్చి పంపెదరా? ఇదియేమి న్యాయ"మని యడిగెను.

12. ఒకబైరాగి యెండలో నట్టమధ్యాహ్నమున నొకబ్రాహ్మణునియింటికిఁ బోయి నా కాఁకలిచేత ప్రాణములు పోవుచున్నయవి. కొంచెము గంజియు నన్నము నాకుఁ బెట్టితివేని మీ కాఁకలియు దప్పియు లేకుండ నొకసిద్ధౌషధ మిచ్చెద నని చెప్పెను. బ్రాహ్మణుఁ డామాట విని మా కాఁకలి లేకుండ మందియ్యఁగలవాఁడవు నీ వేల యామందు పుచ్చుకొనవని పరిహసించి పంపెను.

13. ఆపస్తంబుఁడు, అశ్వలాయనుఁడు ననునిద్దఱు మహామునులు బ్రాహ్మణధర్మములను సూత్రములుగా వ్రాసిరి. మొదటివానిసూత్రముల నవలంబించినవా రాపస్తంబసూత్రులనియు, రెండవవానిసూత్రముల నవలంబించినవారి నశ్వలాయనసూత్రులని జెప్పుదురు. నూజివీటి యప్పారావువారియొద్ద నుద్యోగము చేయు నొకబ్రాహ్మణుఁడు, ఒకయగ్రహారమునకుఁ బోయియుండ నచ్చటివైదికులతనితో మీ రాపస్తంబులా,

అశ్వలాయనులా యనిరి. జన్నమధ్యమందా మాట లెన్నఁడు విననివాఁ డగుటచే నతఁడు మేము హస్తంబులము గాము అశ్వలాయనులము గాము. అప్పారావుగారి హర్కారాలమని చెప్పిపోయెను.

14. అవ్యక్తుఁ డయిన యొక రాజువద్దకు నొక మనుష్యుఁడు వచ్చి "దేవా! నా పినతండ్రికొడుకు దేశాంతరములో మృతినొందెను. అతని భూములు నాకు రావలసి యుండఁగా వాని రహితులు నాకు స్వాధీనము చేయుటలేదు. కావున నాకు వాటిని స్వాధీనము చేయించగలందులకు ప్రార్థించుచున్నాను" అని ఫిర్యాదు చేసి నలుగురు సాక్షులచేత తన జ్ఞాతి మృతినొందినట్లు ఋజువు పలికించెను. రాజు సాక్ష్యము నమ్మి భూముల నతని స్వాధీనము చేయించెను. పిమ్మట కొన్ని నాళ్ళకు ఫిర్యాది యొక్క పినతండ్రికొడుకు వచ్చి రాజును చూచి నేను బ్రతికియున్నాను. నా భూములు నాకు యిప్పించుఁడని ప్రార్థించెను. రాజు వానిని కసిరి కొట్టి నీకన్న మిక్కిలి ఘరానా మనుష్యులు నీవు చనిపోయితివని చెప్పిరి. నీ వబద్ధ మాడుచున్నావు. నీమాటలు మేము నమ్మజాలమని వానిని వెడల నడిపించెను.

15. ఒక బ్రాహ్మణునియింటి కొక బంధువుఁడువచ్చి యజమానుని జూచి, నాయనా మీయింటనున్న యీతలవెండ్రుకల విధవ నీభార్యా మీయన్న భార్యా? అని యడిగెను. యజమానుఁడు వానితో నాకు మాయన్నకు నంతమాత్రపు భాగ్యము కూడనా? అది మాబావమరదిభార్య. అతఁడు తనయూరికి బోవుచు దాని నిక్కడ విడిచిపెట్టెనని ప్రత్యుత్తర మిచ్చెను.

16. మందబుద్ధిగల యొకఁడు ఒక మనుష్యకపాలమును దెచ్చి యొకయూరికిఁ బోయి నాకు రావణాసురుని తలకాయలలో నొకటి దొరకినదని, దానినందఱికి జూప నారంభించెను. జనులు గుంపులుగుంపులుగవచ్చి చూచిపోవుచుండిరి. అందొక వృద్ధుఁడు, వానితో "ఓయీ! రావణాసురునితల యింత చిన్నదిగా నున్నదేమి? నీమాట నాకు నమ్మకములేదు." అనియనఁగ వాఁడు "అయ్యా! ఇది రావణాసురుని చిన్ననాఁటి తల కాయ అందుచేత చిన్నదిగా నున్నది" అన ఆమాటలు విని వానిమూర్ఖతకందరు నవ్విరి.

17. పెండ్లి అయినతరువాత నొక కాపువానిని పురోహితుఁడు అరుంధతీ నక్షత్రము జూపుటకు నవతలకు తీసికొనిపోయి అదిగో నక్షత్ర మదిగో నక్షత్రమని యాకాశమున కొన్ని స్థలముల జూపెను. కాపువాని కెంతసేపటికి నక్షత్రము గనఁబడక పోవుటచే ప్రాణము విసిగి వాఁడు అరుంధతీ నక్షత్రము గనఁబడుట లేదు గాని యరువది వరాలప్పు గనఁబడుచున్నది. ఈపాటికి యివతలకు రా; అని అవతలకుఁ బోయెను.

18. ఒకగృహస్థుఁడు క్రొత్తయిల్లు గట్టుకొని గృహప్రవేశముఁ జేసి భార్యతోఁ బీటల మీఁదఁ గూర్చున్నప్పుడు, పురోహితుని శిష్యుఁడు, యజమానుని భార్య మిక్కిలి లావుగా నుండుటఁ జూచి పీటల మీఁదనుంచి లేచినవెనుక యజమానుని బిలిచి "అయ్యా! మీరింత చిన్నగుమ్మ మెట్టించినారే? మీభార్య మిక్కిలి లావుగానున్నది. ఒకవేళ యామె చనిపోయినయెడల శవమీదారినిబట్టదు. కావున గుమ్మముకొంచెము పెద్దదిగాఁ జేయింపుమనిహితోపదేశముజేసెను. యజమానుఁ డాపలుకువిని, గడునొచ్చుకొని, శిష్యుని మందలింపుమని పురోహితునితోఁ జెప్పఁగా, పురోహితుఁడు శిష్యుని బిలిచి ఓరీ! మూర్ఖుఁడా! ఇట్టి తెలివిమాలిన ప్రసంగములేల చేసెదవు? యేగోడతీసియో, లేక ముక్కలు క్రింద, నరికియో, శవము నేదోవిధముగ నవతల పారవేయుదురు గాని యింటిలో నుంచుకొందురటరా? ఇంత వెట్టిపాడకట్టవేమిరా? యని మందలించెను. పరమఛాందసులగు, గురుశిష్యుల తెలివితేటలుసమానముగానే యున్నవని వచ్చినవారందఱు సంతసించిరి.

19. ఒకయూరిలో నొకబీదబ్రాహ్మణునికుమారుఁడు, ఆకస్మికముగ మృతినొందెను. శవవాహకులువచ్చి నాల్గువరాలైదువరాలని జీతముపెట్టి పీడింప బ్రాహ్మణుఁడు తన పేదరికము వారికిం దెలిపెను. వారామాటలు పెడచెవినిబెట్టి, యీపరియాయమునకు నీవిధము గాపోనిండు. ఇంకొకసారియింతకంటె చవుక చేయుదు మనిరి. అప్పుడు పొరుగుననున్న తగుమనుష్యుఁడు వాహకులయొద్దకువచ్చి బ్రాహ్మణుని కనికరింపుఁడని నొక్కి చెప్ప వారు అయ్యా! ఇది తమయింట గాదుగద; తమ యింటనైనచో మాకు విధాయకమే కనుక చేతులు గట్టుకొని పనిచేయుదుము. మఱియొకచోట మాకు దొరకునది యేల చెడఁగొట్టెదరు. అని పలికిరి.

20. దరిద్రుఁడొకఁడు, అన్నములేక చిక్కి కడుపార దనకు భోజనము దొరకు నుపాయమొకటి యాలోచించి పాలకొల్లునకుఁ బోయి, యక్కడి గోపురము వీపుమీఁద బెట్టుకొని మోసెదనని చాటుకవేసెను. ఊరివారందఱు, ఇంత పెద్దగోపురము వీఁడెట్లు మోయునోయని, వింతపడి గుంపులుగూడి వానియొద్దకువచ్చి మోయుమనఁగా, నాతఁడు నేనీనడుమ రోగపీడితుఁడనై చిక్కియున్నాను. నాకాఱుమాసములు సుష్టుగా భోజనము పెట్టిన నీపనిజేయుదుననిజెప్ప, నూరందఱు చందాలు వేసికొని యాఱుమాసములు వానిని సాఁబోతును మేపినట్లు మేపి యవలనొకనాఁడు గోపురమును మోయుమని బలవంతపెట్టిరి. వాఁడు సరేయని గోపురము దగ్గఱకువచ్చి నడుముపంచి యెవరైనను గోపురమెత్తి నావీపు మీఁదఁబెట్టుఁడని పలికెను. ఆపనిచేయుట కెవ్వరును బూనుకొనలేనందున, వాఁడువారితో మీరు నావీపుపైకి దీనినెత్తుటకే చాలనప్పుడు, నేనుమోయుట యెట్లు సంభవించును. ఇప్పటికైనను మోయుసామర్థ్యము నాకుఁ గలదు అని పలికెను. ఊరివారందఱు వాని గడుసుఁదనమునకు మెచ్చిరి.

బప్పరావులకథ.

అనేకసంవత్సరములక్రిందట హిందూదేశమున వల్లభిపురమను పట్టణమున, శిలాదిత్యుఁడను మహారాజొకఁడు పాలించుచుండెను. అతఁడు చిరకాలము శత్రుదుర్నిరీక్ష్యముగఁ బ్రజారంజకముగ నేలనేలెను. శిలాదిత్యుఁడు సూర్యునికుమారుండనియు, నాకారణంబున నతఁడామహారాజును సంరక్షించుననియును బ్రసిద్ధికలదు. ఆతనిసేనలతో నెవరుబోరినను, వారుతప్పక పరాజయము నొందెడువారు. వల్లభినగరపుఁగోటలో నొకదివ్యసరస్సుగలదఁట. శిలాదిత్యమహారాజు శత్రువులకు జంకినప్పు డాదివ్యసరస్సునకుఁ బోయి,యొడ్డుననిల్చిచిన్ననాఁడు తనతండ్రి కఱపినమంత్రము నుచ్చరించునఁట. వెంటనే యాసరోవరమధ్యమునుండిసూర్యునిరథము లాగురంగుల గుఱ్ఱమొకటి బయలుదేర నారాజు దానినారోహించి, రణరంగంబునకుఁజన, శత్రుసేనలు వానియెదుట నిలువలేక, పటాపంచలైపారుచుండును. ఇట్లుండ కొంతకాలమునకుత్తరదిక్కునుండియరులమూకలు వచ్చి వల్లభిపురమును ముట్టడించెను. ఎన్నినాళ్లుమగఁటిమిఁజూపిపోరొనర్చినను, వారు శిలాదిత్యునిఁ గెలువఁజాలక నిరాశులైరి. అంతలో చిరకాలమునుండి రాజుపై మనస్సులో క్రోధము నిల్పియున్న యాతని మంత్రి యొకదర్ధరాత్రమున, శత్రుశిబిరముం బ్రవేశించి, వారితో "నాకోరిన బహుమానమునిత్తురేని, శిలాదిత్యునిఁ గెల్చివల్లభిపురమును బట్టుకొను నుపాయంబు మీకుపదేశించెద" ననిపలికె. ఆపలుకులువిని వారు సంతసించి వానికోరిక తీర్చెదమని వాగ్దానముఁజేయ, నాతఁడును దనవిజయరహస్యమును బగతురకిట్లెఱిగించెను. శిలాదిత్యమహారాజు సూర్యపుత్రుఁడు; ఆతనిప్రభావమువలన కోటలోని యొక దివ్యసరస్సునుండి సూర్యాశ్వమొకటి బయలువెడలును. రాజుదానిపై నెక్కి కయ్యమునకుఁబోవుటంజేసి విజయుడగుచున్నాడు. ఆసరస్సు మైలపడినయెడల భానుఁడలుగును. ఆతనియలుకచే రాజున కాగుఱ్ఱములభింపదు. అప్పుడుమీరాతని సులభముగా జయింపవచ్చును. ఇట్లు పలికి వైరులను మహానందమగ్నులఁజేసిదుష్టబుద్ధియగు నామంత్రినగరమునకుఁబోయి, యొకగోవును జంపించి దానినెత్తురాకోలంకునీటిలోఁ గలిపించి కలుషంబుగావించె. కొండొకవడికి వేగులవాఁడొకఁడు వచ్చి. దేవా! శత్రువులుకోటపైఁగవియుటకు మొనలుదీర్చియున్నవారని చెప్ప శాత్రవసేనలతోఁ బోరుమని తనబలంబులకానతిచ్చి, యధరణీశ్వరుఁడెప్పటియట్లు దివ్యసరోవరంబునకుం బోయి తనప్రియహయమును బిలిచెను. కాని తొంటియట్లు నీరొకించుకయుఁగదలబారదయ్యెను. ఆరాజేంద్రుఁడు తత్కారణమరసి, తనమంత్రపటిమయుంబుజెడినదనియు, దనజనకుఁడగు ప్రభాకరునకుతనపై నను

గ్రహము దప్పినదనియు నిశ్చయించి సేనలం బురికొల్పుకొని, యాయుధపాణియై దుర్వార సంగ్రామంబొనర్చి, దేశసంరక్షణార్థమై ప్రాణములు విడిచి కీర్తిశేషుండయ్యెను. శత్రువులు వల్లభీపురంబును బట్టుకొని కొల్లగొనిరి. అప్పుడు జైనమతమున నగరమునందు లేమిచే నొక్కటి తక్కటి తక్కిన దేవళములు తలంపక చిచ్చునకు భక్ష్యసహాయమునను జేసిరి. ఆమె తన పుట్టింటికిం జని మరల భర్తసన్నిధికి వచ్చుచుండ, దారిలో నొక సేవకుఁడు వారి నాయకుని శిలాదిత్యుఁడు లోకాంతరగతుఁడగుటయు వల్లభీపురము శత్రువులకుం జిక్కుటయు నాఁడు గల వృత్తాంత మెఱింగించెను. ఆ రాణియు గుండె లవిసియు తద్వార్తలవిని, పిడుగుపడిన తెఱంగున మూర్ఛిల్లి పడి లేని శోకాబ్ధిలో మునిగి, వల్లభీపురంబునకుం బోప కాళ్లాడక నింపు మాలాలగుటచేఁ బోవం దోఁచక ప్రాపునన్న యొక కొండ గుహకు మెల్ల మెల్లఁ జనియె. అచ్చట కొన్ని నాళ్లకు నామె కొక నందను జనియించె. అనంతర మామె యొలనాఁగ, యొక బ్రాహ్మణుని బిలిచి తన కుమారుని వాని కొప్పగించి బ్రాహ్మణకుమారునట్లు వానిం బెనుచుమనియు, సమ్ప్రాప్తయౌవనుఁడైన పిదప నొక రాజకన్యనిచ్చి వివాహము చేయుమనియు, నొక్కి చెప్పి విరహవ్యాధిరోగముచే నవసియున్న తన శరీరమును విడిచెను. బ్రాహ్మణుఁడును శిశువు నెత్తుకొని యింటికి జనిఁ యా బిడ్డను గుహలోఁ జన్మించిన కారణమున గోహుఁడను పేరుపెట్టి పెనుచుమని తన కూతును కొప్పగింప నామెయు, తన బిడ్డలతోపాటు వానికి సంరక్షణఁ జేయుచుండెను. పెంపుడుతల్లిదండ్రులు బిడ్డలపై నెంతయనురాగము జూపుదు రంతయనురాగము, బ్రాహ్మణుండును వానికూఁతురును వానిపైని జూపి పెంప రాజకుమారుఁడును క్రమక్రమంబునం బెరిగి కతిపయదినంబుల నల్లరిబాలుఁడయ్యె. అనుదినంబును బక్షులం బట్టుచు వనమృగంబుల వేఁటాడుచు రాజకుమారులం గలసి యాడుచు పోరాటంబు సల్పుచు నాతఁడు దుండగీఁడగుట జేసి వానిని బ్రాహ్మణకుమారునట్లు పెనుచుట వారికి నలవిగాదయ్యె. ఇట్లుండి యదు నొకం బెద్ద ప్రాయమున నొకనాఁడు నాయకకుమారుఁడు పెంపుడు తల్లిదండ్రుల యిల్లు విడిచి, యుపవనముల, గొండల, వనియందు భిల్లబాలకులం గలసి వారలతో నిచ్చవచ్చినట్లు [illegible] వేఁటలాడుచు పాటలఁ బాడుచు విహరింపఁ జొచ్చె. ఒకనాఁడు గోహుఁడు భిల్లబాలురలం గలసి వేఁటలాడుచుండ సమీపమాలంపులు తమ చుట్టుప్రక్కల నున్న నాగరికులవలెనె తాముఁగూడ నొకరాజు నేర్పరచుకొందమని పరిహాసార్థ మనుకొని గోహుని తమప్రభువుగా నియమించుకొనిరి. వెంటనే యొకభిల్లవాఁడు కత్తితో తనవ్రేలుం జెరికొని బొటబొట కారు రక్తమ్ముచే గోహుని నెన్నొసట టీకా వేసెను. రాచరికము పూనువాని కట్లు చేయుట యాదేశములో నాఁటిదినములయం.

దాచారమయి యుండెను. భిల్లుల కులవృద్ధు తద్వృత్తాంతము విని సంతసించి తమ యీహూస్గ్రామ పుశేషము గోహునకు పుత్రపౌత్రపారంపర్య మేలుమని యొప్పించి, యెల్లభిల్లులకు వాని దొరగా నొనర్చెను. నాటనుండియు తద్వంశస్థులు గిహాలోటులని చెప్పఁబడుచున్నారు. ఇట్లు గిహాలోటులు శివపురమును, భిల్లులను, నెనిమిదితరములవరకుఁ బాలించిరి. అనంతరము భిల్లులు క్రొత్తవంశపురాజులపరిపాలనకు విసువుజెంది వారినెట్లయిన దేశమునుండి పారఁదోలఁ దలఁచుచుండిరి. ఒకనాఁ డవ్వటిరాజు వేఁటతమకంబున తిరుగుచుండ భిల్లులు వాని నాకస్మికముగఁ జాకి చంపిరి. అప్పుడు రాజకుటుంబ మెందేని తలదాఁచుకొనవలసివచ్చె. పూర్వము గోహుని కాపాడిన బ్రాహ్మణునికూఁతురి సంతతివారు వంశపారంపర్యముగ గుహవంశపురోహితులగుచుండిరి. తద్వంశజుఁ డగుబ్రాహ్మణుఁ డొకఁడు మృతినొందినరాజు కుమారుని మూడేండ్లప్రాయపు వానిజేరందీసి చేయునట్టిశివిలోనున్న యొకకొండకోటకుం దీసికొనిపోవ నొకభిల్లుఁడు వాని తండ్రియందలి విశ్వాసముచేత రహస్యముగ వానినందు సంరక్షింపఁ జొచ్చె. అప్పటికి గొన్నినాళ్లు కడచినపిదప పురోహితుఁడు రాజపుత్రున కచట యపాయము వాటిల్లునని తలఁచి యిప్పటియుదయపురమున కైదుక్రోసులదూరమున నున్న నాగేంద్ర మను పుణ్యక్షేత్రమున కాకుఱ్ఱని జేర్చెను. ఆపట్టణమున మూఁడుశిఖరములుగల యొకకొండ మొదట యేకలింగస్వామి యనుపేరఁ బరఁగు మహాదేవుని శివుని వాహనమగు నందిని బ్రాహ్మణు లారాధించుచువారు. అడవుల నేకులనిండిన యీయేకాంతస్థలమున రాజపత్ని తనకుమారుని దాఁచి పెంచుచుండె. అతనికి నామకరణ మేదియుఁ జేయక తల్లి బప్పా యని పిలుచుచు యూరిపిల్లలతోపాటు పెరుగ నిచ్చెను. ఆభాషలో బప్పయన బిల్లవాఁడని యర్థము. ఆయూరిపిల్లలవలె నాకుఱ్ఱఁడు సుదయమునుండి లస్తమయమువరకు పసులమందలం గావ నూరిబైటికిఁ బోవుచు, వారివలెనే తాను నాడుచు బాడుచు వారందఱకు యజమానుఁడయి తనయాజ్ఞ శిరసావహించునట్లు బ్రవర్తించెను. బప్పఁడునానాఁటికి బెరిఁగి నెఱజవ్వనంబుఁ బ్రాపించియుండనొకనాఁడట్లు తద్దినపండుగకు, నాగేంద్రగ్రామసామంతునికూఁతుసతోడిపడుచులఁగూడిపండుగదినంబున హాయిగ నుయ్యాలలూగ నూరుబైట దేవళముచుట్టు నున్నమామిడితోపున కరిగి యచట నుయ్యాల బన్నుటకు త్రాళ్లు దొరకమి చిన్నబోయియుండె. దైవవశమున నాసమయంబున బప్పఁ డామావితోఁటలో దిరుగుచుండ బాలిక లాతనిం గాంచి తమ కొక యుయ్యాలత్రాడు దెచ్చిపెట్టుమని వేఁడ, బప్పఁడును దాని కియ్యకొని సరే మీరు నాతో నొకయాట యాడుటకు నొప్పుకొందురేని" మీకు త్రాడిచ్చెదను. మీరు

మనసార నూఁగవచ్చునని బలుక గ్రామనాయకునికూఁతు రది యేమి యాటయని యడిగెను. మరేమియు లేదు. మనము పెండ్లియాట యాడుకొందమని బప్పఁ డుత్తరమిచ్చెను. బాలురును బాలికలును బొమ్మలపెండ్లియాటలు తమపెండ్లియాటలు నాడుకొనుట లోకవిదితమేగదా! ఉయ్యెలత్రా డెక్కడ దొరకకపోవునో యని బాలికలట్లు చేయుటకియ్యకొనిరి. గ్రామనాయకునికూఁతురు చీరకొంగునకు రాజపుత్రుఁడు తనశాలువకొంగు ముడివేసి యామెయు యామెతోనున్న మఱియారువందలపడుచులయు చేతులు పట్టుకొని యొకవృక్షమునకుఁ బ్రదక్షిణముఁ జేసి ; కొండొకతడవునకు పాణిగ్రహణమహోత్సవము నిర్వర్తించెను

నాగరికతలేని యాపల్లెటూరి పడుచులు తమచుట్టములయిండ్ల జరుగువివాహములలో ప్రధానాంగముగాఁ జరుగుపని యదియేగావున యాపని కప్పఁడుసంతసించి తనివిదీర నుయ్యెలలూగి, సాయంకాల మిండ్లకుఁ జని యాపెండ్లియాటమాట మరచియుండిరి. బప్పఁడు తనతోడిబాలకుల నందరఁ జేరఁ బిలిచి తా నాదినమున గావించిన చిత్రకథ వారెవ్వరికిం దెలుపఁగూడదనియును, గ్రామంబున, నెప్పు డేమాటవినిననప్పు డది తన కెఱుఁగఁజేయవలయు ననియు కట్టడి జేసి వాండ్ర నందు కొడంబరచి, వారిచేఁ బ్రమాణములు జేయించుకొని, యంతట నెల్లర వీడ్కొలిపె. బప్పఁడు పసులమందల మేపుచున్న యాకాలమున చింతపువ్వువన్నెయా వొకటి స్వభావమునఁ బరమసాధువయ్యు నింటికి వచ్చి పాలుచేపక యెగదన్నుచుండుటఁజేసి కారణము దెలియక, యెట్టుకేలను బప్పఁడే దానిపాలు పిదికికొనుచుండవలయు నని! నిశ్చయించి వానిదొంగతనము పొంచియుండి పట్టుకొమ్మని యూరిపెద్దలు కొందర నియోగించిరి. బప్పఁ డది యెట్లో యెఱిఁగి కడునలిగి యావు వట్టిపొదుగుతో నింటికివచ్చుమాట నిజమేకాని తా నేపాపమెఱుఁగ ననియుఁ బొదుగుపై నెన్నఁడుఁ జేయియైన వేయలేదనియు నెంచి యాగోవు జాడలు దా గనిపెట్టి రహస్యము బట్టబైలు చేయుటకయి, యత్నించిమందలోనుండి యాపసరము ప్రతిదినము తప్పిపోవుచుండె నని, తెలిసికొని యొకనాఁడు సాయంకాలము పుంతలు పొదలు దాఁటి వెనువెంటం జని యొకకొండ చరియం జేరెను. అచ్చట నల్లిబిల్లిగ నల్లుకొన్నపొదల నడుమ నొకవేదికపై నమరియున్న మహాశివలింగమునకుఁ దప్పిపోయిన యావు తనపొదుగునుండి పాలు చేపి యభిషేకము జేయుచుండెను. చిరకాలమునుండి జపములు తపములు నుపవాసములు చేసి ముక్తినిఁ బడయు నిచ్ఛతో మనస్సు పరబ్రహ్మముతో నైక్యముఁజేయఁ బ్రయత్నించుచు నాసమయమున సమాధిలో నున్న యొకానొకసిద్ధుఁ డావేది సమీపమున నుండెను. బప్పఁ డామహాత్ముని సమాధి

నుండి మేలుకొలుప నాతండును తనదివ్యజ్ఞానమహిమమున నెదుట నున్న బాలుఁడుత్తమరాజకులసంభూతుఁ డనియు, మహాకార్యముల జేయ నవతరించినాఁ డనియు తెలిసికొనియె. బప్పఁడాసిద్ధునకు సాష్టాంగనమస్కార మొనర్చి తాను నాగేంద్రగ్రామవాసియగు పసులకాపరి ననియు తప్పిపోయిన యొక యావును వెదకికొనుచు వచ్చితి ననియుఁ జెప్పెను. సిద్ధుఁ డాపలుకులువిని వాని నాదరించి యాగోవనుదినంబు నాకొండచరియకు వచ్చి పాలు తనకును దేవునకునొసంగుచుండె నని చెప్పెను. అదిమొదలాగోవు మందనుండి తప్పిపోయినపు డెల్ల దాని వెదకుచు బప్పఁడుసిద్ధుని నెలవునకుంబోయి వాని దర్శించి కడుభక్తి వానిపాదములంగడిగి యెడనెడ పూలు, పాలు, పండ్లు నాహారములుగా సమర్పించుచు వానికిం బ్రియశిష్యుఁడయ్యెను. సిద్ధుఁడును బప్పనియెడఁ బ్రసన్నుండై శైవరహస్యముల నుపదేశింప నాతఁడు పరమశివభక్తుఁ డయ్యెను. ఆముని బప్పని కుపనయనముజేసి మంత్రోపదేశము చేయ, మంత్రమహిమచే నాతని కొకనాఁడు శివుని భార్యయగు మహిషాసురమర్దని వ్యాఘ్రవాహన మెక్కి రక్తాంబరంబుల ధరియించి ప్రత్యక్షమై, శత్రునిర్మూలనసాధనంబు లగు నీటెయు, విల్లును, నమ్ములపొదియు, నొసంగుటయేగాక మనుష్యకృత్యముగాక కేవలవిశ్వకర్మనిర్మితమై నిరుపక్కల వాఁడిగల యొకమహాఖడ్గమును గూడఁ బ్రసాదించెను. ఆఖడ్గ మతిభారమగుటచే దివ్యపురుషులు మహాశూరులు దక్క సామాన్యులు దానిం దాల్పనోపరు. దేవి యిట్లాతని ననుగ్రహించుటయు, సిద్ధుఁడుబప్పనిం జూచి "వత్సా! రేపు నేనీశరీరము విడిచి దివికిం బోవుదును; గావున నీ వరుణోదయము గాకమున్న వచ్చి నాకట్టకడపటిదీవెనలం బడయుము" మని యానతిచ్చె. రాజకుమారుడును మరువాత తప్పకవత్తునని నచ్చఁబలికి మునిని వీడ్కొని పోయెను. కాని పెందలకడ నిద్ర మేల్కొనఁజాలక కొంతప్రొద్దెక్కినవెనుక నతఁడాకొండచరియకు వచ్చి చూచునప్పటికి సిద్ధుడందు లేఁడయ్యె. ఆమహాపురుషునికొరకు బప్పడు పొదలు, పుంతలు, పొలములు వెదకి వేసారి యెందునుంగానక యెట్టకేలకు నాకసమువంకఁ జూచెను. అప్పుడు మహేంద్రలోకమునుండి వచ్చి కన్నులు మిరుమిట్లుగొలుపు దేదీప్యమానప్రభలుగల దివ్యపురుషులు మణిమయం బగుస్వర్ణవిమానంబున గూర్చుండబెట్టిఁకొనిపోవ నంతరాళంబునమహావాయుపథంబునం దిరుగుచుసిద్ధుఁడు పుడమిపై కడుచవ్వాల నున్న బప్పనింజూచి పైకి వచ్చి నాయాశీర్వచనముల నందుకొమ్మని కేక వేసెను. ఆపరమమునీంద్రు వాక్యద్ధివలనబప్పఁడు, చూచుచుండఁగ నే యిరువదిమూళ్ల పొడు గెదిగెనఁట. అప్పుడు ముని వానిం బిలిచి నోరు తెరువుమని యానతిచ్చి బప్పడట్లు చేయ తుబుక్కున మొగమ్మునై నుమిసెను. రాజకుమారున కది కడు నసహ్యముగ

దోఁచుటంజేసి యతఁడు సిద్ధునియుమ్మి తననోటఁ బడకుండ నించుక యావలకుం దప్పికొన, నదివానికాలిపైఁ బడియె. సిద్ధుఁడది గనుంగొని, నీవు నేజెప్పినచొప్పునఁ జేసితివేని చిరంజీవివై యుందువుగద! కానిమ్మిప్పుడైన నీ కేయాయుధమువలనను భయముగలుగదని పలికి యంతర్ధానమయ్యెను. అనంతరమాబప్పఁ డింటి కరిగి జరిగినవృత్తాంతమంతయుఁ దల్లి కెఱిఁగింప నామెయు, నతిలోకంబగు నయ్యద్భుతంబున కానందపరవశయై, 'నాయనా! నీ వంద రనుకొన్నట్లు పశులకాపరివి గావు. సకలమహీభరణదక్షుండవగు రాజపుత్రుఁడవు. నేను రాజకన్య'నని గుట్టు వెల్లడి చేసి పూర్వవృత్తాంతమెఱిఁగించెను. బప్ప డది విని నాఁడుమొద లావులమందల గాచుట మాని రాచరికము సంపాదింప దేశములవెంటఁ దిరుగ నారంభించెను. ఆసమయమున బప్పఁడు నాగేంద్రగ్రామమును విడుచుటయు నాతనికి మిక్కిలి క్షేమకరము. ఏలనన నాతనివిషయమై దుర్భరమగు నొక చెడువాడుక వ్యాపించుటంజేసి, యూరెల్ల నట్టుడికిన ట్లుడుకసాగెను. గ్రామనాయకుని కూఁతురు సంప్రాప్తయౌవనయై, వివాహయోగ్యయగుటంజేసి దానికిం దగువరుఁ డొకఁడు లభించెను. వివాహప్రయత్నము లన్నియు జరిగి సిద్ధముగనుండ ముహూర్తము నిశ్చయించుటకు వచ్చిన బ్రాహ్మణుఁడు బాలికజాతకమును జూచి గ్రహసంచారమునుబట్టి నామెకు నదివరకే వివాహమైనదని చెప్పెను. ఊరిపెద్ద లీమాట విని మితిమీరినయలుక చేనుండిపడి బాలికను నొక్కి యడుగ నామెయు భయపడుచు వెనుక నెఱపఁబడిన యాటపెండ్లి నెఱిఁగించెను. ఆ తెగవారిశాస్త్రమునుబట్టియు, నాచారమునుబట్టియు, కొంగులు ముడివేయుటయు, చేతులుపట్టుకొనుటయు, చెట్టుచుట్టు తిరుగుటయు, నిజమైనవివాహమును సూచించుటంజేసి బప్పఁడు గ్రామమునందలి యారువందలకన్నెలకు విధిగా మగఁడయ్యెనని పెద్దలలుకఁ జెందుటకు తగినంత కారణము లేకపోలేదు. తనతోడి పశులకాపరులలో నొకనివలన నీసంగతి విని బప్పఁడు క్రోధపరవశులగు మామగారలబారినుండి తప్పించుకొని తక్షణ మాగ్రామమును విడిచి కొంతదవ్వరిఁగి గొప్పబయలునేల నొకరాతిపైఁ గట్టఁబడిన చిత్తూరునగరముం బ్రవేశించెను. ఆకాలమున చిత్తూరునగరము మాళవరాజవంశస్థుఁ డగు బప్పనిమేనమామ పాలించుచు, చిరకాలముక్రిందటఁ జూచిన తనతోఁబుట్టువును మేనయల్లుని గారవించెను. ఎవరో యెచ్చటనుండివచ్చెనో యెవ్వరికిం దెలియని యాక్రొత్తచుట్టాలపై రాజునకుం గలయాదరంబును గారవంబునుఁ జూచి రాజాశ్రితులందరుఁ గడునల్గి తమపట్టణముపై నొకశత్రువు దండెత్తిరా వారందఱు నతనికి సహాయముగఁ బోరమనిరి. రాజువారిని సాముసునఁగ, మేనమామచేసిన యాదరంబునకెల్ల బప్పఁడు తగినవాఁడైనపక్షమునయితేఁ

డొక్కఁడే పగతురందఱకి జయింపఁగలఁడు. ఇంకమాసాహాయ్యమెందుకు? కావలసినయెడల మామడిమాన్యములనైన వదలుకొని మేమెందైన బోవుదుము కాని, నీపక్షమున బోరముని రాజునకువారుప్రత్యుత్తరమిచ్చిరి. బప్పఁడుజంకుగొంకులేక యొక్కఁడే యుద్ధమునకు సిద్ధమయ్యెను. ఆతనిసాహసమునుజూచి సరదారులందఱు, తమతమమన స్పర్థలనువిడచి సిగ్గుపడి యెట్టకేలకుఁ బప్పనివెంట రణంబునకుం బోయిరి. నాటికలహంబున శత్రురాజు బప్పనిచే పరాజయము నొంది యాశూరశిఖామణికి తనకూఁతు నిచ్చి వివాహాము చేసెను. సరదారులందఱు బప్పనింజేరఁబిలిచి, యారాజుదుష్పరిపాలనముచే విసిగియుంటిమనియు, నందుచేమామను సింహాసనభ్రష్టునిఁజేసి యల్లుఁడుగద్దెయెక్కి పాలించినయుచితముగ నుండుననియు, నుపదేశించియట్లు చేయఁ బ్రోత్సాహపరచిరి. బప్పఁడు నిశ్శంక బిరుదుఁడగుటచే సరదారులసాయమున మేనమామయనిసంశయింపక, ఆతనిం బారఁదోలి రాజ్యమాక్రమించెను. తొల్లిసిద్ధుఁడు, బప్పని యేకలింగస్వామికి ధర్మకర్తగా నేర్పరచెను. అదిగాక బప్పఁడు హిందూమతప్రభాకరుఁడనియును సర్వభూమండలాధీశ్వరుఁడనియు బిరుదులంగ్రహియించెను. ఆతఁడు చిత్తూరుదేశము చండశాసనుఁడై చిరకాలముపాలించి రాజ్యముఁగడువృద్ధి చేసెను. అతఁడనేకకన్యలను వివాహమాడెను. అందుద్వీపాంతరమునుండివచ్చిన యొకానొక రాజకన్య తనసాటిలో నొక దేవీవిగ్రహమును దెచ్చి కోటలోనుంచెను. లోకమాతయగు నాదేవి బహుసంవత్సరములాకోటను సంరక్షించెనఁట. కానియొకపిరికిరాజు మంచిసమయమున కోటనువిడిచిపోయెను. ఆద్వీపాంతర రాజకన్యవలన బప్పనికుదయించిన నందనుఁడు పితురనంతరమున సింహాసనమెక్కెను. బప్పని జీవితమంతయు నెట్టియద్భుతకథలతో నిండియుండెనో, వానిమరణమునట్టికథలతో నిండియున్నది. అతఁడతివృద్ధుఁడైనవెనుక రాజ్యమును, భార్యలను, బిడ్డలను విడిచి సేనలంగూర్చుకొని, పశ్చిమదేశములపై దండువిడిసి, చూచినతావెల్లఁ జయించుచు, తుట్టతుదకు కొరాసానను మ్లేచ్ఛదేశముఁ జేరి, యచ్చట నొకరాజ్యము స్థాపించెను; కాశ్మీర, గాంధార, పారసీక ప్రభువులును, కాఫరస్థాను, ఇస్పహాను దొరలును, తక్కుంగలపశ్చిమదేశాధీశ్వరులును వానికిలోఁబడి కప్పముఁగట్టిరట. బాల్యమునందుఁబోలె వార్ధకమునందును నతనికి వివాహేచ్ఛ మిక్కుటముగుటఁజేసి సామంత రాజపుత్రులఁబలువుర పాణిగ్రహణముఁజేసి యాకన్నెలవలన నూటముప్పదుగురు కుమారులంగనెనని చెప్పుదురు. ఈకొడుకులే నూటముప్పదిపటానుతురుక తెగలకు వంశకర్తలైయుండెనని ప్రసిద్ధిగలదు. మున్నుచిత్తూరిపై విసుగు పుట్టినయట్లు కొరాసానుపై నయితమాతనికి విసుగు జనింప నాతఁడాదేశమును వైభవమునువిడిచి తిరిగితిరిగి పరమపావనముగు

మహామేరుశైలము నెక్కి జితేంద్రియుఁడై సన్యసించి, జపతపంబుల కాలము పుచ్చి, తుట్టతుదకు శతవృద్ధుఁడయి శరీరము విడిచెనట. ఈతఁడు చచ్చి లోకము విడిచినను, యద్భుతములు మహిమలు వీనిని విడువవయ్యె. అతని పూర్వపు ప్రజల్లగు హిందువులును, ప్రస్తుత ప్రజలగు మ్లేచ్ఛులును వాని కళేబర విషయమై, వివాదపడిరి. హిందువులు తద్దేహమున గ్నిసంస్కారముఁ జేయుదుమనిరి. మ్లేచ్ఛులు నేలంబూడ్చుదుమనిరి. ఇట్లు కొంతతడవు మ్లేచ్ఛహిందువులు కార్యనిశ్చయముఁ జేయలేక వివాదపడుచుండ నప్పు డందులో నొకఁడు శవముమీఁదఁ గప్పినబట్టనించుక యెత్తెను. అప్పటియద్భుత మేమని వర్ణింపను. ఆస్థానమందు బప్పరావుల శరీరముగాని దాని జాడగాని యొక్కింతయు గానఁబడకపోవుటయేగాక, శవమును ఘండుకొన బెట్టినచోట భూమిలోనుండి లెక్కలేని తామరపువ్వులు మొలకలెత్తెను. ఈవిధమునఁ బప్పఁడద్భుతముగా నస్తమించెను. ఈబప్పరావులే, మీవారు సంస్థానము నేలు శిశోదయవంశజులగు రాజులకు మూలపురుషుఁడు. అతనితదనంతరమున సింహాసనమునకువచ్చిన ప్రభువులఁ గొందఱు బప్పనివలెనే రావులని బిరుదము వహించిరిగాని, యిటీవలవారు రాణా యనునామము ధరించిరి. బప్పరావులకాలము మొదలు చిత్తూరురాజులచ్చటి శివాలయములకు ధర్మకర్తలై తారు స్వయముగా నాలయమునకుఁ బోవునపుడు సేవకులై యుండెడు నాచారముగలదు.

ఈశ్వరచంద్రవిద్యాసాగరులు.

హిందూదేశమున మృతిపొందిన భర్తతో చిచ్చునంబడి చావవలసిన యాడువాండ్రను బ్రతికించి దేశమునకుమహోపకారము జేసినయతఁడు రామమోహనరాయలు; అతని ప్రసాదమున బ్రతికిన వితంతువులను యావజ్జీవ మిహలోకనరక మగువైధవ్యమునుండి తప్పించి వారిని మరల ముత్తయిదువలఁ జేసి పసపుకుంకుమలు నిలిపిన పరమోపకారి యీశ్వరచంద్ర విద్యాసాగరులు.

ఈయన బంగాళాదేశ కులీనబ్రాహ్మణుఁడు. ఈతఁడు 1820వ సంవత్సరమున హుగ్లీమండలములోనివీరసింఘగ్రామమున నొకనిరుపేదకుటుంబమునఁబుట్టెను. వానితాతయగు రామజయబెనర్జీ సన్యాసియై దేశాటనముఁ జేయుచు కాలక్షేపము జేసెను. తండ్రియగు ఠాకురుదాసుబెనర్జీ యొకవర్తకునియొద్ద నెలకు పదిరూపాయిలవేతనముగల చిన్నయుద్యోగియయి యుండెను. ఈశ్వరచంద్రుఁడు తనయూర బడిలో నున్నంత వరకు విద్య నేర్చుకొని తొమ్మిదివత్సరముల ప్రాయము వచ్చినపుడు సంస్కృతకళా

శాలలో విద్యనభ్యసించుటకుఁ గలకత్తానగరమునకుఁ బంపఁబడి యచ్చట ధర్మశాస్త్రము, వేదాంతశాస్త్రము, కావ్యాలంకారములు, జ్యోతిశ్శాస్త్రము మొదలగువానిని నేర్చి యనేక బహుమానము లందెను. అతఁడు తన పదియేడవయేట పండితకోర్టు మునసబుగా నుండఁదగిన పరీక్షయందుఁ దేరెను. ఆకాలమునం దాపరీక్షలో కృతకృత్యుఁ డగుట మిక్కిలి కష్టము. అతఁ డాపరీక్షను దేరినతోడనే దొరతనమువారు వానికి న్యాయాధిపతియుద్యోగము నొసఁగిరిగాని యాయూరతిదూరమున నుండుటచే వానితండ్రి కొడుకును దూరమునకుఁ బంపుట కిష్టములేక యుద్యోగము మానిపించెను. అందుచేత విద్యాసాగరుఁడు మరి రెండుసంవత్సరములు కళాశాలలోఁ జదువుకొని సాంఖ్యవైశేషికాదిషడ్దర్శనములు నేర్చి ప్రవీణుఁ డయ్యె. 1838వ సంవత్సరమున నాతఁడు చక్కని శైలితో సంస్కృతవచనమును వ్రాసినందుకు నూఱురూప్యములును బద్యకవిత్వము జెప్పినందు కేఁబదిరూప్యములును బారితోషికము బడసెను. మఱుచటిసంవత్సర మీశ్వరచంద్రుఁడు హిందూధర్మశాస్త్రపరీక్షయందుఁ గృతకృత్యుఁడై విద్య ముగించి విద్యాసాగరుఁ డనుబిరుదమును బడసెను. గీర్వాణభాష నభ్యసించెడుకాలముననే యప్పుడప్పుడించుక యింగ్లీషుభాషనుసయిత మాతఁడు నేర్చికొనెను. ఈశ్వరచంద్రుఁడు మొట్టమొదట సంస్కృతకళాశాలలో వ్యాకరణపండితుఁడుగఁ గొంతకాలము పనిచేసి, పిమ్మట 1840వ సంవత్సరమున ఫోర్టువిలియమ్ కళాశాలలో నెలకు నేబదిరూపాయలు జీతముగల ప్రధానపండితుఁడుగా నియమింపఁబడెను. ఈకాలమున దేశాభిమానులలో నగ్రగణ్యుఁ డగు బాబు సురేంద్రనాథబెనర్జీగారి తండ్రిగారగు దుర్గచరణబెనర్జీగారిసహాయమున నీశ్వరచంద్రుఁ డప్పుడప్పుడు మిగుల శ్రద్ధతో నాంగ్లేయభాష నభ్యసించెను. 1846వ సంవత్సరమున సంస్కృతకళాశాల కతఁడు సహాయకార్యదర్శిగా నియమింపఁబడి యాయుద్యోగమున నున్నపుడె విత్థలపంచవింశతి యను బంగాళీ వచనకావ్యము నొకదానిని వ్రాసి ప్రచురించెను.

ఈశ్వరచంద్రుని పరిశుద్ధశైలియు రచనాచమత్కృతియుఁ గనుఁగొని దేశస్థులందఱు బంగాళీభాష నంత రసవంతముగ మనోహరముగ వ్రాయుటకు వీలున్నదని యప్పుడు గ్రహించిరి. ఆయుద్యోగమున నున్నపు డాయన పలమార్పులఁ దెచ్చి కళాశాలను వృద్ధిపొందించెనుగాని చిరకాల ముండలేదు. 1849వ సంవత్సరమున నతఁడు ఫోర్టువిలియమ్ కళాశాలలో నెల కేనుబదిరూపాయలు జీతముగల మొదటిగుమాస్తాగానే ప్రవేశించి యచట నున్నకాలములోనే స్త్రీవిద్యావిషయమున నాదినములలో గడుబరిశ్రమ చేసిన బెత్యూన్ దొరగారి స్నేహము సంపాదించెను. మఱుచటిసంవత్సర

మున మరల నతఁడు సంస్కృతకళాశాలలోఁ దొంబదిరూపాయల జీతముగల పండితుఁడుగాఁ జేరి కొలఁదికాలములోనే యాకళాశాలా ప్రధానోపాధ్యాయుఁ డయ్యెను. మనపండితులు సంస్కృతభాషను విద్యార్థులకు సుబోధక మగునట్లు తెలుపలేక శిష్యులను బాధపెట్టి తాము బాధపడుటఁ జూచి విద్యాసాగరుఁడు సంస్కృతకళాశాలకుఁ బ్రధానోపాధ్యాయుఁడుగా నున్నకాలమున గీర్వాణభాషను బాలురు చులకనఁగ నేర్చుకొనుటకుఁ గొన్నిపద్ధతులఁ గనిపెట్టెను. నాఁటనుండియు సంస్కృతవిద్యాభ్యాసము సులభసాధ్య మయ్యెను. 1851వ సంవత్సరమున వానిమిత్రుఁ డగు బెత్యూన్ దొర కాలధర్మము నొంద నప్పటి బంగాళాదేశపు గవర్నరు హాలిడే యనునతఁడు బెత్యూన్ పాఠశాలకు విద్యాసాగరు నధికారిగా నేర్పరచెను. 1885వ సంవత్సరమున నీపండితశిఖామణి హుగ్లీ, నద్యా మొదలగు నాలుగుజిల్లాలకు పాఠశాలాపరీక్షాధికారిగా నియమింపఁబడి నెల కైదువందలరూపాయల జీతము నార్జింప నారంభించెను. ఈయుద్యోగమునం దున్నపుడే యాతఁడు హుగ్లీ బర్ద్వాన్ మండలములలో నలువది బాలికాపాఠశాలలు స్థాపించెను.

ఆకాలమున బంగాళాదేశమునందలి పాఠశాలలకు 'యంగ్'ను నొకదొరగారు డైరక్టరుగానుండిరి. ఆయనయించుక యధికారగర్వముగలవాఁడగుటచే స్వతంత్రబుద్ధిగల విద్యాసాగరునకు తనపైయధికారితో సరిపడక పొరపులు కలుగుచు వచ్చెను. ఇట్లు క్రమక్రమముగ మనస్పర్ధ లధిక మగుచుండ నొకనాఁడు దొరగారు విద్యాసాగరునిం బిలిచి హిందూకళాశాల ప్రధానోపాధ్యాయునియొద్దకుఁ బోయి యొకమాట చెప్పిరమ్మని యాజ్ఞాపించెను. విద్యాసాగరునకాపని స్వగౌరవభంగకరముగాఁ దోఁచినందున తనతో దొరగారుఁగూడ వచ్చినయెడల దా నచ్చోటికిఁ బోవుదు ననియు దా నొక్కఁడు బోనొల్లననియు నతఁ డుత్తరము చెప్పెను. విద్యాశాఖ కెల్ల సర్వాధికారియగు తన్నుఁ దనచేతిక్రిందియుద్యోగస్థుఁడు తిరస్కరించుటచే దొరగారు కోపించి నీ విది చేయక తప్పదని విద్యాసాగరునితోఁ బలికెను. విద్యాసాగరుఁడు వెంటనే జేబులోనుంచి యొక కాగితముఁ దీసి తనయుద్యోగమునకు విడుదల వ్రాసియిచ్చి నా కిష్టములేనిపని చేయుట యిప్పుడు తప్పునా! యని యడిగెను. బంగాళాదేశపుగవర్నరగు 'హాలిడే' యనునాతఁ డీశ్వరచంద్రునకు నాప్తమిత్రుఁ డగుటచే నుద్యోగమును మానుకొనవలదని యతఁ డెన్నివిధములనో విద్యాసాగరుని బ్రతిమాలెను; కాని వానిప్రార్థనలు విద్యాసాగరుని నిశ్చలచిత్తమును జలింపఁజాల వయ్యెను.

ఈవిధముగ దొరతనమువారికొలువు కడముట్ట నేయక నడుమనే ముగించి విద్యాసాగరుఁడు నిర్వ్యాపారుఁడుగాక తనదేశమునకు మునుపటికంటె నినుమిక్కిలిగా నుపకారముఁ జేయఁగలవాఁడయ్యె. బుద్ధి సర్వతోముఖవ్యాప్తముకాఁగా నాతఁడు బహుగ్రంథనిర్మాతయై విద్యావిశారదుఁడై సంఘసంస్కారకుఁడై భూతదయాళువై జన్మము చరితార్థముగఁ జేసికొనెను. బంగాళీభాషలో వానివ్రాతలు మృదువులై మధురములై పరిశుద్ధములై శయ్యాసౌష్ఠవమునకు గణుతిగాంచినవి. పైనుదాహరింపఁబడినగ్రంథము గాక బంగాళాదేశచరిత్రము, సత్పురుషులజీవచరిత్రము, బోధోదయము, సీతావనవాసము మొదలగుగ్రంథములు రచించి ప్రచురించెను. ఇవిగాక సంస్కృతమున కాళిదాసప్రణీతమగు శాకుంతలనాటకమును బంగాళీలోనికి భాషాంతరీకరించెను. స్త్రీవిద్య యన్నచో నీతని కభిమాన మెక్కుడగుటచే తద్విషయమై యావజ్జీవము నధిక పరిశ్రమ జేసెను. 'బెత్యూను' పాఠశాల యభివృద్ధినొందుటకుఁ గారణము విద్యాసాగరునకు దానిపైఁగల యభిమానము దానివిషయమై పడినపరిశ్రమ కారణములని గ్రహింపవలెను. స్త్రీవిద్య యెడల నీయనకుఁగల యాదరమునుబట్టి బెత్యూన్ కళాశాలలో మూడవతరగతిలో జదువుకొని ప్రవేశపరీక్షకుఁ బోవఁదలఁచు హిందూబాలికకు విద్యాసాగరుని జ్ఞాపకార్థము విద్యార్థివేతన మొకటి యిప్పటికి నీయఁబడుచున్నది. సర్వకళాశాలలలో నాంగ్లేయ పండితు లుపాధ్యాయులై యెంతచక్కఁగఁ బనిచేయుదురో స్వదేశీయులు నట్లే యింగ్లీషుభాషలో పండితులై యుపాధ్యాయులై కళాశాలల నిర్వహింప సమర్థులని లోకమునకుఁ దెలియఁజేయుటకై విద్యాసాగరుఁడు మెట్రోపాలిటన్ కాలేజను పేర నొకకళాశాలను స్థాపించెను. ఇది బంగాళాదేశములోని సర్వకళాశాలలో శ్రేష్ఠమైనదని కీర్తిఁ బడసినది. దొరతనమువారి క్రిందియుద్యోగమును మానుకొనుటచే నాతనికి ధననష్టమించుకయు గలుగలేదు. పాఠశాలలలో బాలురు చదువుటకుపయుక్తము లగు పుస్తకము లదివరకు బంగాళీభాషలో లేమింజేసి విద్యాసాగరుఁ డుద్యోగము మానిన పిదప నట్టిగ్రంథముల వ్రాసి ప్రచురించెను. ప్రతిపల్లెయందు ప్రతిపాఠశాలయందు ప్రతిబాలకుఁడు వానిగ్రంథములనే జదువుటచే నాతనికి రమారమి నెల కైదువేలరూపాయలాదాయము కొంతకాలమును మూఁడువేలరూపాయలురాబడి కొంతకాలమును వచ్చెను. బంగాళాదేశపుపాఠశాలలలో నిప్పటికిని వానిచేత రచియింపఁబడిన సంస్కృతగ్రంథములు బంగాళీగ్రంథములు చదువఁబడుచున్నవి. ఆభాషలో రచనాచమత్కృతి గల పండితు లితీవల బహుగ్రంథములు రచించిరిగాని యవి విద్యాసాగరుని గ్రంథములకు సరిపోలవయ్యె. అందుచేత బంగాళీభాష కతఁడు గ్రంథరూపమునఁ జేసినమహోపకారమునకు వానియెడ దేశస్థులు కృతజ్ఞులై యున్నవారు.

సంఘసంస్కారవిషయమున విద్యాసాగరుఁడు చేసినపని యసమానము. ఇతఁడే హిందూదేశమున స్త్రీపునర్వివాహముల నుద్ధరించిన ప్రథమాచార్యుఁడు. ఇతఁ డీపనికిఁ బూనుటను గూర్చి యొకచిన్నకథ గలదు. వారిదగ్గరచుట్టములలో నొకనికూఁతు రతి బాల్యమున విధంతు వయ్యెను. తలిదండ్రులా పెం దోడ్కొని మార్గవశమున నీపండితుని యింటికి రాఁగా విద్యాసాగరునితల్లి యాబాలిక చక్కఁదనమును లేఁబ్రాయమును జూచి దుఃఖపడి కొడుకువద్దకుఁ బోయి 'నాయనా! నీవింతపండితుఁడవు. ఈబాలికను దుర్గతి నుండి తొలగించి వివాహము చేయుటకు శాస్త్రములయం దెచ్చట నాధారము లేదా' యని యడిగెనట. తల్లిమాటల నాదరముతో విని బాలికయవస్థకుఁ దాను మనసు కరుగ వగచి యానాఁడు మొదలతఁడు స్త్రీపునర్వివాహవిషయమున నాధారములున్నవో లేవో కనుఁగొనుటకై శాస్త్రములు శోధించెను. 1854 సం: న నతఁడు స్త్రీపునర్వివాహము శాస్త్రీయమని సిద్ధాంతీకరించి విధవావివేకమను పేర నొకచిన్నగ్రంథము వ్రాసెను. ఆపుస్తకము బయలు వెడలినతోడనే బంగాళాదేశమంతయు సంక్షోభమునొందెను. పూర్వాచారపక్షమునను సంస్కారపక్షమునను దేశమునం దంతట ననేకసభలు జరిగెను. వాదప్రతివాదములు ప్రచురింపఁబడెను. వంగదేశమునం దంతట వ్యాకరణశాస్త్రమున నసమానుఁడని పేరువడిన యొకమహాపండితుఁడు విధవావివేకమును ఖండించుచు నొకగ్రంథమును సంస్కృతమున వ్రాసెను. ఆగ్రంథము జనులకు దెలియనిదేవభాషలో నుండుటచేత జనులాగ్రంథమును జదువలేక స్వభాషలో రచింపఁబడిన విద్యాసాగరుని పుస్తకమును జదివి దానిసత్యమును గ్రహించిరి. ఈశ్వచంద్రుని ప్రోత్సాహముచేత దొరతనమువారు స్త్రీపునర్వివాహములు చేసికొన్నవారికి పిత్రార్జితమగు నాస్తిలో భాగములు పోవని శాసించుచు 1856సం॥న నొకచట్టమును నిర్మించిరి. అదిమొదలు తద్విషయమున బాటుపడి యామహాత్ముఁడు 1856వ సం॥ డిశంబరు 7వ తారీఖున కలకత్తాలోఁ దనయింటిలో మొదటిస్త్రీపునర్వివాహమును జేసెను. అదియకార్యమని యతనిని దేశస్థులు తూలనాడిరి. కులస్థులు బహిష్కరించిరి. ఆప్తబాంధవు లావలకుం దొలంగిరి. ప్రాణమిత్రులు పరిత్యజించిరి. ఎల్లకాలము నతనిప్రక్కనునిలిచి పనిచేయు దుమని వాగ్దానములు చేసిన పెద్దమనుష్యులు మొగములు చాటువేసిరి. ఇట్లు దేశస్థులచే విడువఁబడియు విద్యాసాగరుఁడుతనకావించినకార్యంబు శాస్త్రసమ్మతమనియుఁ జగద్ధితకరమనియు నీతిప్రవర్ధకమనియు నమ్మి యించుకయేనియు జలింపక ధైర్యసారము గలిగి పర్వతమువలె చెక్కుచెదరక నిలిచి వివాహము వెంబడిని వివాహముఁ జేయనారంభించెను. ఈపెండ్లిండ్లువైభవముతోఁ జేయుటంజేసి యితఁడప్పులపాలయ్యె. ఆసమయమున ధనికులగు మిత్రులనేకులువచ్చి ద్రవ్యసహాయము చేసి యాదుకొనుటకు రాఁగా విద్యాసా

గపుడు వారివలన నించుకేనియు సహాయముఁ గొనక యాభారమునుతానే వహించెను. ఇతరులకు ధర్మోపన్యాసములు చేసి తాము దూరముననుండునట్టి యీనాటి సంఘసంస్కర్తలు కొందఱివలె గాక యాపండితుఁడు తనపూనినపనియందు నిజమైనయభిమానము గలవాఁడగుటచే దనకుమారున కొకవితంతుబాలికను వివాహము చేసి చెప్పెడుమాటలకును జేసెడుచేతలకును వైరుధ్యము లేదని జగంబునకు వెల్లడిచేసెను. ఈతెఱంగున పునఃపరిణయంబునఁ గృతకృత్యుఁడై యంతతోఁ దనివినొందక విద్యాసాగరుఁడు కులీనపద్ధతి యనుదురాచారముపై ధ్వజ మెత్తి దానిని నిర్మూలించుటకుఁ బాటుపడెను. ఆదేశమున నగ్రగణ్యులు కులీనబ్రాహ్మణు లగుటచే వారిలో నొక్కొక్కఁడు నలువదియేబదియాడుపాండ్రను పెండ్లియాడి యేభార్యతండ్రి యెక్కుడుకట్నములు కానుకలు నిచ్చునో యాభార్య నాదరించుచు తక్కినవారల నిరాకరించుచు పడఁతులను బలువెతలపాలు సేయుచుందురు. విద్యాసాగరుఁడు నోరులేని యంగనలపక్షము బూని యనేకసభలు చేసి కొట్టకొన కాదురాచారము నిర్మూలింప నొకచట్టము నిర్మింపుఁడని దొరతనమువారికి వేనవేలు జనులచేత వ్రాళ్లు చేయించి మహజర్ల నంపించెను. కాని వితంతువివాహవిషయమునందు బలెనతఁ డీకార్యమునందు సఫలమనోరథుఁడు కాఁడయ్యె. హిందువులు వేదశాస్త్రములు తమకుం బ్రమాణములని వాదములు సలుపుటచే స్త్రీపునర్వివాహాదికార్యము లకార్యములు గావని యాగ్రంథములయందుఁ బ్రమాణవచనములు జూపినచో నందఱొప్పుకొందురని విద్యాసాగరుఁడు కొంతకాలము నమ్మియుండెను కాని శాస్త్రప్రమాణములు జూపినవెనుక నయితము హిందువులు పునర్వివాహాదుల నిరాకరించినప్పుడు నిజముగా హిందువులకు వేదశాస్త్రములయందు నమ్మకములేదని యాతఁ డిటీవల నిశ్చయించుకొనెను. బాలికలకుఁ గడుచిన్నతనమునందె వివాహములు సేయుట దురాచారమని యాతని యభిప్రాయము. నమ్మినట్లు నడచుకొనునట్టి యంతఃకరణశుద్ధుఁ డగుటచే విద్యాసాగరుఁడు తనకూఁతులకు వ్యక్తిరాకమునుపు విహాములు సేయఁడయ్యె.

విద్యాసాగరుఁడు దయాసాగరుఁడు, ఆర్తజనుల కాపద్బాంధవుఁడు; నిరుపేదలకు నిక్షేపము; పేర మెచ్చులదాత గాక యాతఁడు పేదలకొఱకు ననదలకొఱకు గతిలేనివారికొఱకువగచి మనఃపూర్వకముగ ననేకదానములు చేసెను. మధుసూధనదత్తను బంగాళీ కవీశ్వరుఁ డొకఁ డప్పులపాలయి ఋణములు దీర్చలేక చెఱసాలకుఁ బోవుటకు సిద్ధముగనున్నప్పుడు విద్యాసాగరుఁడు ఋణప్రదాతల కాధన మిచ్చి వానివిడిపించెను. స్థితిచెడియున్నమిత్రులకుటుంబములకు బంధువులకుటుంబములకు ధనసాహాయ్యము చేసి వారిగౌరవము చెడకుండునట్లు లేర్పాటులు చేసెను. స్వగ్రామమున బీదబాలురువిద్య నేర్చికొనుటకై యొకధర్మపాఠశాలనుదనతల్లిపేర స్థాపించెను. తనయూరికిఁ బోయినప్పుడెల్ల నైదువం

డలయూపాయిలువిలువగలబట్టలు కొనితీసికొనిపోయి యచ్చటనిరుపేదల కుచితముగఁ బంచి పెట్టుచుండును. స్వగ్రామమున జనులసౌఖ్యమునకై ధర్మవైద్యశాలనొకదానిని స్థాపించి దానికగువ్యయమంతయుఁ దానేయిచ్చినిలిపెను. 'ఇండియన్ అసోసియేషన' ను సభవారు కట్టించినమందిరమునకు వేయిరూపాయిలు దానమిచ్చెను. హిందూకుటుంబభరణనిధి (Hindu family annuity fund) యనుపేర తక్కువజీతములు గల వారిలాభమునిమిత్త మొకసంఘము వీనిసహాయమువలననే బయలువెడలెను. అది వంగదేశమునందలి సంఘములన్నిటిలో ముఖ్యమైనదని చెప్పవచ్చును 1868వ సంవత్సరమున బంగాళామందు దారుణమగు కాటకము సంభవింప విద్యాసాగరుఁడు దొరతనమువారిని బురికొల్పి కఱవుచేఁ బీడింపఁబడువారికిఁ బనులు గల్పింపఁ జేసియు తాను స్వయముగ నన్నసత్రములు వేయించియు దరిద్రుల ననేకుల రక్షించెను. 1869వ సంవత్సరమున బర్ద్వాను పట్టణములో మన్నెపుజ్వరములు బయలుదేర జనులు తగినవైద్యసహాయము లేక వందలకొలఁది మృతినొందిరి. అప్పు డీశ్వరచంద్రుఁడు కావలసినమందులు కొని యక్కడకుం గొంపోయి యచ్చటివారి కుచితముగఁ బంచిపెట్టి సాయముచేసెను.

విద్యాసాగరుఁడుపరులధనము చిల్లపెంకువలె జూచునంతటి సత్పురుషుఁడు. ఒకమారతఁడు తనధనమంతయు లెక్కజూచుకొనుచుండ లెక్కలంబట్టి తనయొద్దనుండఁదగిన సొమ్ముకంటె నెక్కువ గానఁబడియె. అది చూచి యీశ్వరచంద్రుఁడు మున్ను తాను పాఠశాలాపరీక్షాధికారిగా నున్నపుడు దొరతనమువారిసొమ్ము కొంతపొరబాటున దన సొమ్ములోఁ బడియుండునని యనుమానించి 'ఎకౌంటెంటు జనరల్' గారికి వ్రాసి యాధనమును గ్రహింపుమని ప్రార్థించెను. ఆయన యాసొమ్ము దొరతనమువారికి రావలసిన పనిలేదని నొక్కి చెప్పినను వినక విద్యాసాగరుఁ డామిక్కిలిసొమ్ము దొరతనమువారికిచ్చి తనయంతరాత్మను సందేహమునుండి విముక్తిఁ జేసెను. ఆహాహా! ఇట్టిపరిశుద్ధచరిత్రమును ఋజుమార్గవర్తనమును గలవానిని వ్రేలుమడచి చూపుట యెంతకష్టమో మీరే యెఱుంగుదురు.

“మిస్ మేరీకార్పెంటరను దొరసాని కలకత్తానగరమునకువచ్చి దేశమునందలి బాలికాపాఠశాలలను గొన్నిటినిజూడవలయునని కోరి వానిం జూపుటకు విద్యాసాగరునిం దనవెంటఁబెట్టుకొనిపోయెను. అతఁ డామెకాయాస్థానములంజూపి మరలి వచ్చుచుండ మార్గమధ్యమున దైవవశమున బండి బోర్లపడ విద్యాసాగరుఁడు దెబ్బలచే స్మృతి దప్పి నేలంబడియె. తగుచికిత్సలు చేసినపిదప కొంతకాలమున కతఁడు మరల బాగుకొనియెగాని తొల్లిటియారోగ్యము దేహదార్ఢ్యము పొందియు రావయ్యె. ఇట్లు దుర్బలశరీరముతోడనే తరువాత నిరువదియైదువత్సరములు గడపెను. సొంతాలుపరగణాలో

నున్న కార్మాతారు గ్రామమును దనకు నివాసస్థానముగఁ జేసికొని యవసానకాల మచ్చటఁ గడప నిశ్చయించుకొని యతఁ డచ్చటికిఁ బోయియుండెను. 1890సంవత్సరమున డిశంబరు నెలలోఁ దనదేహస్థితి బొత్తుగ చెడిపోవుటచేఁ గొంతకాలము చంద్రనగరమునకుఁ బోయియుండి యచ్చట స్వస్థత గానక చిట్టచివరకుఁ గలకత్తానగరముఁ జేరి యంత కంతకు క్షీణించి 1891సంవత్సరము జూలైనెల 29వ తారీఖున విద్యాసాగరుఁడు జీవయాత్ర ముగించి లోకాంతరగతుఁ డయ్యెను.

1877సంవత్సరము జనవరియొకటవ తారీఖున విక్టోరియారాణి హిందూదేశచక్రవర్తినీ మహాబిరుదము ధరించినప్పుడు కలకత్తాలో దొరతనమువారు విద్యాసాగరునకు నొక గౌరవపత్రికను దయచేసిరి. 1890సంవత్సరము జనవరినెలలో జరిగినదర్బారులో దొరతనమువారతనికి సి.ఐ.ఇ. బిరుదమునిచ్చిరి. ఈమహాత్ముఁడు మహాధనవంతుఁడు విద్యావంతుఁడు కీర్తిమంతుఁడునయ్యు వేషభాషలలో సామాన్యులవలెనుండెనిగర్వచూడామణియై యుండెను. నిజమైనదేశాభిమానమును బరోపకారబుద్ధియు ధర్మకార్యతత్పరత్వమున నీతనివద్ద నుండి యే నేర్చుకొనవలయును. విద్యాసాగరుఁడు కృపారసపూర్ణుఁడై గుణరత్ననిలయుఁడై గాంభీర్యనిధియై సత్వసంపన్నుఁడై భంగసంగతుఁడుగాక మరియాద నతిక్రమింపక సాగరశబ్దము తనయందు సార్థకమగునట్టు నడచిన లోకోత్తరచరిత్రుఁడు. క్రింది యుద్యోగస్థులు స్వగౌరవమును జంపుకొని తమయధికారు లేకూఁతలు కూయుమన్న నవి కూయుచు నే వ్రాతలు వ్రాయుమన్న నవి వ్రాయుచు నే చేతలు చేయుమన్న నవి చేయుచుఁ బ్రజలను వేధించు నీకాలములో నెల కైదువందలరూపాయిలు జీతము గలిగి యధికారము గలిగి గౌరవమును దెచ్చు నుద్యోగమును తృణప్రాయముగ నెంచి వదలుకొన్న స్వతంత్రుఁ డీవిద్యాసాగరుఁడే. ప్రజలపొగడ్తలకు పొంగక దూషణలకు దుఃఖపడక బహిష్కారమునకు భయపడక కష్టములను గణనసేయక తనకు ధర్మకార్యమని తోఁచినదానిని విడువక కొనసాగించి "పరోపకారార్థమిదంశరీర" మనుమాట సార్థకము చేసిన మహాత్ముఁ డీశ్వరచంద్రుఁడే. మెత్తనిమనసుగలవాఁ డయ్యు దృఢచిత్తుఁడు. పరమశాంతుఁ డయ్యుఁ దుష్టులకు భయంకరుఁడు నమ్మిన ట్లాచరించుటయందును మనసులో నున్నమాట నిర్భయముగఁ బలుకుటయందును పరులసౌఖ్యమునకై స్వసౌఖ్యము మానుకొని కష్టపడుటయందును నతని కతండె సాటియనవచ్చును. అతని యౌదార్యము నతనివినయము నతనిసౌజన్యము నతనిశాంతము వానివిద్యకు వన్నె పెట్టినవి. దేశమునకతఁ డొనర్చిన మహోపకారమునకు దేశస్థులలోఁ గొందఱు కృతజ్ఞులై వానిగుణగణంబులఁ గొనియాడుచు నెన్నియో పాటలు పద్యములు రచించిరి. అవి యిప్పటికిని బంగాళాదేశమున మూలమూలలనయితము పాడఁబడుచుండును.

నాల్గవ ప్రకరణము.

అంతశ్శోకమును బాహ్యోపచారములు మాన్పఁజాలవు. చక్కని వెన్నెలలు చల్లని జలములు మంచిగంధపుఁబూతలు శరీరమునకు సౌఖ్యమొసంగ నేర్చునుగాని శోకాగ్నిచే మఱుఁగుచున్న మనస్సునకు శాంతి కలుగఁజేయఁజాలవు. ఎండవేఁడిమిచే మలమల మాఁడిన నేలను కుంభవృష్టి గురిసి చల్లఁబడఁజేయునట్లు దుఃఖానలసంతప్తమగు మనస్సును కృపారసశీతలంబులగు సాధుజనవచనంబులే శోకపువేఁడిమి నడఁచి శాంతి నొందింపఁగలవు. నాఁటిరాత్రి బ్రాహ్మణుఁ డెంతసేపు పండువెన్నెలలోఁ గూరుచున్న నెంతసేపు చంద్రకరస్పర్శనంబున వాని మేను జల్లఁబడిన సుమిత్రుని నోటనుండి చల్లనిమాటలు బయలువెడలువఱకు మనస్సు శోకమునుండి విముక్తిఁ జెందదయ్యె. అత్యాదరమును జూపు సుమిత్రుని వచనముల వినినతోడనే రుద్రభట్టు తనదుఃఖము నంతయు మఱచి వాని నించుక సేపు కొనియాడి యిట్లనియె. "మిత్రనిధీ! నా యవస్థ సవిస్తరముగ విన్నవించితిని. నీపరిచయంబు గలుగుట మొదలు నీవృత్తాంతంబు విన నాకుం గుతూహలము పొడమియున్నది. నా యుదంతము నీ కెఱింగించిన వెనుక నీచరితంబు నాకుం దెలుపునట్లు నీవు వాగ్దానము చేసియుంటివి. నాకథ నేముగించితిని గాన నింక గొంత నీయుదియు. నిన్నుం జూచినప్పటి నుండియు నది యేమో కాని నీవు ప్రచ్ఛన్నవేషుఁడవనియు గోప్యమగు కారణాంతరమున నీవీకుగ్రామమున వసియింపవలసెననియు నాకుఁ గట్టిగఁ దోఁచుచున్నయది. నీసుఖవిలాసంబును నీమాటల పొందికయు నీప్రజ్ఞయుఁ జూడ నీవుత్తమరాజకులంబునఁ బుట్టియుందువనియు మహీమండలంబును బాలింప సమర్థుఁడవనియు సులభముగఁ దెలిసికొనవచ్చును. నీమనస్సు దీర్ఘవిచారభారముచేత క్రుంగియున్నదని నీవెంత దాఁచినను నీముఖంబున స్పష్టముగఁ గనవచ్చును. కుండలోనిడిన దీపములాగు నీవీపల్లియ నుండుటంజేసి జగంబునకు నీసహజతేజము గానఁబడుచుండుటలేదు. గడ్డిలోఁ గప్పఁబడియుండు కాయయట్లు మేఘములచాటున మఱుఁగుపడియుండు సూర్యబింబమట్లు నిగురుగప్పిననిప్పులట్లు నీ విట్లుండుటకుఁ గారణమేమి? నీవు నాకు సుమిత్రుఁడ వగుదువుకాని నీపేరు సుమిత్రుఁడు కాదని నామనస్సు చెప్పుచున్నది. నీచరితంబు పరమరహస్యముగ నుండవలయునని నీవు కోరుదువేని నే నది యెవ్వరికిని వెలిఁబుచ్చ. నీకథ వినినపిదప మనస్నేహబంధంబు మఱింత దృఢ మగునని నాకు నమ్మకము గలదు. అందుచేత జను

రంగమున రెండుగుఱ్ఱము లొకదానికొకటి కావుగ నుండి యన్యోన్యసంరక్షణము ను
జేసికొనునట్లు నాకు నీవును నీకు నేనును సహాయము గావించుకొని సుఖింపవచ్చును.
నా ప్రజ్ఞాదికములు నేను జెప్పకొనఁగూడదు కాని యీరుద్రభట్టు పరమఛాందసుఁ డట్లు
నీ కగపడుచున్నను లోకవ్యవహారములఁ జక్కఁగ నెఱిఁగిన దిట్టరి సుమీ! బూడిదఁ
బూసుకొని తావళముఁ ద్రిప్పుచు జపము చేసికొను నీవైదికుఁడు నాకేమి సాయము చేయఁ
గలండని నీవు తలఁపవలదు. శాస్త్రాభ్యాసముచే బుద్ధినిపుణత యతిశయించిన
లోకజ్ఞుఁడను గాని వేదజడుఁడను గాను. రాజనీతిం దెలుపు శుక్రనీతి మొదలగు సద్గ్రంథ
ముల నామూలాగ్రముగఁ జదివినవాఁడ. కత్తి చేబూని పగతుర గొంతులు కోయువాలను
గాని యింటివద్దనుండి మిత్రులకుపాయంబులు సెప్పి యుపాయంబులు గడపి శాత్రవుల
నిర్మూలింపఁ జాలుదును. కావున నింక సందియంబడక నీయుదంతము నెఱిఁగింపుము.”
అని రుద్రభట్టు పలుకుటయు సుమిత్రుఁడు బ్రాహ్మణుఁడు విశ్వాస ముంచదగినవాఁ
డనియు నేకార్యము సలుపుటకయిన సమర్థుఁడనియు నెఱిఁగి తనవృత్తాంతముఁ జెప్పఁ
దగునా తగదా యని రెండుమూడుసారులు తనలో తాను వితర్కించుకొని కొంతకాలము
నుండి తనహృదయమును బీడించుచున్న శోకభారమునకుఁ గారణము వెలిపుచ్చుటయే
యుత్తమమని యెట్టకేలకు నిశ్చయించి యిట్లని చెప్పఁదొడంగె. “విప్రపుంగవా!
నీచెలికారంబు గలిగినది మొదలు బహుశాస్త్రంబులు కరతలామలకముగ నీ వెఱుం
గుటయు రాజనీతివిశారదుఁడ వగుటయు నీసంభాషణంబులం దేటపడియె. నాచరిత్రంబు
నిన్నుఁ బోలుసజ్జనుం డెఱిఁగినచో నాకందువలన కొంతలాభమే యగును కాని నష్టంబు
కలుగదు. మనస్సు శోకపూరిత మగునప్పుడు మనుష్యుఁడు తనదుఃఖమును నొరుల
కెఱింగించినచో నది కొంత యుపశమించు. శుభవార్త లితరుల కెఱింగించిన
కొలఁది యానందము హెచ్చు. కావున నాకథ నీ కెఱింగించుటకు నా కేసంది
యంబును లేదు. నాయుదంతము మీ కెఱిఁగించుటకు మున్న నాకుం బరమాప్తుఁ
డగు నొకనికథ దెలుపవలసి యున్నది. తెలిపెద వినుము. భూమండలమున గలదేశము
లన్నిఁటి భరతఖండ మెప్రశస్తతమము. అందార్యావర్తము శ్రేష్ఠము. అందు హిమవత్ప్రాం
తము పుణ్యప్రదము. అందు కాశ్మీరము దర్శనీయము. ఆదేశంబు కుంకుమపువ్వునకుం
బుట్టినతావు. కాశ్మీరమునం దది యుదయించుట చేతనే దానికిఁ గాశ్మీరమని పేరుగలిగె.
మందిగంధంబును బచ్చకప్పురంబును జాజిపూవులు నచ్చట సమృద్ధిగా లభించుటం
జేసియు నేల సకలసస్యములు సమృద్ధిగఁ బండుటం జేసియు నచ్చటియేఱు లెడ
తెగక ప్రవహించుచుఁ బొలములకుఁ దోఁటలకు జీవనము లొసంగుటం జేసియు, నచటియంగ

నీల ముంపర పేర్పు టువిసలు దిగదుడుపుసేకయినఁ బసికిలాకుంపుటం జేసియు నది భూలోకస్వర్గమని కొందఱు కవులు వర్ణించియుండిరి. వేయేల? యచ్చటిపూఁదోఁటలు నందనవనంబులు. అచటికాంత లప్సరసలు. అచటియేఱు లమృతస్రవంతులు. ఆ దేశంబునకు రాజధాని శ్రీనగరము. కామధేనువు కల్పవృక్షములు లేనివెలితి యొక్క-టియెగాని దానికి నమరావతంబునకు భేద మించుకయు లేదు. ఆవిషయంబునకు విక్రమసేనుఁ డనురాజు నాయకుఁడయి చిరకాలము మహీభారముఁ బూని ప్రజలం గన్నబిడ్డలట్లు కాపాడి ధర్మస్వరూపుఁ డనిపించుకొని కొన్నియేండ్లక్రిందట కీర్తిశేషుఁ డయ్యె. వానికి రెండుకన్నులుంబోలె నిరువురుకుమారులు హేమచంద్రుఁడు, చిత్రభానుఁ డనువార లున్నారు. తండ్రిపరోక్షమున జ్యేష్ఠుఁ డగుహేమచంద్రుఁడు రాజ్యమున కభిషిక్తుఁడయి గద్దె యెక్కి ప్రజాపాలనంబు సేయుచున్నవాఁడు. హేమచంద్రుఁడు చిత్రభానునియెడఁ బుత్రస్నేహము నిలిపి వానికిం దండ్రిలేనివెలితి లేకుండ గాపాడుచు వచ్చె. 'పితృసమో జ్యేష్ఠః' యను లోకోక్తి ననుసరించి చిత్రభానుఁడు సోదరునియెడ గులు గడుభక్తి భజియించుచు నన్నమన్ననలకుం బాత్రుఁడై యువరాజయి యుండె. ఇట్లుండ పాంచాలదేశాధీశ్వరుఁడు మహేంద్రదేవు గారాపుకూఁతు రగునరవింద యను కన్యకు స్వయంవరంబు ప్రవర్తిల్లె. ఆస్వయంవరంబునకు నిఖిలదేశంబులనుంచి రాజకుమారు లందఱు బోయియుండిరి. అరవిందాదేవి తామరపువ్వుకన్న సుకుమార మగుమేనిజిగిం దాల్చి యొప్పు. హేమచంద్రుఁడు చంద్రునకు వంక లుదిద్దగల సోయగము వాఁడు. హేమచంద్రుని గుణరూపంబుల నరవిందయు నరవిందగుణరూపంబుల హేమచంద్రుఁ డును వినుచున్కి వారికొండొరులపై వలపులు నిలిచె. ఆకారణంబున నాబాలిక స్వయంవరమున హేమచంద్రునే వరియించె. అయెలనాఁగను బాణిగ్రహణముఁ జేసి కొని హేమచంద్రుఁడు తనయంతిపురంబునకుం దోడ్కొనివచ్చిన దాదిగ నేటివఱకు నాబోటి గీచినగీటు దాఁటఁడు. ఆమెమాట కెదురు బలుకఁడు. ఆమెయానతి శిరసా వహించు. వేయేల? ఆతని కామె బెట్టినదే భిక్షము. ఆనెలఁత యేమిమాయలు పన్నెనో యేమిమందులు పెట్టెనో యెట్టివలపులు గొలిపెనో యెట్టికొండెములు చెప్పెనోగాని యామె యంతిపురమున నడుగువెట్టినదిమొదలు రాజునకుఁ దమ్మునిపై దొంటియను రాగము నిలువదయ్యె. బ్రాహ్మణోత్తమా! ఒక్కనెలవునఁ బుట్టినను రాజునకుం దమ్ములకు సహజవైర మగుట లోకప్రసిద్ధముగదా. తమ్ములు వికాశము గలిగి విలసిల్లునప్పుడు రాజు చూపోపమిచే నచట నుండక యావలికిం బోవు. అతఁ డట్లుండుటచే దమ్ములును వానివర్తనం బనుసరించి రాజు సంపూర్ణుఁడయి శోభిల్లునప్పుడు మొగంబులు

మనసు చికాకుగ నుండుట యాశ్చర్యము గాదు. రాజు మహోన్నతపదమునం దుండుటయు దస్యులనుగంటి యుండుటయు సంభవించుచుండునుగాన వారి కైకమత్యము సాధారణముగా నుండదు. దానికిం దోడు ప్రియురాండ్రు సోదరుల విషమని చెవి నిల్లు గట్టుకొని పోరుచు విషము నూరిపోసినట్లు నేరములు చెప్పను దుష్టాంతఃపురపు గలిగిన దానిఁ బోషణము చేసి పెంచుచు కోపాగ్ని రగులుకొనునట్లు సమిధలవంటిమాటలు ప్రయోగించుచుందురేని యింకఁ జెప్పవలసినదేమి మహాత్మా! ఆఁడుదాని చేతిబొమ్మవలె నుండి యది యెట్లాడించిన నట్లాడు మగవాఁడు తనవారి కపకారంబు సేయఁడే? అదిగాక స్త్రీలు భర్తమన స్సెఱిఁగి సమయోచితంబుగఁ గీలెఱిఁగి వాతబెట్టినట్లు కిట్టనివారిపైఁ బగలు బోధించుటలో కడుం బ్రోడ లనుట నీ వెఱుంగుదువు. అందుచే నన్నదమ్ములకు స్పర్ధలు జనించె. ఆయన నెఱిఁగి కొండెగాండ్రు తమ్మునిపై నేరముల నన్నతో నన్నపై నేరముల తమ్మునితో నున్నవికొన్ని లేనివికొన్ని చెప్పి వైరంబు వర్ధిల్లఁ జేసిరి. అమ్మా! మీతోడం జెప్పమఱచితి. హేమచంద్రుని వివాహ మయిన కొన్నిదినములకు చిత్రభానునకును బరిణయం బయ్యె. విదర్భేశ్వరుం డగు రాజవాహనుని గారవపుకూఁతురు సౌభాగ్యవతి యిందుమతి వానిభార్య. ఈలలనవలన జిత్రభానునకు జగన్మోహనాకారయగు నొకకూఁతురు చక్కఁదనంపు దీవియగు నొక్కకుమారుఁడు నుద్భవించిరి. అరవిందాదేవివలన హేమచంద్రమహారాజునకును సోయగంబున మదనుం జంపు పుత్రికయు కుమారు లిద్దరు గలరు. హేమచంద్రునకు కొడుకులే కాని యాఁడుబిడ్డ లేకుండుటవలన నతఁడు సోదరునిపై ద్వేషమున్నను వానికూఁతురును తనకూఁతురునట్లు మిక్కిలి గారాబునఁ బెంచుచుండె. ఆబాలిక యత్యంతముద్దుగా నుండుటనో మఱి యే కారణముననో యరవిందయు నరవిందకూఁతురు నమ్మానమెయి బెంచుచుండె. విదర్భరాజపుత్రి చిత్రభానునిభార్య యగుటచే నాదేశస్థులు కొందఱు శ్రీనగరమునకు వచ్చి చిన్నరాజు నాశ్రయించి జీవించుచుండిరి. ఇట్లు దినము లొకవిధమున గడచుచుండ యువరాజు భార్యాదేశమున నానగరమున రాజును విషప్రయోగము చేతఁ గడతేర్పవలయునని దురాత్ములు కొందఱు కుట్రపన్నిరి. రాజద్రోహులు తమలో తా రైకమత్యము లేని మొఱపుడుటచే నొండొరులతోఁ బోరాడి సంకల్పము గొనసాగింపలేకపోయిరి. ఒకరినొకరు చెఱపఁ దలఁచి యాదురాత్ములు రహస్యములను మెల్లమెల్ల జారవిడువ క్రమక్రమంబునఁ గుట్ర బయలుపడియె. అందున్నవారిలోఁ గాన స్వకదేశస్థుఁ డొక్కఁడును లేక యంతయు విదర్భనుండి వచ్చిన చిత్రభానుని యాశ్రితులే యగుటంజేసియు నన్నదమ్ముల కిరువురకును జిరద్వేషములు దినదినప్రవర్ధితములయి

యుండుటంజేసియుఁ బ్రజలెల్లఁ జిత్రభానుఁడు పరమదుర్మార్గుఁడు వాఁడే యిది పన్ని యుండఁబోలునని యైకకంఠ్యముగఁ బలుకుటంబట్టియు రాజునకు సోదరునిపై గట్టి యనుమానము దగిలెను. దానికిం దోడుగ నరవిందాదేవి సందు దొరికెనని లోకప్రవాదమున కనుగుణముగఁ దాళము వేయుటంజేసి రాజున కాగ్రహం బుదయించె. అతని యనుమానము స్థిరపడునట్లు వైదర్భులలోఁ బ్రధానపురుషులు కొందఱు నడిరేయిఁ బాఱి పోయిరి. అంతట హేమచంద్రుఁడు తక్కిన వైదర్భులం బట్టి తెప్పించి కారాగృహంబులం బెట్టించి తగుశిక్షలం జేయించి తమ్మునిం బిలిపించి "వత్సా! నీవు కష్టచరిత్రుఁడవై విసముపెట్టి నాయుసురుల నపహరింపఁ దలఁచినను భ్రాతృవాత్సల్యమున నీప్రాణంబులు తీయుటకు నాకుఁ జేతులాడకున్నయవి. మనజనకుఁడు తీరినదాదిగ నీవు దుస్సహావాసముఁ జేసి చేయరానిపనులఁ గావించి యకార్యములు సేయవలదని మందలించినందులకు నన్ను నిందించి నీకు మాతృసమానయగు నరవిందపై నపవాదంబులు మోపి కూళవై వర్తించితివి. కడుపుచించినఁ గాళ్లపైఁబడు నన్నట్లు నిన్ను శిక్షించిన నాయప్రతిష్ఠ నాకే కదా యని దూరము యోచించి నీచేతలు బయలుపుచ్చక కడుపులోఁ బెట్టుకొని సైచితిని. ఇంక నీతో నేను వేగఁజాల. నిన్నిట నుండనిచ్చుట ప్రక్కలోఁ బామును బెట్టుకొనుట. కావున నీవింక నాలుబిడ్డలతో నేదేశంబునకైనఁ జని యచట నుండుము. నీకుఁ గావలసిన విత్తము నే నంపుచుండెద. ఇంతకన్న నేనీకుఁ జేయునదిలేదు విదర్భకుం జని నీయత్తవారియింట నుంట యుచితము. అక్కడనైన బుద్ధిగలిగి సుగుణనిధాన మగువిక్రమసేనునకుఁ గొడుకువై నందుకుఁ దండ్రిని దుర్యశముపాలుసేయక జాగరూకతతో మెలంగునది" అని పలికి కన్నీరు పెట్టుకొనుచు వాని నావలకుం బనిచె.

అయిదవ ప్రకరణము.

మనుజుఁడు చింతాక్రాంతుఁడగునప్పుడు నిముసములు గడియలై గడియలు జాములై నిశలు దీర్ఘములై తోఁచు. నరుఁడు బంధుమిత్రులతోఁ బ్రసంగించునప్పుడు జాములు గడియలై గడియలు నిముసములై మాపులు కురుచలై కనంబడును. అందుచే మనుష్యు లొండొరులతోఁ జెప్పుకొనుకథలు ముగియకపోవుటయు రాత్రులమాత్రమే గడచి పోవుటయు సంభవించుచుండు. ఆరాత్రి సుమిత్రుఁడు బ్రాహ్మణునితోఁ గాశ్మీరరాజు తమ్మునివృత్తాంతముఁ గొంతవఱకుఁ జెప్పునప్పటికి మూఁడుయామములు గడచె. తెల్లవాఱ వచ్చుచున్నదిగావున జారచోరులు మొదలగు నిశాచరులు తమతమసంచారంబు లింక ముగింపవలసిన దోహో యని కాలపురుషుఁడు వేయుకేకవలె 'కొక్కొరోకో' యని జాముకోడి కూసె. అదివరకు వెన్నెలలు వ్యాపించినతావులందుఁ గ్రమక్రమంబున నీడలు

వ్యాపింపఁదొడంగె. తెలిపివెన్నెల లంతకంతకుఁ బలుచనగాఁ దొడంగె. అప్పుడు బ్రాహ్మణుఁడు సుమిత్రునితో "అయ్యా! తెల్లవారవచ్చుచున్నది. మనప్రసంగంబు లింక ముగింపవలయు. నీచరిత్రంబు నేవినఁగోర నీవది చెప్పక మరియొక నివృత్తాంతము వినుపింపఁదొడంగితివి. ఆతనికిని నీకును గలసంబంధ మెట్టిదియో నేనీవరకు నెఱుంగఁజాలనైతి. కావున గాలయాపనము సేయక నా కెఱిఁగింపఁదగినయంశము లన్నియు సాధ్యమయినంత శీఘ్రముగ నెఱిఁగింపుము. 'ఆలస్యా దమృతం విషం' మ్మని బుధులు పలుకవినవే" యని పలికి వేగిరపెట్టె. అప్పుడు సుమిత్రుఁడును రుద్రభట్టుతో నిట్లనియె. "ఆర్యా! కాశ్మీర రాజసోదరునకును నాకును గలసంబంధబాంధవ్యములు కొన్ని కారణములు చేత మీ కిపుడు నే నెఱిఁగింపకున్నను ముందుముందు మీ కెఱుంగకపోదు. మీకనులు గప్పి నే నేకార్యమొనరింపను. కావున నావిషయమై మీసందేహమువిడిచి మిగిలినకథవినుఁడు.

హేమచంద్రుఁడు సోదరుఁడగు తన్నిట్లు స్వదేశంబునుండి పారఁదోలు నని చిత్రభానుఁ డెన్నండు గలనైన ననుమానించి యెఱుంగఁడుగావున దనయన్న పలుకులు విని యతఁడు నిశ్చేష్టుఁడయి తాను నిర్దోషినని రాజుతో విన్నవింప మనసులోఁ దలంచియు నోట మాటరాక నిలువంబడియె. అతఁడు కొంతవడికి ధైర్యముఁ దెచ్చుకొని నేదియో పలుకఁబోవునప్పటికి రాజాతావువిడిచి పోవుటయు పరిజనులు చిత్రభాను నచటనుండి యావలకుం దోడ్కొనిపోవుటయు సంభవించె. గంగిగోవున కలుకపుట్టినట్లు గుణరత్నాకరుఁడగు హేమచంద్రునకుఁ గినుకవొడముటచే నది యనివార్యమని యెంచి మంత్రులు సామంతులు రాజబంధువులు మిత్రులు యువరాజుపక్షమున నొక్కమాటయుం జెప్పక యూరకుండిరి. అనంతరము చిత్రభానుఁడు తనయంతిపురమున కరిగి పాన్పుపైఁ బండుకొని చింతాక్రాంతచిత్తుఁడై తనభావిస్థితింగూర్చి తలపోతలకుం జొచ్చె. భార్యయగు నిందుమణి మగని జూసి దురపిల్లుటకుఁ గారణం బడిగి యాతనిచేత నుత్తరంబు వడయనేరక యావలకుం జని పరిచారకు నొక్కనిం బిలిచి యడిగి వానివలన భర్తమనస్తాపకారణంబు నెఱిగి భయశోకవిహ్వలయయి యొకచోట కూర్చుండి బాష్పకలితనేత్రయయి వగవసాగెను. తలిదండ్రులముఖదైన్యము నవలోకించి కొడుకుం గూతుడు తమముద్దుమొగంబులు చిన్నవోవ నాటపాటలు మాని కన్నుల నీరు నించుకొనిరి. భార్యాభర్తలయు బిడ్డలయు దెసఁ గనుంగొని పరిచారకులు గ్రుడ్ల నీళ్లు గ్రుక్కుకొనఁ జొచ్చిరి. అప్పుడు యువరాజు తనమనంబున నిట్లని వితర్కించుకొనియె. "అకటా! ఆగర్భశ్రీమంతుఁడనయి మహారాజకుమారుఁడనయి యభిమానధనుఁడనయి సౌఖ్యంబు లపారిగా నందిన నేనింక నేదేశంబుల నేవిధంబున గాలంబుపుచ్చువాఁడ. అనేకరాజపుమాపులచే సేవింపఁబడిన నేను వేరొకని సేవింపఁగలనే? నా కేది? మగవాఁడ. ఎవనిం గొలిచియయిన పట్టెడన్నముఁ దెచ్చికొని పొట్టఁబోసికొని కాలము

గడుపుకొనఁగలను. విదర్భరాజపుత్రియు లావణ్యవతియు మానవతియు నగు నీపరమసాధ్వి నిల్లాలి నెట కనుపువాఁడ? సంప్రాప్తయౌవనయై వివాహయోగ్య యయిన యనుగుంగూఁతురు నెందు దాఁచువాఁడ? సుకుమారుఁ డగుకుమారునిమాట యేమి? విదర్భకుం బోయి యాలుబిడ్డలతో నత్తవారియింట నుందునా? ఛీ అంతవానికడుపునఁ బుట్టి యింతబ్రతుకుబ్రతికి తుట్టతుదకు గతిలేక మామగారిపంచకుఁ జేరుట నావంటి మహాభిమానికిఁదగినపనిగాదు. ఆపత్సమయమున ధైర్యముఁ జిక్కఁబట్టి కాలోచితముగఁ బ్రతిక్రియలు చేయువాఁడెపురుషశబ్దమున కర్హుఁడు. హేమచంద్రునికోటలో నేనొక్కదినమయిన నిలువరాదు. నాకులకాంతను బిడ్డలను విదర్భపురమున కంపి నాకష్టములు గట్టెక్కువఱకు నెందేని ప్రచ్ఛన్నవృత్తి జరియించి పగఁదీర్చికొనియెద. ఇంతకంటె కర్తవ్యము గానఁబడదు." అని దృఢనిశ్చయుఁడై శయ్యాతలమునుండి దిగ్గున లేచి పరిచారకు నొక్కనిం బిలిచి "యోరీ! దేవియుం బిడ్డలు నీదినంబున విదర్భకుం బ్రయాణము సేయవలయు. వారికిం బయన మెఱిఁగించి తత్ప్రయత్నము గావింపు" మని యానతిచ్చె. సేవకులందఱు భయభక్తులతో యజమానునియాజ్ఞ శిరసావహించి ప్రయాణసన్నాహముఁ జేసిరి. హేమచంద్రుఁడు తమ్మునికూఁతు నెడలేనివాత్సల్యము... ప్రపంచెనుచుటఁ జేసి పాయలేక యామెను తనవద్ద విడిచిపొమ్మని యువరాజునకు వర్తమానమంపెను. ఆమాటలు విని యువరాజు 'పాము విరోధియు బడగ చుట్టమునగునా' నేను పగవాఁడ నయినపుడు నాకూఁతురు నీ కెట్లు చుట్టమగును? కావున నిట్టిసందేశంబులు పంపవలదని రాజునకుఁ బ్రత్యుత్తర మంపి కతిపయపరిచారకులతో నిజకుటుంబమును వెంటఁబెట్టుకొని శ్రీనగరము విడిచెను. చిత్రభానుఁ డనుభవించిన నాఁటి వియోగదుఃఖము నాఁటిమనోవేదనము నాఁటిహృదయసంతాపము నెవ్వఁడు వర్ణింపఁగలఁడు. గంభీరభావంబు గలపురుషుం డగుటచే నతఁడు లోలోపలం గుళ్లుచు జేలపడకపోయినను వానిమొగము కత్తివాటువేసిన నెత్తురులేక యంతస్తాపమును ప్రతిభవింపఁ జేయునద్దమువలె నుండెను. ఇందుమణియుఁ గూఁతును గంటికి నేలకు నేకధారఁగాఁ గన్నీరు విడుచుచు నందలంబుల నెక్కిరి. తడవులంబట్టి వారలం గొలుచు సేవకులు వానివిడిచి యేడ్చిరి. ఆసమయమున యువరాజుం బలుకరించిన రాజున కాగ్రహము వచ్చుననియుఁ బలుకరింపకుండినఁ జిత్రభానునకు నలుక వొడముననియు భయంపడి యమాత్యులుదండనాథులు మొదలగు నియోగులుఁబలుకరించియుఁబలుకరింపకుండు నటులు చిరునవ్వులు నవ్వియు చేతులు సాచి సెలవులం గొనియు నూరక నమస్కరించియు నోట మాట రానియ్యక భక్తి నభినయించిరి. హేమచంద్రుఁడు జాలిగుండె గలవాఁ డనిపించుకొనుటకుఁ గాఁబోలు నేనుంగులు గుఱ్ఱంబులు నరథంబులు వలయు నన్ని గొంపొమ్ము మనియుఁ గావలసినరొక్కంబు బొక్కసంబుననుండి గైకొమ్మనియు నానతిచ్చెఁగాని మహాభిమానియగు చిత్రభానుఁడు వానిపైరమెచ్చులయౌదార్యమును నిరాకరించె. వానిపరివార మంతయు నిరువదిమందికంటెఁ దక్కువగనుండె. చిత్ర

భానుఁడు నగరంబునుండి వెడలిపోవు ననుమాట నగరమునఁ బొక్కుటం జేసి వానిపయనమునుం జూడఁగోరి పౌరులు వీథుల నిరుకెలంకుల బారులుగట్టి నిలిచిరి. చిత్రభానుఁడు గుఱ్ఱంబుల నందలంబుల నెక్కక కాలినడకం బోయెను. క్రోధమును గ్రక్కువాని కన్నులును నిశ్చలచిత్తమును దెల్పు నల్లనికనుబొమలును దుఃఖమున వైవర్ణ్యమునుజెందిన మొగంబును జూచి వివేకులగుపౌరులు వానివలన దమ కెన్నఁడో యెగ్గు కలుగక పోదని యొండొరులతో రహస్యంబునఁ జెప్పుకొనసాగిరి. నగరంబు వెడలిన తరువాతివృత్తాంతము నే నిపుడు చెప్పనక్కఱలేదు. చిత్రభానుఁ డాలుబిడ్డల నప్పుడ విదర్భపురమునకుఁబంపి తా నొంటిగ నీవనప్రాంతముల సంచరించుచున్నవాఁడు. హేమచంద్రుఁడు తనకు వాఁడు చేసినయుపకారంబు మఱచి కడుపునిండ నక్కసు పెట్టుకొని పగఁ దీర్చుకొనుటకయి సమయము నెదురుచూచుచున్నాఁడు. మీరు కాశ్మీరంబునకుం బోవ నిశ్చయించుకొనుటచే మీసహాయము నపేక్షించుచున్నవాఁడు. వినయముగలవాఁడు విక్రమము గలవాఁడు. మీయాశీర్వచన మున్న నభివృద్ధికి రాఁదలంచినవాఁడు. సోదరుఁడు తన్ను దేశమునుండి వెడలనడిచినందు కతఁ డంతగా వగచుటలేదు. మున్న నుభవించు మహదైశ్వర్యంబు దొలంగి పేదతనము వచ్చినందుకు విచారించుటయు లేదు. రాజద్రోహము భ్రాతృద్రోహము నతఁడు సేయఁ బూనినవాఁడని యపనింద వానిపైఁ బడినందుకు చిత్రభానుఁడు రేయింబవలు బడియెడు మనస్తాప మింతంత గాదు. యశఃకాములగు సత్పురుషులు నింద నొందుటకన్న మరణ మొంద నిచ్చగింతురుగదా. ఈయపనింద మోపక రాజు వాని నూరక పురినుండి వెడలనడిచిన బాగుండును. చిరకాలమునుండి తమ్ముని నెటు లేనియు బారదోలఁ దలంచి యేయుపాయంబును దోఁచక సంపు విచారించి యెట్టకేల కీనెపముపన్ని చేయఁదలంచిన దంతయు హేమచంద్రుఁడు చేసె. వచ్చినయపనింద రానే వచ్చినది. కలిగిన మనస్పర్థలు కలుగనే కలిగినవి. చిత్రభానుఁ డెంత సద్వర్తనుఁ డయినను హేమచంద్రుఁడు వాని నింక నమ్మింపఁడు. తాను నిర్దోషినని తమ్ముఁ డెన్నియొట్లు పెట్టికొనిన నన్న యవి విశ్వసింపఁడు రాచపగ త్రాచుపగవంటిది. ఐశ్వర్యమున చిత్రభానుఁడు హేమచంద్రునకుఁ దీసిపోయిన నిరువు రొక్క తండ్రిబిడ్డలే యగుటం జేసి పంతమున పౌరుషమున దీసిపోఁడు. కావున వానిప్రతిజ్ఞ వినుండు. రాజనక ప్రజలనక శత్రులనక మిత్రులనక బాలురనక వృద్ధులనక స్త్రీలనక పురుషులనక ఘనులనక నీచులనక పండితులనక పామరులనక కాశ్మీరదేశస్థులలోను శ్రీనగరవాసులలోను తనకయిన యపకారంబున దగిలియున్నవారిని రాజున కాలోచనలు చెప్పినవారిని కుట్ర విని తన కెఱింగింపక యూరకున్నవారిని లోకులు గడగడ వడంకునట్లు స్త్రీలగుండె లవియునట్లు తొల్లి యశ్వత్థామ యర్ధరాత్రమున నుపపాండవుల గడతేర్చినకథలు జ్ఞప్తికి వచ్చునట్లు చాటుగనో బహిరంగముగనో స్వయముగనో పరసహాయముననో న్యాయముననో యన్యాయముననో శస్త్రముననో విషాగ్నులనో హేమచంద్రుని సకళత్రముగ ససంతానముగ సబాంధవముగ సమిత్రముగ సపరివార

ముగ భ్రాతబలి యిచ్చి రాజలక్ష్మిని జేపట్టి చిత్రభానుఁడు క్రొత్తనెత్తుటి గంధముతో భూదేవి నలకరించు. ఈప్రయత్నమ్మున నెరవేరఁజాలక నొకవేళ తాను జచ్చినంజచ్చు. సంపూర్ణముగఁ బ్రతిన గొనసాగింపఁజాల కున్నను గొంతవఱకైన నతఁడు నిర్వహించు. నిర్వహింపఁజాల కున్నను బ్రయత్నించు. ఆచిత్రభానుఁడు నాకుం బరమాప్తుఁడు. వానికి నాకుం బ్రాణ మొక్కటియ. వానికి మీరు గావించినమేలు నాకు గావించుట. వానిని సంతోషింపఁ జేయుట నన్ను సంతోషింపఁ జేయుట. వేయేల? నన్నె వానిగా భావించి యన్నిపనులం జేయుఁడు. అతనికోరిక పండిన మీయదృష్టము పండును. అతఁడు రాజైన మీరు మంత్రు లగుదురు. మీకు బరమశత్రుఁ డగుమాళవ రాజు సుదర్శనుఁడు హేమచంద్రునకుఁ బ్రాణమిత్రుఁడు. వా రిరువురు బాల్యకాలమునఁ గాశీకానగరమున శారదానందస్వామియొద్ద శాస్త్రాధ్యయనము జేయుటంజేసి సహపాఠులు. మీపగతున కతఁడు చెలికాఁ డగుననియైన నాయందలి వాత్సల్యమునకైన మీ రీపని చేయఁబూనవలయు. అచటనుండి నేను చిత్రభానున కేమి సేయఁ గలవాఁడ నని మీరు యడుగవచ్చును. వానిసేవకులలో నమ్మఁదగిన వా రిరువురు మీవెంట నుందురు. వారి నిరువుర రెండుకన్నులుగాఁ జేసికొని యెల్లవిషయములం జూచుచు వారి నిరువుర జేతులుగాఁ జేసికొని యెల్లపనులం జేయుచు మీరు శ్రీనగరమున నేవేళ నెయ్యది జరుగునది యెల్ల వానికిం దెలియునట్లు వేగు నడుపవలయు. మీరు కాశ్మీరంబునకుఁ బోవునప్పు డచ్చటిప్రజలు హేమచంద్రుఁడు సుగుణనిధి యనియు ధర్మరాజనియు వానిరాజ్యంబు రామరాజ్య మనియు వేనోళ్ళం బొగడుచుందురు. మీ రది నమ్మి చిత్రభానుని మరచిపోయెదరుసుడీ. హేమచంద్రుఁడు ప్రసన్నముఖుఁడు. ఆ కారణంబున మీరొక్కసారి వానితో మాటలాడిన మీరాతనిపక్షమగుదురు. వానిహృదయము బెబ్బులి. నోరురామచిలుక. మనస్సు విషపుంజము. నోరు తేనెకుండ. కావునవాని వలలోఁ బడకుండ కడుఁజాగరూకతతో మీరు మెలంగవలయు. నా చెప్పవలసిన కథ ముగిసినది. ఇంక మీయనుగ్రహంబునకై ప్రతీక్షించుచున్నవాఁడ. దుష్టవార్తలను తీఱెండలు సోఁకుటచే శోషిల్లియున్న నాదీనులపై నీవెన్నెలలకన్న జల్లనై కృపారసగర్భితములై సుఖప్రదములగు మీవాక్యామృతవర్షంబులు గురియింపరే” యని సుమిత్రుఁడు రుద్రభట్టు నడుగులపైఁబడి నమస్కరించె. రుద్రభట్టు చిత్రభాను నెన్నఁడును గని యెఱుఁగకున్నను సుమిత్రుఁడు వానిపక్షమును బూని పలుకుటను విశేషించి యతఁడు తన కాపత్కాలమున సాయముఁ జేసినమిత్రుం డగుటను వానిమాటలు త్రోసిపుచ్చలేక తనపై మోపినది మహాభారమని యూహాయ్యసంభృత మని యెఱింగియు దాని కియ్యకొనఁ దలంచి కృతనిశ్చయుఁడై యడుగులపైఁబడిన సుమిత్రు లేవనెత్తి కూర్చుండఁబెట్టి యిట్లనియె. “నాయనా! నీవు నాకుం బరిత్రాతవు. నీమాట నాకు రాజశాసనంబు. చిత్రభానుఁడు నీకాప్తుఁ డగుటంజేసి నా కాప్తుఁడు. నామిత్రునిమిత్రులు నాకు మిత్రులు. శత్రునిశత్రులు నాకు మిత్రులు. మిత్రునిశత్రులు నాకు శత్రులు. శత్రునిమిత్రులు నాకు

శత్రులు. కావున హేమచంద్రుడు నాకు శత్రుఁడు. చిత్రభానుఁడు మిత్రుఁడు. చిత్రభానుఁ డింక కాశ్మీరదేశాధిపతి యయ్యెనని నమ్ముము. అది గోత్రమ్ములకపకారమైన ర్పినరాజు వెలవెలఁబోవుచు పడమటికొండలలో నేకాకియై యస్తమించుచున్నవాఁడు. వానిమరణంబునకై విలపించుచున్నాప్తులవచనంబులవోలె పులుగులు మొఱయుచున్నవి. వానిసంపద లెగిరిపోయినట్లు వెన్నెల లెక్కడివక్కడ యంతరించుచున్నవి. వాని బంధుగణంబులసంఖ్య సన్నగిలునట్లు చుక్కలగమి యంతకంతకు క్షీణించుచున్నది. హేమచంద్రుని యధికారము పోయి చిత్రభానుని యధికారంబు దేశంబున నెలకొనునని తెలుపుటకో యన చంద్రాస్తమయ మగుచున్నది. ఒక్కగడియలోన భానుఁ డుదయింపగలఁడు.'' ఆపలుకులు విని సుమిత్రుఁడు ప్రహృష్టహృదయుఁ డయ్యె. అంతలో ఝల్లున తెల్లవారె.

ఆఱవ ప్రకరణము.

కృష్ణపక్షపాండ్యమిదినమునఁ ప్రాతఃకాలమునఁ బడమట నస్తమింపఁబోవు చంద్రమండలమును దూర్పున పొడుపుగొండపై నుదయించు సూర్యమండలమును గగనమనునింద్రనీలమాణిక్యపు టరుగుపై నడికిన వజ్రంపుబిళ్లయు గెంపుబిళ్లయునన రేజిల్లుచు జూపరకు నీశ్వరమహిమాతిశయములు జాటుచుండెను. ఉదయమున నారెండు బింబములు గనుఁగొనువారికి జీవయాత్ర ముగింపఁబోవుచు యవసానదశలో నున్న వృద్ధునియు జన్మమంది మహాభివృద్ధినిఁ గాంచఁబోవు బాలునియు నవస్థలు మనసునకుం దట్టు. రాత్రి యొండొరుల చిత్రచరిత్రములు జెప్పకొనుచు జాగరముచేసి సుమిత్రరుద్రభట్టులు తెల్లవారినపిదప గాల్యకృత్యములం దీర్చికొనఁబోయిరి. గాయము తగులుటమొదలు రుద్రభట్టు నదివరకు నడువలేక పల్లియలోనిచెలమలో స్నానము చేయుచుండెను. ఇల్లు వెడలినది మొదలు తనకు బ్రాహ్మణసంపర్కము విశేషముగా సంభవించుట చేతను గాయముకతమున కొన్నిదినములు స్నానము మాని యుపరిశుద్ధుఁడై భోజనము సేయవలసి వచ్చుటచేతను బ్రాహ్మణోత్తములు సేయవలసిన నిత్యకృత్యములు సనస్థానములు సరిగా డానప్పుడు నిర్వర్తింపక పోవుటచేతను బ్రాహ్మణుఁడు పవిత్రమైన సింధునదీస్నానము సకలదోషాపహారమనియు తనకావించిన తప్పులకుఁ బ్రాయశ్చిత్తమనియు నిశ్చయించి యయ్యేటికిఁ బోయెను. పోయి యచ్చట యఘమర్షణస్నానము జేసి భాస్కరునకు యథావిధిగ నర్ఘ్యప్రదానముఁ జేసి యనంతర మిసుకతో లింగము జేసి పార్థివము జేసికొని మరల నింటికివచ్చుచు త్రోవలో సుమిత్రునికోరికయు తనకావించినవాగ్దానమును దనతలపైఁబడిన కార్యభారమును దలంచుకొని తనలోతా నిట్లని విచారింపఁ జొచ్చె. “ఈసుమిత్రుఁడు స్వవృత్తాంతమునంతయు మెల్లమెల్లఁగ నావలనవిని తనవృత్తాంతము జెప్పుమని నేనడిగినప్పుడు దానిం జెప్పక వేరొకరాజకుమారునిచరిత్రము నాకెఱిఁగించె.

ఆరాజనందనుఁడు సాకఁగఁబడఁడు. వానిం జూపుమని వేఁడిన నితఁడు జూపఁడు ప్రపంచమున నట్టిరాకుమారుఁడు కలఁడా యని యొకమారును నిజముగా నుండెనేని సుమిత్రుఁడే యతఁడై యుండునా యని యొకమారును నామనంబునకు సందియంబులుఁ బొడముచున్నయవి. సుమిత్రుఁడే యారాజకుమారుఁడైనచో నతఁ డారహస్యమును నెఱిఁగింపక యేలదాఁచు? కానియెడల నావలన మహోపకారమును గోరుచున్న రాకుమారుని నాకుం జూపక దాఁచనేల? నొక్కి యడుగుదుమన్న నతఁడేమి యనుకొనెనో యను భయముకలదు. అడుగకున్న సందేహము మనస్సును బాధించుచున్నయది. అదియటుండఁగ నవస్థాభేదముచే నే నిప్పుడు రాజకార్యములలోఁ బ్రవేశింపవలసివచ్చె. సుమిత్రుఁడు నాతలపై మహాభారము మోపినాఁడు. అతఁడు నా కుపకారి యగుట వాని మంచితనము దలఁచి యేదియుం జెప్పఁజాలక మొగమోటమిచే వాని చెప్పినట్లెల్లఁగన నడుచువాఁడ నని వాగ్దానముఁ జేసితిని. స్వర్గమునకుఁ బోయినను విడియాకులు దప్పవన్నట్లు రాజద్రోహమునకై దేశమునుండి బహిష్కరింపఁబడిన నేను మరల రాజద్రోహులకే సాయముఁ జేయవలసివచ్చె. కాశ్మీరమునకు నేను బోయి ప్రజారంజకుఁడైన హేమచంద్రునిపైఁ గుట్రలు పన్నినచో నాగుట్టుమట్టు వెల్లడికి వచ్చెనేని నాకు నేమగునే? సుదర్శనమహారాజువలె హేమచంద్రుఁడు నన్ను బ్రాణంబులతో నిలువ నిచ్చునే? ఇదివరకే యాలుబిడ్డల నెడబాసి యేకాకినై కష్టములు గుడుచుచున్న నాకు గోరుచుట్టుపై రోకటిపోటన్నట్లు మునుపటికంటె నెక్కువవెతలు సంభవింపకుండునే? ఏబదిసంవత్సరములు నిల్లుటచే జీవయాత్రలో సగము గడచి యవసానకాలము సమీపింపఁబోవుచున్న నేను కామక్రోధాదుల జయించి యేనదీతీరమునన్నైన యేయగ్రహారమునన్నైన నొకకుటీరంబు గావించుకొని కృష్ణా రామా యనుకొనుచు శిష్యులకు పాఠములు చెప్పుకొనుచు తనివి గలిగి సుఖముగ నాలుబిడ్డలంగలసి కాలక్షేపము సేయక తలకుమించినబరువగు రాజ్యవ్యవహారంబులం బ్రవేశించుట యుచితమా యనుచితమా యని యాలోచింపవలసి యున్నది. సుదర్శనుఁ డెగ్గుచేసె నని రాజసేవను నిందించిన నేను వెండియు రాజసేవఁ జైకొనుట యేటి తెలివి. చిన్ననాఁటనుండియుఁ బరిచయముగల సుదర్శనుఁడె యంతసేయ నెన్నఁడు మొగమయిన జూచియెఱుంగని చిత్రభానుఁడు నన్ను పువ్వులం బూజించునే? ఒకరాజును విడిచి మఱియొకరాజు నాశ్రయించుట తోడేలుబారినుండి తప్పించుకొని పులిచేఁ జిక్కుట గాదే? నన్నెన్నఁడు నెఱుంగనివానికి నా కపకారమెప్పుడు సేయనివానికి హేమచంద్రునకు బుద్ధిపూర్వకముగా నెగ్గు సేయఁ దలంచికొనుట కొఱవి చేఁగొని తలఁ గోకికొనుట గాదే? మహావైభవముతో నవని నేలుచున్న హేమచంద్రు నాశ్రయింపక యేలుటకు బెత్తెడునేలయైనలేక, కార్యసాధనమునకుఁ గావలసినధనము లేక తినుట కన్నము నుండ నిల్లులేక సేవించుపరివారములేక నాకన్న హీనుఁడై దీనుఁడై సంచరించు చిత్రభానునిఁ గొల్చి దేహయాత్ర నడపఁదలఁచుకొనుట శిలతెప్పఁ జేసికొని యీఁద నేటి

బడుటగాదె? ఇవియన్నియు సమయానుకూలంబుగ నాకుం బొడమదగిన సందియంబులే. ఐనను పౌర్వాపర్యంబులు చక్కఁగ విచారించి విషయమును బాగుగఁ దఱచిచూడ నాకిప్పుడు చిత్రభానుని సేవించుటయే కర్తవ్యమని దోఁచుచున్నయది. ఏమన నాకుం బరమశత్రువయిన సుదర్శనుని సాధించుటయే నాపురుషార్థముగదా? సుదర్శనునకు మిత్రుఁడగుటచే హేమచంద్రుఁడు నాకుం బగతుఁడేకదా. ఆకారణంబున హేమచంద్రుని సోదరుఁడును పగతుఁడు నగుచిత్రభానుఁడు నాకవశ్యము మిత్రుఁడేకదా. అందుచేఁ జిత్రభానునిఁ సేవ నంకగీరించి వానిపక్షమును బూని కృషిజేసి వానిసుఖదుఃఖముల నే ననుభవించెద. అట్లు వానిని సాధించి కృతార్థుఁడ నైనపిదప శౌర్యమును విడిచి బ్రాహ్మణోచితమగు శాంతము నవలంబించి ముక్కు మూసికొని తపస్సు చేయుచు శేషించినకాలము గడిపెదను. ఇరువదియొక్కమారు రాజకులంబులను వృక్షంబుల తనగండ్రగొడ్డలితో నఱికి కాకటివేళ్లతోఁ బెల్లగించి తద్రక్తమునఁ బితృదేవతలకుఁ దర్పణముఁ జేసి యనంతరము తపోనిష్ఠ స్వీకరించిన పరశురాముఁడట్లు నేనును బౌద్ధరాజకులమును నిర్మూలించి చరితార్థుఁడ నయ్యెద. నడుమ నెన్ని యంతరాయములు వచ్చినను దలపెట్టిన కార్యంబు కొనసాగించుట యుత్తమపురుషలక్షణం బని పెద్దలు సెప్పఁగా విందు. కావున నే నింకఁ గాశ్మీరంబునకుం బోయి సుమిత్రుఁడు చెప్పినచొప్పున నడచుట ముమ్మాటికి నిశ్చయంబు”

యీవితర్కము సమాప్త మగునప్పటికి రుద్రభట్టు తనవాసస్థానమునకు వచ్చి తడిబట్టలారగట్టి వంటఁ జేసికొని భుజియించె. సుమిత్రుఁడును భోజనానంతరమున రుద్రభట్టుం గనుంగొని “దేవా! మీరు పయనమయి పోవుటకు ముహూర్తము నిర్ణయింపుఁడు. మీరు జ్యోతిశ్శాస్త్రమున జాతకసిద్ధాంతభాగములయందే గాక ముహూర్తభాగము నందును గడుఁ గృషి చేసినవా రగుటచే మీరు పెట్టిన ముహూర్త మమోఘముగ శుభప్రదాయకమయి యుండవలయు. పోవునప్పుడు కరటకునిం బింగళకుని మీవెంటఁ గొనిపొండు. వారు మీచెప్పినచొప్పున వర్తించువారు. వాండ్రిరువురు మీకుఁ గుడియెడమచేతు లట్లు సంచరింతురు. అందు గరటకుండు నక్కవోలె జిత్తులుపన్ని ప్రజలం బేలుపుచ్చ నేర్చు. పులివలెఁ బొంచుండి మంచిసమయమున పగతునిపైఁబడి చెరుప నేర్చు. అవసర మగునప్పుడు లేడియట్లు నేల నడుగు లంటకుండఁ బరుగెత్త నేర్చు. పోతుటీఁగకుం జొరరాని రహస్యపుండావులకుఁ బోయి తనజాడ నొరు లెఱుంగకుండ నెంతటిరహస్యములయిన నెఱిఁగి రానేర్చు. పింగళకుఁడును వానిసాటివాఁడు వారల ప్రజ్ఞాధికములు ముందుముందు మీర యెఱుంగుదురు. మీ రింక పయనమై సత్వరమునఁ బోవలయు. కాలహరణంబు శత్రువులకు లాభకరమును, మనకు నష్టకరము నుఁడీ.” అని పలుక రుద్రభట్టు కొంచెము విచారించి “నాయనా! రేపుదయమున ప్రయాణమునకుం దగినశుభముహూర్తమున్నది. కావున నేనీప్రదేశము రేపువిడిచెదను. మీచెప్పిన చొప్పున నడచువాఁడ. నీవు చెప్పినదంతయు నామనంబున జ్ఞాపకమున్నయది.” అని పలికి సుమిత్రునిమనంబునకు సంతోషముఁ గూర్చెను.



“పయిపటములో వలయాకారముగానున్న రేఖ భూగోళముయొక్క యుపరి భాగమును దెలుపును; దానిపై నిలుచుండినట్లున్న మనుష్యుని యొక్క నేత్రమునకు సమముగా బొట్లుబొట్లుగా గీయఁబడియున్న సరళరేఖ యామనుష్యునిదృష్టిపథమునకు సమరేఖలో నుండుప్రదేశమును దెలుపును. సముద్రతీరమున నిలుచుండి చూచుచుండు వానికి దూరమునుబట్టి యావలకు దిగువ నదృశ్యముగానున్న యోడ ముందుకు వచ్చి దృష్టిమార్గముయొక్క సమరేఖను తారసించునప్పటికి మొట్టమొదట చాపకొయ్యకొన మాత్రము కనఁబడును. మఱికొంత సమీపమునకు వచ్చునప్పటికి చాపకొయ్యలు సగము వఱకును కానఁబడును; ఇంకను సమీపమునకు వచ్చి దృష్టిమార్గమునకు తిన్నఁగా నుండునప్పటికి నోడయంతయు పూర్ణముగా కనఁబడును. ఈయంశమును పయిపటములోఁ జూపఁబడినయోడయొక్క మూడుస్థానములను జూచి సులభముగాఁ దెలిసికొనవచ్చును. భూమియొక్క యొక్క భాగమునుమాత్రయే చూపుటకంటె భూగోళస్వరూపమునంతను జూపినచో నీదృష్టాంత మింతకంటెను స్పష్టముగా బోధపడవచ్చును. ఈక్రింది భూగోళపటమునందు A,B,C,D, అను మూడుభిన్నప్రదేశములయందు మనుష్యుఁడు నిలుచున్నట్టు చూపఁబడియున్నది. D అనుస్థానమునం దున్న మనుష్యుని యొద్దనుండి యోడ సముద్రముమీఁదఁ బోవునప్పుడు E అనుస్థానము చేరువఱకును పూర్ణముగా కానఁబడి, అటుపయి నడుగునుండి క్రమక్రమముగా కొంతకొంత మఱుఁగగుచు వచ్చి F అనుస్థానమును జేరునప్పటికి చాపకొయ్యకొనమాత్రము కనఁబడి, ఆపైని పూర్ణముగా నదృశ్యమగును. ఈప్రకారముగానే దూరమునుండి D అనుస్థానముననున్న మనుష్యునివైపునకు వచ్చుచున్నయోడ మొదట బొత్తిగా గోచరము కాకపోయినను F అనుస్థానమునకు వచ్చునప్పటికి తెరచాపకొయ్య కనఁబడనారంభించి, అటుపయి నని సమీపించుకొలఁదిని పైనుండి క్రమక్రమముగా కొంతకొంత యెక్కువగా గోచరమగుచు వచ్చి, E అనుస్థానమును జేరునప్పటికి పూర్ణముగాఁ గానవచ్చును. ఇట్లు కనఁబడుటకు భూమియొక్క వర్తులత్వమే కారణము.”



ఒకవస్తు వేయాకారము కలదిగా నుండునో దానినీడయు ఆయాకారము కలదిగానే యుండునని మన కెల్లరకును ప్రత్యక్షానుభవముచేతనే తెలిసియున్నదికదా. చంద్రగ్రహణసమయములయందు చంద్రబింబముమీఁద పడుచుండెడు భూమియొక్క నీడ యెప్పుడును గుండ్రముగానే కానఁబడుచున్నందున భూమి గుండ్రముగా నున్నదని స్పష్టముగాఁ దెలియవచ్చుచున్నది.

పయిహేతువులను విని విమర్శించినప్పుడు భూమి నారింజపండువలె గుండ్రముగా నున్నదని నమ్మఁదగియేయున్నను, భూమిమీఁదనున్న క్రోసులకొలఁది యెత్తు గలపర్వతములను మిక్కిలి లోతుఁగలపల్లములను దలఁపున నిలిపినప్పుడు భూమి గుండ్రముగా నున్నదని యెట్లునమ్మవచ్చునని కొందఱికి సందేహము కలుగకమానదు. భూమియొక్క వైశాల్యమునుబట్టి యాలోచించిచూడఁగా హిమాలయములవంటి మహోన్నతపర్వతములుకూడ నారింజపండు నంటుకొన్న చిన్నయిసుక రేణువులకంటె నెక్కువపరిమాణము కలవిగా నుండవు. కాఁబట్టి యిరువదినాలుగువేల మైళ్లవృత్తము గల భూమియొక్క యుపరిభాగమునం దొకచోట నాలుగయిదు మైళ్ల యెత్తుగలపర్వతమునుగాని పల్లమునుగాని నారింజపండుతోలుపయి నుండెడు మిట్టపల్లములకంటె గొప్పగా భావింపఁగూడదు. మూఁడువేల యిన్నూఱు క్రోసులవ్యాసముగల యీభూమిపయి నున్న రెండు క్రోసుల యెత్తుగలపర్వతము భూమియొక్క దళసరిలో సహస్రాంశమయిన నుండదుగాన, భూపరిమాణమునుబట్టి యాపర్వతము పెద్దగుమ్మడిపండుమీఁద నంటించినకాగితము దళసరికంటె నెక్కువగానుండదు. కాఁబట్టి యిన్నిపర్వతములతోను పల్లములతోను గూడ భూమియొక్క పయిభాగము దానిపరిమాణమునుబట్టి నారింజపండు పయిభాగమునకంటె నెక్కువ నున్నగా నున్నదనియే చెప్పవచ్చును.

పూర్వము కొలంబ సను నాతఁడు భూమండలముయొక్క యడుగుభాగమునందు మనుష్యవాసయోగ్యమయిన భూభాగమున్నదని చెప్పినప్పుడు కొందఱు బుద్ధిమంతు లాభాగమునందు వృక్షాదులును మనుష్యులును తలక్రిందుగా వ్రేలాడుచుందురా యని ప్రశ్నవేసి యాతనినిబరిహసించిరఁట! అటువంటి బుద్ధిమంతులు కొందఱీకాలమునందు సహిత మందందు లేకపోలేదు. అట్టివారు భూమి గోళాకారముగానున్న పక్షమున దాని పయిభాగమునందున్నవారు నిలువుగా నిలుచుండియుండఁగా నడుగుభాగమున నుండు వారు తలక్రిందుగా వ్రేలుచుందురా యనియు, వ్రేలుచుండెడుపక్షమున వారు క్రింది కూడి పడరా యనియు, ప్రశ్న లడుగవచ్చును. మనహిందూదేశమున కడుగుభాగమున నమెరికాఖండములోని పెరూ చిలీదేశము లున్నట్లు భూగోళశాస్త్రపఠనము చేసినవారి కందఱికిని దెలియును. మనకిక్కడ గాఢాంధకారబంధురమయి యర్ధరాత్రముగా నున్నప్పుడు వారికక్కడ సూర్యప్రభాభాసమానమయి మిట్టమధ్యాహ్నముగా నుండును. మనదేశమునందువలెనే యాదేశమునందును జనులు వాసము చేయుచున్నారనుట సముద్రయాత్రచేసి చూచివచ్చినవారికిమాత్రమే కాక లేఖలు వ్రాయువారికిని తంత్రీవార్తలను బంపువారికినిఁ గూడ స్పష్టముగాఁ దెలిసియున్నది. మనుష్యులు మనమునుకొనున ట్లిచట భూమికి పైభాగమునందున్నను, అచ్చట భూమికడుగుభాగమునందున్నను, పాదములుభూమిపయిని మోపి చలింపక సంచరించుచు నెత్తిపయి నాకాశమును జూచుచున్నారు. పయికి మనము విసరినప్పుడెట్లో వారు విసరినప్పుడు నట్లే రాయి మరలవచ్చి భూమిమీఁదనే పడును. వారడుగునను మనము పయిని నున్నట్లు మనము భావించునట్లే తాముపైని మనమడుగునను నున్నట్లు వారును భావించుకొందురు. ఇట్లేభూమిపై నెక్కడ నున్నవారయినను తాము పాదములుంచు భూమినై యధోభాగమనియు తమతలలపై నుండెడియాకాశమునై యూర్ధ్వభాగ మనియు తమయునికినిబట్టి భావించుచుందురు. అంతేకాని వాస్తవముచేత నిదే క్రిందనియు నిదే మీఁదనియు, మీఁదినుండి క్రిందికే వస్తువులు పడవలయుననియు, నియమములేదు. అట్లయినచో మింటికెగరవేసినరాయి నేలకే యేల రావలయునని శంక తోఁచును. ఈశంకకుఁ జెప్పెడిసమాధానమే భూమిమీఁద మనమేల దృఢముగా నిలుతుమన్న ప్రశ్నకునుసమాధానమగును. ఈరెంటికిని గారణము మనము వాసము చేసెడి యీభూగోళము సమస్తవస్తువులను దనవంక కాకర్షించుకొనుట. ఇట్లితరవస్తువులను దనవంక కాకర్షించుశక్తి యొక్క భూమికే కాక సమస్తవస్తువులకును గూడఁ గలదు. పైకెగరవేసినరాతిని భూమి తనవంక కెట్లాకర్షించునో యట్లే రాయియు భూమిని దనవంక కాకర్షించును. ఆకర్షించుట యనఁగా లాగుటయని

యర్థము. ఈరెంటి యాకర్షణములలో భూమియొక్క యాకర్షణము మిక్కిలి గొప్పది యగుటచేత రాయి దానికి లోఁబడి భూమిమీఁదఁబడును. ఆకర్షణముయొక్క యల్పత్వాధికత్వములు వస్తువులయొక్క పరిమాణమును సాంద్రతను ననుసరించియుండును. ఒక్క నూలుబంతి కున్న దానికంటె నదేపరిమాణము గల యినుపగుండున కాకర్షణబలమధికముగా నుండును. అన్నిటికంటెను మిక్కిలి పెద్దదగుటచే భూమి యత్యధికాకర్షణబలము కలదయినందున నన్నిటిని మించి సమస్తవస్తువులను దనవంకకు లాగుకొనఁగలుగును. భూమియొక్కయు మనశరీరములయొక్కయు నన్యోన్యాకర్షణమువలననే భూమిమీఁద మనము దృఢముగా నిలువఁగలుగుచున్నాము. భూమియొక్కయు నితర పదార్థములయొక్కయు పరస్పరాకర్షణమునే మనము బరువని చెప్పుదుము. ఒక యినుపగుండును భూమిపై నుండి లేవఁదీయుట మనకెంతో భారముగ తోఁచును. ఇనుపగుండును భూమి తనవంకకు లాగుటయే యీబరువునకుఁ గారణము. ఇట్లు పెద్దవస్తువు చిన్నవస్తువును దనలోనికి లాగుకొనుట ధర్మమయినపక్షమున, అనేకసహస్రాంశములు పెద్దదయిన సూర్యమండలము మన భూమండలమును దనలోని కేల లాగికొనలేదని ప్రశ్న వేయవచ్చును. భూమండల మతి వేగముతో సూర్యునిచుట్టును తిరుగుచుండనియెడల భూమి పోయి సూర్యునిలోఁ బడి కరఁగి నీరయి యావిరిగా నెగసిపోవలసినదే గాని తన సంతతగమనవేగముచేత నట్టివిపత్తును తప్పించుకొని తనలోని జీవరాసుల కన్నిటికిని సూర్యాతపమువలని మహాలాభమును గలిగించుచున్నది. సూర్యోష్ణతేజస్సులు సోఁకని పక్షమున లోకములోని జీవపదార్థము లేవియుఁ గొన్నిదినములయినను ప్రాణముతో నుండుట తటస్థింపదు. సూర్యుని వెలుతురును వేఁడిమియు లేనిపక్షమున వృక్షాదులు పెరుగవు; మనమును మనతోడి జంతువులును పగటివెలుతురు లేనిచో నేపనియు చేయలేని వారమయి చలిచేత చచ్చిపోవుదుము.

ఒడిసెలలో రాయివేసి మనము త్రిప్పునప్పుడు రాయి మనలనుండి దూరముగా తొలఁగఁ జూచుచుండును; ఒడిసెలదారము రాతిని యథేచ్ఛముగా పోనీక మనవంకకు లాగుచుండును. పరస్పరవిరోధములైన యీయాకర్షణద్వయముచేతను రెంటికిని భిన్నమయిన వేఱొక గతి యేర్పడి రాయి పయికిని బోక మనవంకకును రాక నడుమ వలయాకారముగా తిరుగును. భూమియొక్క గమనమును నిట్టువంటిదే. భూమి యెల్లప్పుడును సూర్యునినుండి దూరముగా తొలఁగిపోవుటకుఁ బ్రయత్నించుచుండును; దానినట్లు పోనీయక సూర్యునియాకర్షణము దానిని సూర్యునివంకకు లాగుచుండును. అందుచేత మనభూమి నడిమి దారి ననుసరించి సదా వలయాకారముగా సూర్యునిచుట్టును తిరుగు

చుండును. ఇందు భూమి యొడిసెలలోని రాయివంటిది; సూర్యునియాకర్షణము రాతిని లాగెడుదారమువంటిది. ఇట్లు భూమి సూర్యునిచుట్టును దిరుగుచుండెడు వలయాకారమయినదారికి భూకక్ష్య యనిపేరు. భూమి తనకక్ష్యయం దొక్కసారి పూర్ణముగా తిరిగి వచ్చుటకు మున్నూటయఱువదియైదుదినముల యాఱుగంటలకాలము పట్టును. ఈకాలమునే మనము సంవత్సరమని వ్యవహరింతుము. ఈవిధముగా భూమి సూర్యునికి ప్రదక్షిణము చేయుటచేత దానికి రెండువిధములైనగతులు కలుగును. భూమి తనకక్ష్యయందు సూర్యునిచుట్టును దిరుగునప్పుడు తనయిరుసుమీఁద తిరుగుబండిచక్రమువలెను బొంగరమువలెను గిఱ్ఱునఁదిరుగుచుఁబోవును. బండిచక్రమునకువలె దానిమీఁద తిరుగుటకు భూమండలమధ్యమునుండి పోయెడియిరుసు ప్రత్యేకముగా లేకపోయినను భూమి మనసువచ్చినట్లు నానావిధములఁ దిరుగక యొకయిరుసునుండి నడపునట్లుగా నియమితరీతినే తిరుగుచుండును. తననడుమనుండి పోయెడుయక్షము లేకపోయినను భూమి యాత్మప్రదక్షిణము చేయునప్పు డక్షముమీఁద తిరుగుచున్నట్లు చెప్పుదురు. కేవలభావనారూప మయినయీయక్షము (ఇరుసు) యొక్క కొనలు ధ్రువము లని చెప్పఁబడును. అం దుత్తరపుది యుత్తరధ్రువమనియు దక్షిణపుది దక్షిణధ్రువమనియు చెప్పఁబడును. ఇట్లు భూమి యొక్కసారి తనయక్షముమీఁద తిరుగుట కిరువదినాలుగుగంటలకాలము పట్టును. ఆకాలమునే దినమని వ్యవహరింతురు. అట్లు తిరుగునప్పుడు సూర్యునివైపుననున్న భూభాగమునకు వెలుతురును దానివెనుకవైపుభాగమునకు చీఁకటియు కలుగును. అందుచేత పర్యాయమున భూమియొక్క ప్రతిభాగమునకును మాఱిమాఱి దినమున కొకసారి సూర్యకాంతి తగులుచుండుటయు తగులకుండుటయుతటస్థించుచుండును. ఇట్లు సూర్యకాంతి కలుగుకాలము పగలనియు కలుగనికాలము రాత్రియనియు చెప్పఁబడును. సూర్యునియెదుటిప్రక్క నున్న భూభాగమున వసించు వారికి పగలయినప్పుడు దానివెనుకటిప్రక్కను వసించువారికి రాత్రియగును. పగటిభాగమునందు సహిత మొకభాగముననున్న వారికి ప్రాతఃకాలమును మఱియొక భాగమున నున్నవారికి మధ్యాహ్నకాలమును వేఱొకభాగమున నున్నవారికి సాయంకాలమును నేకకాలముననే యగును. ఈప్రకారముగానే చీఁకటిలో నున్నవారికిని స్థానభేదములనుబట్టి కొందఱికి మని మాపును కొందఱికి నడిరేయియు కొందఱికి వేకువయు నేకసమయముననే యగుచుండును. ఈహేతువుచేత స్థానభేదమునుబట్టి కాలభేదమును గలుగుచుండును. చెన్నపట్టణములో నాఱుగంట లయినప్పుడు బొంబయినగరములో నయిదుగంటలముప్పదినిమిషములను కలకత్తానగరమునం దాఱుగంటలముప్పదినిమిషములను నయి యించుమించుగా

నొకొక్క యరగంట కాలము వ్యత్యాస మగపడును. విశాలమయిన యుద్యానవన మధ్యమునందున్న విహారమందిరమునకు చుట్టును గొంతదూరమున వలయాకారముగా నొకబాట వేయించి యాబాటలో నొకబండిని మందిరమునకుఁ బ్రదక్షిణముగా నడిపించి చూచినయెడలఁ బయినిజెప్పఁబడిన రెండుగతులును సులభముగాఁ దెలియవచ్చును. ఆమందిరమును చుట్టి బండి యొక్కసారి తిరిగి మరల మొదట బైలుదేరిన స్థానమునకు వచ్చి చేరునప్పటికి బండిచక్రము నూఱులకొలఁదిసారులు తనయిరుసుమీఁద గుండ్రముగా దిరుగును గదా. శృంగారవనము నడుమనున్న మందిరమును సూర్యునిస్థానమున నున్నట్టు భావింతము; అప్పుడు దానిచుట్టును బండి నడచినదారి భూకక్ష్యవంటి దగును; చక్ర మొక్కొక్కసారి తనయిరుసుమీఁద తిరుగుట భూమి తనయక్షముమీఁదఁ దిరిగెడు దైనందినగతిని బోలును; చక్ర మిరుసుమీఁద తిరుగుచు బాటపైని మందిరమును చుట్టి వచ్చుట భూమియొక్క సాంవత్సరికగతిని బోలును. నదిమీఁదనో మెట్టనో ప్రయాణముచేయుచు పడవలోని గదియొక్కగాని యినుపదారిబండిలోని గదియొక్కగాని గవాక్షమునుండి వెలుపలికిఁ జూచునప్పుడు మనము స్థిరముగా నున్నట్టును చెట్లు మొదలయినవి మనము పోవుచున్న వైపున కెదురుగా పోవుచున్నట్టును మనదృష్టికి గోచరమగునుగదా. ఆప్రకారముగానే మనభూమి పడమటనుండి తూర్పునకు తిరుగుచుండుటచేత సూర్యచంద్రనక్షత్రాదులు తూర్పునుండి పడమటకుఁ దిరుగుచుండు నట్లు మనకుఁ గానఁబడును.

భూమియొక్క సాంవత్సరికగతినిబట్టి మనకు ఋతువులు మొదలయిన కాలభేదములు కలుగుచున్నవి. భూమియొక్కకక్ష్య కేవలవృత్తముగాఁగాక యండాకారముగా నున్నది. దీనినే శాస్త్రజ్ఞులు దీర్ఘవృత్తమని చెప్పుదురు. భూకక్ష్య దీర్ఘవృత్తమగుటచేత భూమి యొకప్పుడు సూర్యునకు చేరువగాను, ఒకప్పుడు దూరముగాను నుండుట తటస్థించును. అందుచేత భూమండలము సూర్యునికి సమీపముగా నున్నప్పుడు వేసవికాలమును దూరముగా నున్నప్పుడు చలికాలమును వచ్చునని స్థూలముగా ననుకొనవచ్చును. కాని ఋతుభేదముల కిది కారణము కాదు. వేసవికాలముగాని చలికాలముగాని భూమియందంతటను నేకకాలమునందే కలుగదు. ఉత్తరార్ధగోళమునందు వేసవికాలముగా నున్నప్పుడు దక్షిణార్ధగోళమునందు శీతకాలముగా నుండును; అదే ప్రకారముగా నుత్తరార్ధగోళమునందు శీతకాలముగానున్నప్పుడు దక్షిణార్ధగోళమునం దెండకాలముగా నుండును. వేసవికాలమునం దెక్కువవేఁడిమి యుండుట సూర్యుఁడు భూమి కెక్కువసమీపమునం దుండుటచేతఁగాక దినములు దీర్ఘములుగాను రాత్రులు

హ్రస్వములుగాను నుండుటచేతఁ గలుగును. ఇట్లే శీతకాలమునం దక్కువచలి యుండుట సూర్యుఁడు భూమి కెక్కువదూరమునం దుండుటచేతఁ గాక దినములు హ్రస్వములుగాను రాత్రులు దీర్ఘములుగాను నుండుటచేతఁ గలుగును; భూమండలమునకు సూర్యమండలము వేసవికాలమునకంటె శీతకాలమునందే ముప్పదిలక్షల మైళ్లు చేరువగా నుండును. కిరణములు నిలువుగా సమరేఖయందు పడునప్పు డుష్ణ మెక్కువగాను, ఓరలనుండి ప్రక్కఁగా పడునప్పు డుష్ణము తక్కువగాను, ఉండును. దీపము నెత్తిమీఁద మూరెఁడుదూరములో చేయి పెట్టినను వేఁడి యధికముగా నుండుటయు ప్రక్కలను బెత్తెఁడుదూరములో చేయి పెట్టినను వేఁడి యల్పముగా నుండుటయు చూచినవారికీ సత్యము చక్కఁగా బోధపడును. వేసవికాలములో సూర్యకిరణము లించుమించుగా నిలువుగా మనతలమీఁద పడుటయు చలికాలములో ప్రక్కలనుండి పడుటయుఁగూడ నీశీతోష్ణభేదముల కొక కారణమయి యున్నది. శీతకాలములో సాధారణముగా సముద్రమునకు దూరముగా నున్నప్రదేశములలో చలి యెక్కువగాను సముద్రతీరప్రదేశములలో చలి తక్కువగాను నుండును.



పైపటములో మధ్య తెల్లగానున్నది సూర్యబింబము; దానిచుట్టును దీర్ఘవృత్తముగానున్న నల్లనిరేఖ భూకక్ష్య; ఆకక్ష్యమీఁదనున్న నాలుగుగోళములలో (A) జ్యేష్ఠమాసములోను, (B) ఫాల్గుణమాసములోను, (C) మార్గశిరమాసములోను, (D) భాద్రపదమాసములోను, భూమండల ముండుస్థానములు. తనకక్ష్యలో భూమి పుష్యమాసములో వచ్చు మకరసంక్రాంతి మొదలుకొని యుత్తరమునుండి దక్షిణమునకును,

ఆషాఢమాసములో వచ్చు కర్కాటకసంక్రాంతి మొదలుకొని దక్షిణమునుండి యుత్తరమునకును, నడవ నారంభించును. వీనిలో మొదటి యాఱు నెలలలోను మనదృష్టికి సూర్యుఁడుత్తరపువైపునకుఁ బోవుచున్నట్లు కనఁబడుటచేత నాకాలము నుత్తరాయణ మనియు, తరువాతియాఱు నెలలును దక్షిణాయణ మనియు, వాడుదుము. సూర్యుని చుట్టును తిరుగునప్పుడు భూమి తనకక్ష్యలో నేభాగమునం దున్నను దానిధ్రువములు మాత్రము కొంచెము వంపుగా సమానాంతరముగల సరళరేఖలలోనే సదా యుండుట వలన నొకధ్రువసమీపమునఁ గొన్నిమాసములు సదా సూర్యప్రకాశము కానవచ్చు చుండుటయు మఱికొన్ని మాసములు సూర్యప్రకాశమే కలుగ కుండుటయు సంభవించు చున్నది. ఈప్రకారముగా నొకధ్రువము సూర్యునివైపున కుండి కాంతిని పొందుచున్నకాలములో రెండవధ్రువము సూర్యునికి మఱుఁగయి యుండి కాంతిని పొందకుండును. అట్టిసమయములయందు ధ్రువసమీపముల సూర్యోదయాస్తమానములు లేక సూర్యబింబము వలయాకారముగా ప్రదక్షిణములు చేయుచున్నట్లు కనఁబడుచు నంతకంతకు క్రిందికివచ్చి దిఙ్మండలమునందు క్రమముగాముప్పాతిక, సగము, పాతిక, పరకరూపములతో చుట్టును దిరుగుచు కట్టకడపట నదృశ్యమయి కొన్ని మాసములవఱకును మరలఁ గానరాకుండును. భూమియొక్క యీగతినిబట్టియే యహోరాత్రపరిమాణభేదములును ఋతుభేదములును గలుగుచున్నవి. సంవత్సరములో రెండు దినములుమాత్రమే సూర్యకిరణములు భూమధ్యరేఖమీఁద సమరేఖలుగా పడును. ఫాల్గుణమాసములో సూర్యుఁడు మేషరాశియందుఁ బ్రవేశించెడు మేషసంక్రాంతినాఁడును (మార్చి నెల 21వ తేదిని), భాద్రపదమాసములో సూర్యుఁడు తులారాశియందుఁ బ్రవేశించెడు తులాసంక్రాంతినాఁడును (సెప్టెంబరు నెల 23వ తేదిని) మాత్రము సూర్యకిరణములు సరిగా భూమధ్యరేఖమీఁద నిలువుగాఁ బడి యుత్తరధ్రువము మొదలుకొని దక్షిణధ్రువమువఱకును వ్యాపించుటచేత నారెండుదినములయందును రాత్రియు పగలును ప్రపంచమునం దంతటను సరిగా ముప్పదేసిగడియలచొప్పన సమపరిమాణము కలవిగా నుండును. ఫాల్గుణమాసము దాఁటినది మొదలుకొని చైత్రవైశాఖ జ్యేష్ఠమాసములయం దంతకంత కహఃపరిమాణము హెచ్చుచు నాషాఢశ్రావణభాద్రపదమాసములలో క్రమక్రమముగా హెచ్చినది తగ్గి సమపరిమాణమునకు వచ్చుటయు, భాద్రపదమాసము దాఁటినది మొదలుకొని యాశ్వయుజకార్తిక మార్గశిరమాసములయం దంతకంత కహఃపరిమాణము తగ్గుచు పుష్యమాఘఫాల్గుణమాసములలో క్రమక్రమముగా తగ్గినది హెచ్చి సమపరిమాణమునకు వచ్చుటయు, సంభవించును.

రెండవ ప్రకరణము.

తమనిరంతరకృషివలన సామాన్యస్థితినుండి యున్నతస్థితికి వచ్చిన వారలనేకు లొక్కయింగ్లాండు దేశమునందుమాత్రమే గాక ఫ్రాన్సు మొదలగు దేశములందుసహితము గలరు. గ్రంథవిస్తరభీతివలన నువ్వారి పేరులుమాత్ర ముదహరించినందువలన లాభము లేదని యెంచి ముఖ్యములగు దృష్టాంతములనుమాత్రమే వ్రాయుచున్నాను. అందు మిక్కిలి ప్రసిద్ధు లగువారిచారిత్రములఁ బరిశీలించితిమేని కృషిసాఫల్యతకు మొదట కష్టములును దరిద్రస్థితియు నే యత్యంతావశ్యకములుగా నుండునని తెలిసికొందుము. మొదట సామాన్యస్థితి గలిగి తమనిరంతరకృషివలన క్రమక్రమముగాఁ బ్రఖ్యాతికివచ్చి యున్నతపదవులఁ బొందినవారిసంఖ్య బ్రిటీషుజనప్రతినిధి సంఘమునందు(The British House of Commons) విశేషముగాఁ గలదు. అట్టివారెల్లరును చట్టనిర్మాణసభల యందు మిక్కిలి గౌరవింపఁబడి యున్నారు. ! సాల్ఫర్డను తాలూకాకు ప్రతినిధిగా నెన్నికొనఁబడిన జోసిఫ్ బ్రదర్టను "పదిగంటలశాసనమును" గుఱించి తీవ్రముగాఁ జర్చించునపుడు తా నొకదూదియంత్రశాలలో పని చేయుబాలుఁడుగానుండి పొందిన యిడుమలనుగుఱించియును దుఃఖములనుగుఱించియును వివరముగాఁ దెలుపుచు నాకాలములో నిర్భాగ్యు లయినపనివాండ్రకష్టములను దొలఁగించుటకయి తనజీవితకాలములోఁ బ్రయత్నింతునని శపథముపట్టియుంటి నని చెప్పియున్నాఁడు. అతనివెనుక వెంటనే లేచి సర్ జేమ్సుగ్రహా మనునాతఁడు బ్రదర్టనుయొక్క సామాన్యస్థితిని దానావఱకు వినియుండలే దనియును, అట్టిహైన్యస్థితినుండి జనప్రతినిధిసంఘములోఁ గొప్పవారిసరసను జేరి కూర్చుండునట్టియున్నతస్థితికి వచ్చినందులకు తాను మిక్కిలి గర్వపడుచున్నానని తత్సంఘమునఁ గరతాళధ్వనులు సెలంగుచుండ గొంతెత్తి గంభీరస్వరముతో ముచ్చటించెను.

ఓల్డుహామునకు ప్రతినిధిగానున్న ఫాక్సనునాతఁ డెప్పుడు ప్రసంగింపఁవలసివచ్చినను "నార్విచ్చిపట్టణమున బాల్యమున నేతపనివాఁడనుగా నుండి పనిచేయుచుండినపు" డని మొదలుపెట్టుచుండెను. ఓడల కథికారియై ప్రసిద్ధివహించిన లిండ్సేయనునాతఁడు సండర్లాండునకు ప్రతినిధిగా వచ్చి ప్రతికక్షివారు తన్నెగతాళిచేసినప్పుడు తన్ను కోరుకొనిన జనసంఘమునకు తనదైన్యస్థితినిగూర్చి యీక్రిందివిధముగా జెప్పకొనెను.

పదునాలుగుసంవత్సరములప్రాయమున దిక్కులేనివాఁడనుగానుండి జీవనార్థము గ్లాస్గో నగరమునుండి లివర్పూలునగరమునకు వచ్చుటకు చేత నొకకాసయినను లేక బొగ్గు కంతలలోనుండి బొగ్గును త్రవ్వి సిద్ధము చేయుపద్ధతిమీఁద నోడ నడపునధికారితో మాట్లాడుకొని లివర్పూలునగరముఁజేరి పని దొరకుటకుపూర్వ మేడువారములవఱకు తృప్తికరముగాఁ గుడువఁ గూడును కట్టబట్టయును లేక వివిధకష్టములు పడి యోడలో నొకపనిసంపాదించుకొని పందొమ్మిదిసంవత్సరములప్రాయము వచ్చునప్పటికి నోడనడపునట్టియధికారి నైతిని. ఈయుద్యోగము నాసత్ప్రవర్తనమువలనను స్వయంకృషివలనను సంపాదింపఁ గలిగితిని. ఇరువదిమూడుసంవత్సరములవయస్సు వచ్చిన తరువాత నాపని మానుకొని యొడ్డునకు వచ్చి కాపురము గుదుర్చుకొని యితరులకు మేలుచేయవలె ననుతలంపుతోఁ బాటుపడి నాబుద్ధివిశేషమువలనను నిరంతరకృషి వలనను నీయున్నతపదవికి వచ్చియుంటిని.

బర్క్ న్ హెడ్డునగరవాసియు, ఉత్తరడెర్బిషీరునకు ప్రతినిధియునగు ఉల్లియమ్ జాక్సనుచరిత్రముఁగూడ లిండ్సేచరిత్రమునే పోలియుండెను. ఇతనితండ్రి లంకాష్టరు పట్టణమున శస్త్రచికిత్సకుఁడుగా నుండి పదునొకొండుగురుబిడ్డలను గలిగియుండి చనిపోయెను. వారిలో నీజాక్సను ఏడవవాఁడుగా నుండెను. ఇతనికంటె పెద్దవారు తండ్రి చనిపోవునప్పటికి విద్యావంతులయి యుండిరిగాని చిన్నవారు తమంతటతాము చదువుకొని బ్రదుకవలసి వచ్చెను. ఈచిన్నవాఁడు పండ్రెండుసంవత్సరములవయస్సు కలిగియున్నప్పుడు బడి మాన్పింపఁబడి యుదయ మాఱుగంటలు మొదలుకొని రాత్రి తొమ్మిదిగంటలవఱకు కష్టపడవలసిన యోడపనిమీఁద నొప్పగింపఁబడెను. తనయజమాని జబ్బుపడినపుడు మఱియొకతీఱిక గలపనియందు ప్రవేశపెట్టఁబడెను. ఆకాలములో నీబాలుఁడు చదువుకొనుటకవకాశము చిక్కనందువలన 'ఎన్సైక్లోపెడియా బ్రిటానికా' యను మహాగ్రంథముయొక్క యిరువదియాఱు భాగములను రాత్రింబగళ్లు చదివి ముగించెను. తరువాత వర్తకమును బ్రారంభించి వృద్ధినొంది ధనికుఁడై యోడల కధికారియయి ప్రతిమహాసముద్రమునందును నోడలు నడిపించుచు ప్రపంచములోని ప్రతిదేశముతోను వర్తకసంబంధము కలిగి యుండెను.

ఆతరగతిలోనే చేరినయట్టిమనుష్యులలో రిచార్డ్ కాబ్డెను నొకఁడని పరిగణింపఁబడవచ్చును. అతఁడును మిక్కిలి సామాన్యస్థితినుండి వృద్ధిపొందినవాఁడే. సస్సెక్సు మండలమున మిడ్ హర్స్టు గ్రామమున నొకబీదరైతునకు జన్మించి మిక్కిలి బాల్యము

లోనే లండనునగరమున నొకగిడ్డంగిలో నౌకరుగాఁ బ్రవేశపెట్టఁబడెను. అతఁడు జాగరూకత కలవాఁడును, అదుపాజ్ఞలు గలవాఁడును, విశేషసంగతులను దెలిసికొనుట కభిలాష కలవాఁడుగాను నుండెను. వానియజమాని పూర్వపద్ధతి ననుసరించి నడుచువాఁడుగావున నతివిస్తారముగా చదువవలదని మందలించుచుండెను. అయినను తనమార్గమును విడిచిపెట్టక యీబాలుఁడు గ్రంథములలోఁ గానఁబడు ధనముతో తనమనస్సును నింపుచుండెను. క్రమక్రమముగా నీతఁడు జవాబుదారి గలపనులలోఁ బ్రవేశపెట్టఁబడి తుదకు స్వాతంత్ర్యవృత్తి నవలంబింపఁ దలఁచి పథికుఁడై దేశములు దిరిగి మాంచెస్టరు నగరమున కాలికోక్రింటరుగాఁ (కాలికోగుడ్డమీఁద నచ్చు వేయువాఁడు) బని ప్రారంభించెను. ప్రజోపకార్యములయందు ముఖ్యముగ సామాన్యజనవిద్యాభివృద్ధియం దభిమానము గలిగియుండి ‘‘కారన్‌లాస్ (Corn Laws) విషయమున జోక్యము కలిగించుకొని రద్దుపఱచుటకయి విశేషముగా తనజీవితమును ఐశ్వర్యము వినియోగించెను. ఈతఁడు మొదట తలయెత్తి నలుగురిలోనికి వచ్చి మాటాడఁ బ్రయత్నించియు తన యుద్యమము కొనసాగక నాలుగుమాటలయిన జనరంజకముగాఁ బ్రసంగింపలేక పరిహాసపాత్రుఁ డయ్యెను. కాని యంతటితో విముఖుఁడుగాక యోపికయు, నిరంతరకృషియు, శక్తియును గలిగియున్నవాఁ డగుటవలన జనరంజకముగా నుపన్యసించుటను నేర్చుకొని తరువాత జనుల నాకర్షింప శక్తిగలవక్తలలో ముఖ్యుఁడాయెను. గుణము, పట్టుదల, పాటు మొదలగునవి మనుష్యుని నెంతవఱకు నభివృద్ధికిఁ దీసికొనిరాఁగలవో కాబ్డెను చరిత్రమే మనకు దృష్టాంతముగా నుండునని గ్రేంచి రాయబారి యొకసారి ప్రసంగ వశమున ముచ్చటించెను.

ఈ పైనుదహరించిన దృష్టాంతములలో నెల్లను మనుష్యుని మనఃపూర్వకమయిన నిరంతరకృషియే గౌరవపదవి నందుటకు చెల్లించు విలువగానుండినది. పరిశ్రమ చేయు చేయియును తలయునుమాత్రమే స్వయంకృషియందును, జ్ఞానాభివృద్ధియందును, వ్యాపారమునందును, మనుష్యుని భాగ్యవంతునిగఁ జేయుచున్నవి.

భాగ్యమును సౌఖ్యమును మనుష్యుని యొక్క యుదారభుద్ధిజ్ఞానమున కావశ్యకములు కావని స్పష్టముగాఁ దెలియుచున్నది. లేనియెడల సార్వకాలములయందును ప్రపంచము సామాన్యస్థితినుండి తలయెత్తికొని పైకివచ్చినవారికిమాత్రమే ఋణపడియుండదు. సుఖభోగములతో డిప్పట్టుక కష్టములతోఁ బెనఁగులాడి పాటుపడుటకై మనుష్యులను తరిబీతు చేయఁజాలదు. దారిద్ర్యము దురదృష్ట మనిషించుకొన్న మనఃపూర్వకమైన

స్వయంకృషిచే దానినేయదృష్టమునుగా మార్చవచ్చును. "మనుష్యులు తమ భాగ్యమును గాని బలమునుగాని తెలిసికొన్నవారుగాఁ గన్పట్టకున్నారు. భాగ్యమువలన తాము చేయుదానికంటె నెక్కువగాఁ జేయవచ్చు ననియును, రెండవదానివలన తక్కువ మాత్రమే చేయవచ్చుననియు నమ్ముచున్నారు; స్వశక్తియందలి విశ్వాసమును వైరాగ్యమును మనుష్యుని న్యాయమగుపాటునకుఁ బురికొలిపి తనపొట్టఁ "దాను పోషించుకొనునట్లు చేసి సత్కార్యములయందు తనజీవితమును జాగ్రతగా వినియోగించునట్లు చేయు" నని బేకను చెప్పియున్నాఁడు.

సుఖమును స్వేచ్ఛయు నభిలషించి విచ్చలవిడి తిరుగువారికి ధనము పెనుమోహమును పుట్టించును. మిక్కిలి భాగ్యవంతులయి జన్మించినవారలు వేడుకల నిరసించి కష్టదినములను గడపుచు జీవించుచున్నవారితోడఁ గలసిమెలసి పనిచేయుట యధికమైనకీర్తిని వ్యాపింపఁజేయును. మనదేశమునందువలెఁగాక యింగ్లాండుదేశమునందు భాగ్యవంతులు సోమరులయి యుండక దేశాభివృద్ధికై తాము చేయవలసినపనిని తాము చేయుచు నొకప్పుడు కష్టములకైనఁ దలయొగ్గుచుందురు. ప్రకృతశాస్త్రమునందును| తర్కశాస్త్రమునందును గూడ భాగ్యవంతులగువారు పేరుగాంచి యున్నారు. ఈసందర్భమున బేకను, వర్సెస్టరు, బాయిలీ, క్యావెండిస్, రోల్బాట్, రోసీ, మొదలగు గొప్పవారి పేరులు చెప్పవచ్చును. కడపటివాఁడైన రోసీ జమీందారులలో గొప్పశిల్పి యని చెప్పవచ్చును. ఈతఁడు నిజముగా జమీందారుఁడై పుట్టకుండిన నింకను నద్భుతవిషయములను గనిపెట్టియుండును. శిల్పనైపుణ్యతనందు సంపూర్ణప్రజ్ఞావిశేషము|గలవాఁడగుటవలన నొకప్పు డొకయంత్రశాలయందు మేస్త్రీగా నుండి పనిచేయుటకు బలవంతపెట్టఁబడి పనిచేయవచ్చినప్పుడు తాను జమీందారుఁడ నని తెలియఁబడకుండఁ బని చేసి మెప్పించెను. "రోసీ టెలిస్కో" పను ఘనమైన దూరదర్శకయంత్రమును గనిపెట్టి యద్భుతమైన తనమేధాశక్తిని లోకమునకుఁ బ్రకటించియున్నాఁడు.

ఇంతియగాక రాజ్యాంగవిషయములయందును భాషావిషయములయందును విశేషముగాఁ గృషిచేసి ప్రఖ్యాతిని బడసినవారిలో నెక్కువతరగతులలోనివార లనేకులున్నారని మనము తెలిసికొనుచున్నాము. ఈవిధములయిన కార్యములయందు విజయమును పొందుట తదితరవిషయములందువలెనె పాటువలనను అభ్యాసమువలనను, గ్రంథపఠనమువలనను గలుగును. మహాజనప్రతినిధిసభానాయకులుగాను మంత్రులుగాను నుండువారు మిక్కిలి కష్టపడవలసినవారుగా నుండవలయును. పామర్స్టన్, డెర్బీ, రస్సెల్, డిస్రాయెలీ, గ్లాడ్స్టోను మొదలగు మహనీయులెల్లరు నట్టివారలే. వీర లెల్ల

టిను పదిగంటలశాసనముయొక్క లాభములను బడయకుండ దానికి రెట్టింపుగా రాత్రిం
బగళ్లు విసుగును విరామమును లేకుండ జనప్రతినిధిసభలోనుండి కష్టపడిపనిచేసిమిగులఁ
బ్రఖ్యాతిఁగాంచినట్టివారుగా నున్నారు. నవీనకాలమునం దట్టులు పాటుపడినవారిలో
సర్ రాబర్టుపీలు నాతఁ డొక్కఁడు; సామాన్యశక్తులనుమాత్రమే గలిగియుండి యెడ
తెగని నిరంతరకృషివలన నద్భుతమయిన యౌన్నత్యమునకు వచ్చిన యీతనిచరిత్రము
మిక్కిలి సుప్రసిద్ధమయినది. ఈతఁడు జనప్రతినిధిసభలో నలువదిసంవత్సరములు గూరు
చుండి చేసినపనులు బ్రహ్మాండములయినవిగా నున్నవి. ఈతఁడు తనయంతరాత్మకు విరుద్ధ
ముగా నడుచువాఁడు కాఁడు. తాను చేయుటకు పూనుకొన్న దానిని పూర్తిగా చేసి
విడిచిపెట్టినాఁడు. ఆతఁ డేవిషయమునుగుఱించి మాట్లాడఁదలఁచెనో, ఆతఁ డేవిషయ
మున వ్రాయుటకుఁ బ్రారంభించి వ్రాసెనో, ఆయావిషయములను జక్కఁగాఁ బరిశీ
లించి పరిపూర్ణజ్ఞానమును బడసి సఫలీకృతమనోరథుఁ డాయెనని యాతని యుపన్యాస
ములను గాంచినవారు తలఁపకమానరు. ఈతఁడొక్కవిషయమున తనతోడివారలకంటె
నాధిక్యమును వహించియున్నాఁడు. అంధప్రాయముగాఁబూర్వపుదానినెల్ల శ్లాఘించు
వాఁడు గాక నూతనమైన సదభిప్రాయములయం దభిలాష కలవాఁడుగా నుండెను.
బ్రోహాముప్రభువుయొక్క విసుగులేనిపాటు లోకప్రతీతియయి సర్వత్ర వ్యాపించెను.
ఆతని దేశోపకారకము లయినపను లాతని జీవితకాలములో నఱువదిసంవత్సరము లాక్ర
మించుకొని యుండెను. ఆకాలములో నాతఁడు ధర్మశాస్త్రమునందును, భాషా
శాస్త్రములయందును రాజ్యాంగవిషయికశాస్త్రములయందును ప్రకృతిశాస్త్రమునం
దును కృషిచేసివానియన్నిటియందును ప్రావీణ్యతనొంది గొప్పపేరుసంపాదించుకొనెను.
అట్టిదాని నెట్లు సాధింపఁగలిగెనో యనేకులకు గూఢముగానుండినది. ఒకప్పుడు క్రొత్త
పని చేయవలసినదని కోరఁబడినపుడు సర్ సేమ్యుయల్ రోమిల్లీ తనకు తీఱిక లేదని
క్షమాపణము చెప్పుకొనుచు ‘‘మీరు దీనిని తీసికొని బ్రోహాముకడకుఁ బొండు; ఏపని
చేయుట కాతనికితీఱికకలిగియున్నట్టు గన్పట్టుచున్నాఁడని ప్రత్యుత్తరమిచ్చెనఁట!

విశ్రాంతిపొందవలసినకాల మాసన్న మయినపుడు వృద్ధు లనేకులు కుర్చీలపైని
బండుకొని హాయిగా సుఖమనుభవించుచుండఁగా బ్రోహాము తేజోశాస్త్రమునుగుఱించి
బాహుళ్యమయిన విమర్శనములను వ్రాసి నూత్నవిషయములను గనిపెట్టి లండను పారీసు
నగరములలోని ప్రకృతిశాస్త్రజ్ఞులసభలలో నివేదించుచుండెను. ఆకాలములోనే
ప్రకృతిశాస్త్రజ్ఞుల జీవచారిత్రములను మూడవజార్జిగారిప్రభుత్వకాలమునందలి భాషా

జ్ఞానులచారిత్రములను ముద్రించి ప్రకటించుచువచ్చెను. ఇంతియగాక రాజ్యాంగవిషయములనుగుఱించి పార్లమెంటులోని ప్రభుసభ (House of Lords) లోఁ జర్చించుచుండెను. ఒకసారి ధారుఢ్యవంతులగు ముగ్గురుమనుష్యులు చేయవలసినపనిని తనపైఁ బెట్టి సిడ్నేస్మిత్తు ప్రవేశపెంచినపుడు ఘనఃపూర్వకముగాఁ జేసి సంతోషపెట్టెను. ఒక్కనిమిషమైనను వ్యర్థముగాఁ బోనీయక పనిచేయుట కభ్యాసపడినవాఁడగుటచేత నెంత గొప్పపని యయినను గోట మీటివేయశక్తి కలవాఁడుగా నుండెను.

ఆతరగతిలోనే చేరి పాటునకు వెనుదీయక మిక్కిలి పాటుపడినవారిలో "సర్ బుల్వర్ లిట్టు" ననునాతఁడొకఁడు. ఈతఁడు చిత్రవచనప్రబంధములను పద్యకావ్యములను వ్రాసి కవి యయ్యెను. నాటకములను వ్రాసి నటుఁడయ్యెను. దేశచరిత్రములను వ్రాసి చరిత్రకారుఁడయ్యెను. వ్యాసములను వ్రాసి బోధకుఁడయ్యెను. మహావక్తయై యుపన్యాసములు విన్పించెను. రాజ్యాంగవిషయములం దెలిసికొని రాజ్యతంత్రజ్ఞుఁడయ్యెను. ఈతనివలె పాటుపడి బహుగ్రంథములను వ్రాసి ప్రఖ్యాతినొందినవారు కొందఱుమాత్రమే గలరు. ప్రతివిషయమునందును ప్రావీణ్యమునొందవలె నన్నసచ్ఛింతతో నీతఁడు స్వసుఖమును జూచుకొనక మిక్కిలి పట్టుదలతోఁ బాటుపడి క్రమక్రమముగాఁ బైకి వచ్చెను. మహారాజభోగము లనుభవించుటకును, వినోదములతోను వేడుకలతోను సోమరియై కాలము వెళ్లఁబుచ్చుటకును కావలసినంతభాగ్య మున్నను దానియం దభిరుచిలేక పాటునందే సుఖము కలదని దృఢముగా నమ్మి మహాగ్రంథకర్త యగుటకుమాత్రమే ప్రయత్నించి కృతార్థుఁడయ్యెను. బైరనుమహాకవివలెనే తాను ప్రప్రథమమున విరచించిన పద్యకావ్యము ప్రజారంజకము గాకపోయెను. తరువాతి విరచించిన చిత్రవచనప్రబంధముసహితము గణనకు రాకపోయెను. అట్టిసందర్భమున దుర్బలచిత్తుఁ డగువాఁడు కలమును కాగితమును నావలఁ బాఱవైచి గ్రంథకర్త యగుటకు మరల నెన్నఁడును గోరకుండును. కాని బుల్వరుమాత్ర మట్టివాఁడు కాఁడు. ఓపికయును బట్టుదలయును గలవాఁడు తనకోరికలు ఫలించువఱకు పాటుపడుటకుఁ గృతనిశ్చయుఁడై పరిశ్రమ చేసిచేసి ముప్పదిసంవత్సరములు భాషావిషయికప్రచారమునఁ గడపి బహుగ్రంథములను విరచించి సుప్రసిద్ధుఁ డాయెను.

మహావక్త యయిన డిజ్రాయిలీచరిత్ర మత్యద్భుత మయినది. ఈతని ప్రథమప్రయత్నములు బుల్వరురీతి గ్రంథకర్త కావలె నన్నవిషయమున వినియోగింపఁబడెను.

కాని యీతఁడు తొలుదొలుత ప్రకటించిన కావ్యములను జూచి ప్రజలు నవ్వ మొదలుపెట్టి యిచ్చవచ్చినటులఁ బరిహాసింపసాగిరి. ఈతఁడుమాత్రము తనపూనికను విడువక నిరంతరకృషివలనఁ దుదకు సఫలీకృతమనోరథుం డయ్యెను. తాను వక్త యనుపించుకొనవలె ననునభిలాషతో మొదట జనప్రతినిధిమహాసభలో నుపన్యసించినపుడు బహుజనపరిహాసమునకుఁ బాత్రుఁ డయ్యెను. ఈతఁడు మాటాడఁ బ్రయత్నించునపు డెల్లను ప్రజలు చప్పట్లు గొట్టుచు నెగతాళి చేయసాగిరి. ఈతనినోటనుండి వచ్చిన ప్రతివాక్యమును విని ప్రజలు పరిహాసింపక పోలేదు. తుదకు ప్రాణము విసిగి యీతఁడు భవిష్యత్తును దెలిపెడు నొక్కవాక్యమును బలికి తనయుపన్యాసమును ముగించెను. "నే ననేకపర్యాయము లనేకవిషయములను మొదలుపెట్టితిని; తుదకు నన్నిటియందును జయము గాంచితిని; ప్రస్తుతము నే నిపుడు కూర్చుండెదను; మీ రెల్లరును నా యుపన్యాసమును వినుకాలముకూడ వచ్చును." అని పలికిన కడపటివాక్య మాగందరగోళములో నెల్లవారికి వినిపించెను. అట్టికాలముకూడవచ్చెను. ఒకసారి ప్రపంచములోని మహాప్రభుసభలో గంభీరభాషణములతో డిస్రాయలీ ప్రసంగించునపు డెల్లవారును విస్మయానందమగ్ను లగుచు వినసాగిరి. ఆహా! అట్టిపనికయి యీతఁ డెంత పరిశ్రమ చేసియుండునో గదా! విసుగును విరామమును లేకుండఁ బాటుపడి పని చేయఁబట్టిగదా తనమనోరథ మీడేర్చుకొనఁ గలిగెను! సాధారణముగా పడుచువాండ్రు తా మొకపని చేయ మొదలుపెట్టి విఫలీకృతమనోరథు లగుదు రేని యంతటితో నాపనిని విడిచిపెట్టి నిరుత్సాహపడి మరలఁ బ్రయత్నింపక మూలమూలలకుఁ జేరి వ్యగ్రు లగుచుందురు. డిస్రాయలీయట్లొనరింపక మనోబలముచేత శ్రద్ధతోఁ బాటుపడి తుదకు జయమును గాంచి మహావక్త యని జనప్రతినిధిసంఘమువారిచేఁ గొనియాడఁబడెను. స్వయంకృషివలనను స్వశక్తివలనను ఘనకార్యములను నెఱవేర్పవచ్చునని తెలుపుటకు పై దృష్టాంతములు చాలియున్నను, జీవయాత్ర నడుపునపుడు వీనికితోడు పరులసహాయము కూడ నావశ్యకమయి యుండును. స్వయంసహాయమునకును పరసహాయమునకును పరస్పరవైరుధ్య మున్నను రెండును జంటగా నడుపఁబడవలెనని వర్డ్స్వర్తనుకవి చెప్పుచున్నాఁడు. బాల్యము మొదలుకొని ముసలితనము వచ్చువఱకు నెల్లవారును కొంచెమించుమించుగా పరసంరక్షణమునకును పరశిక్షకును పాత్రు లగుచున్నారు. యోగ్యులును దారుఢ్యవంతులునుగూడఁ బరులసహాయమును బడయుట కంగీకరించుచున్నారు. దృష్టాంతముకొఱకు అలెక్సిస్. డీ. టాక్విల్లీ చరిత్రమును శోధించి చూడుఁడు. అన్నివిధములచేతను ఫ్రాంసుదేశమునందలి భాగ్యవంత మయిన యొకజమీందారీ కుటుంబము

నందుజన్మించినవాఁడై తనతల్లిదండ్రులకుంగల యధికారపు చెల్లుబడినిబట్టి పర్సెల్లీసు నగరమున "జడ్జి ఆడిటరు" అను నుద్యోగపదవియందు నియమింపఁబడెనుకాని సమర్థత లేనందున నాతఁ డాపదవియం దుండుట కిష్టము లేనివాఁడయి యెవ్వ రేవిధముగా నిందించినను తా నెప్పుడు సమర్థుఁడను కానని నిశ్చయించెనో యప్పుడే యా పదవిని విడుచుట మంచి దని దృఢమనస్కుఁ డయి యాపనిని మానుకొనెను. అంతట నాతఁడు ఫ్రాంసుదేశమును వదలి యమెరికాఖండములోని సంఘరాష్ట్రములకుఁ బోయెను. అతనిమిత్రుఁడు "గస్టావ్డీబోమాంటు" అనునాతఁడు టాక్విల్లీని వెంబడించిపోయి యీప్రయాణమునందు టాక్విల్లి చూచిన యెన్నరానిపాటునుగుఱించి వర్ణింపసాగెను. అతనిస్వభావము సోమరితనమునకు విరుద్ధమైనదిగా నుండును. "ప్రయాణము చేయుచున్నను నిలిచి యొకచోట నున్నను ఆతనిమనస్సుమాత్రము విరామములేక పనిచేయుచుండును. ఆతఁ డెప్పుడు ప్రసంగించిన నుపయోగకరము లైనయంశములనే గాని యన్యములనుగూర్చి ప్రసంగింపఁడు; ఆతనికి వ్యర్థముగా గడపినదినము దుర్దినముగా నుండును; అల్పమాత్రపుకాలము వ్యర్థమైనను ఆతనిమనస్సును వేధించును." అని బోమాంటు వ్రాసియున్నాఁడు. కార్యసాఫల్యతకు స్వప్రయత్నమును స్వశక్తియందలి విశ్వాసమును నావశ్యకములని టాక్విల్లీ దృఢనిశ్చయము కలవాఁ డయినను పరసహాయము నంగీకరించి కృతజ్ఞతాపూర్వకవందనములఁ దెలుపుటయందు పాలుమాలియుండలేదు. తనకు వివిధవిషయములయందుఁ దోడ్పడిన తనమిత్రులగు డీకర్గార్లే, స్టోఫెల్సులకు పలుమాఱు తనకృతజ్ఞతను దేటపఱచుచు వచ్చెను. తనయొక్క విద్యావిషయికకృషిసాఫల్యత నొందునట్లుగా తనభార్య శాంతముతోను సహనముతోను గూడుకొనినచిత్తము గలిగి తనకుతోడ్పడినందులకై తనభార్య యగు మేరీ యనునామెకుఁగూడ తనకృతజ్ఞతావందనముల నర్పించుకొనియెను. మంచిమనస్సు గలిగినయిల్లాలు తనభర్తను యోగ్యవర్తన కలవాఁ డగునటులఁ జేయజాలియుండు ననియును, ఎల్లప్పుడును కొఱకొఱలాడుచు ధూర్తస్వభావము కలిగియుండుభార్య భర్తను హీనస్థితికిఁ గొనిపోవు ననియు నాతఁడు దృఢముగా నమ్మియుండెను. కావున విద్యావిహీనులగు స్త్రీలు భర్తలసదుద్యమములకుఁ దోడ్పడఁజాలరు. వారలకుఁ బురుషులతోఁబాటు విద్య నేర్పించినప్పుడే ప్రయోజకురాండ్రయి భర్తలకు పన్నెయు వాసియుఁ దెచ్చి తాము ప్రఖ్యాతిఁ గాంచుదురు.

ప్రసన్నయాదవ నాటకము.

ద్వితీయాంకము.

[అప్పుడు మందపాలుఁ డనురాక్షసుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

మందపాలుఁడు—(తనలో) ఛీ! ఛీ! ఈపాడుస్వర్గమున కేల వచ్చితిని. ఈయమరావతీపట్టణమును జూచినదిమొదలు నాకుఁ 'పేరుగొప్ప యూరుదిబ్బ' యనుసామెత జ్ఞప్తికి వచ్చుచున్నది. ఈనగరము సకలవస్తుసంపన్నమనియు సకలసంపదలకు స్థానమనియు మహావైభవసమేతమనియు పలుమారులు మహర్షులు వేనోళ్లఁ బొగడుచుండ విని కాఁబోలు ననుకొని నామనోరథములన్నియు సఫలంబులగునని పుట్టెఁడాసతో వచ్చి తుదకు మోసపోతిని. మనుషులుముండకొడుకులు స్వర్గముపైఁగల దురభిమానముచేఁ దీనిసంతగా వర్ణింతురేగాని దీనియందేమిగొప్పయున్నది? ఈమందాకినీనది యొకసముద్రమంత యున్నది. కాని యిందు నాకుఁ గావలసిన చేఁపలు జెల్లలు నత్తలు పీతలు రొయ్యలు లేనేలేవు. నోటికిరుచిగా వండించుకొని తినదమన్న నింతతూఁటిమూరైనఁగాని యిక్కడ లభింపదుగదా. ఈనదికన్నమాయూరి చెఱువే నయము. ఈనదిలో బంగారపుఁదామరపువ్వులున్నవఁట.! అవియెందుకు? దేవతలుతలలు పగులఁగొట్టుకొనుటకుఁ బనికివచ్చును. మూఁడుదినములనుండి నాకుముంజెకాయలపై ధ్యానముపోయినది. దారిద్ర్యదేవతకు నిలయమైన యీవేల్పువీటియందు తాటిచెట్టే లేదుగదా? అన్నముతిని నీళ్లుత్రాగి యెఱుఁగని యీనిర్భాగ్యులగు దేవతలకు తాటిపండు తినునంతటి భాగ్యముకూడ లభించునా? ఈపట్టణస్థితిఁజూడ నిందువసియించు వేల్పులు నాగరికత యెట్టిదో యెఱుఁగని మోటపసరము లని నాకుఁదోఁచుచున్నది. పోనీ. ఆవస్తువులు దొరకక పోయిన మానె. నామనసున నున్న తక్కిన కోరికలైన నెఱవేరినవా? దేవేంద్రునిపైఁ గత్తిగట్టి దండయాత్రకు వెడలు రాక్షసులందఱు కావలసినంత యమృతము ద్రావి చిరకాలజీవులు గావచ్చుననియు స్వర్గలోకమునం దప్సరసలువేనవేలుండురుగనుక నెవనికిఁ గావలసినదానిని వాఁడు శ్రమమునఁ జేయిపట్టుకొనితీసికొనిపోయి సుఖింపవచ్చుననియు సేనానాయకులగు మురహయగ్రీవులు నొక్కి పలుకుటచే కొండంత యుత్సాహముతో నేనురంభను జేపట్టి

తీసికొనిపోవచ్చునని యిందువచ్చితిని. కాని యమృత భాండమంతరించినది. గడుసులంజె రంభయే మైనదో యెవ్వరికిం దెలియదు; దానిజాడ దెలుపువారు నాకెవ్వరైనఁ గనఁబడిన బాగుండును. (అని యిట్టటుచూచి) అదిగోమావజ్రకంఠుఁడిట వచ్చుచున్నాఁడు. వీని నడిగి తెలిసికొనియెదను.

[అప్పుడు వజ్రకంఠుఁడు ప్రవేశించుచున్నాఁడు]

వజ్రకంఠుఁడు—(తనలో) బళి! బళీ! ఈనరకమహారాజుగారు చిరకాలజీవులై యుందురుగాక! ఈతని యధికార మాచంద్రార్కము నిలుచుగాక! ఈమహాత్ముని వలన నేగదా రావణకుంభకర్ణులనాఁటను తారకాసురబలిచక్రవర్తులనాఁటను లేనిగౌరవము మారాక్షసకులమునకు నేఁడుకలిగినది. కాని నరకమహారాజు మహేంద్రుని యుంపుడుగత్తె యగు నూర్వశిని గూడుటకై యభిలషించుచుఁ జంద్రోదయము కాఁగానే నన్ను తనవద్దకు రమ్మని యానతిచ్చె. ఈలోను మందబుద్ధియగు మందపాలునితో నించుక మాటలాడి వినోదించెద. వీఁ డెవరికొఱకో నిరీక్షించుచున్నాఁడు (అనిప్రకాశముగా) ఓరీ; మందపాలా! నీవెవరికొఱకు వెదకులాడుచున్నావు?

మందపా—(సమీపముగా వచ్చి) ఓరీ! వజ్రకంఠా! నీ విప్పు డెం దఱుఁగుచున్నావు? నీ కెక్కడనైన రంభ యగపడలేదుగదా?

వజ్ర—ఆహా! నా కొకయాఁడుది గనఁబడినది. అది రంభయే యై యుండ వచ్చును. అయిన నది యెట్లుండునో నీ వించుక యానవాలు చెప్పిన పక్షమున దాని జాడ నీకు నెఱిఁగింపఁగలను.

మంద—(సంతోషముతో) కనఁబడినదా? వెనుక రెండు మూడుసార్లు దానిని నేను దూరమునుండి చూచితిని. అప్పటినుండియు దానియాకృతి నామనసున నాటుకొనియే యున్నది. దాని కానవా లెఱిఁగించెద వినుము. అది చక్కనిచుక్క. దాని శరీరకాంతి తోటిపేసమువలెఁ బచ్చగనుండును. దానితలవెంట్రుకలు మసిబొగ్గులో జీడిగింజలో యనుకొనవలయును. దానికొప్పు మాలకాకివలె నప్పుడే యావములోనుండి తీసినపిడతవలె నల్లనై పెద్దదిగానుండును. దానిజడ యినుపగరిటెకాడలాగుననుండును. కన్నులాలిచిప్పలు. దానిపెదవి క్రొత్తావకాయపేడువలె నెఱ్ఱనై యుండును. మొగ మిత్తడిసిబ్బివలె గుండ్రముగ నుండును. అది పుష్పాలపావడఁగట్టియుల్లిపొరవంటి యుత్తరీయము వల్లెవాటు వేసికొని తక్కుచు తారుచు సొక్కుచు సోలుచు నిక్కుచు నీల్గుచు వంగుచుపొంగుచు నాడుచుపాడుచు నడచినప్పుడుచుక్కలలోఁ జంద్రులాగు గజ్జెలగోడిగలాగు రామచిలుకలాగు గోరంకలాగు పికిలిపిట్టలాగు నెమలిపెంటిలాగు హంసిలాగు తళ

తళతళలాడుచు మెలమెలలాడుచు జలజలలాడుచు చకచకలాడుచు పకపకలాడుచు నచ్చ ముగ భోగముదానివలె నుండును. వేయేల! అప్పుడు దానిం జూచిన మహామునులకైన మనసు కరఁగక మానదు. నీకది యెక్కడఁ గనఁబడినది?

వజ్ర—నిన్నరాత్రి కలలోఁ గనఁబడినది.

మంద—(కోపముతో) నన్నెగతాళి చేయుదువా? నీపొట్టపొడిచివెయ్య నీ కెప్పుడు నిటువంటిబుద్ధులే. నీనోరు మాటలాడుచున్న నీనొసలు వెక్కిరించుచుండును. మొదటనుండియు నొక్కమచ్చున నే బ్రతికినావు నీబ్రతుకు బండలుగాను. నేనా నీకు హాస్యమునకు దొరకినవాఁడను?

వజ్ర—తాతా! కోపగింపకు. ఉడుతలుపీఁకిన తాటిటెంకవలె తల గలిగి మీస ములు గడ్డము నరసిన ముసలిముండకొడుకునకు నీకు రంభ గావలసివచ్చెఁగదా యని యెగతాళి చేసితిని. కాని నీ విప్పుడు రంభవిషయమయి చేసినవర్ణనము మెచ్చఁదగి యున్నది. నీవు నిజముగఁ గోరినపక్షమున రంభను గలిసికొనునుపాయముఁ జెప్పెద వినుము.

మంద—నాతండ్రీ! నానాయనా! చెప్పుచెప్పు. ఈయుపకారమునకు నే నింకొకజన్మమున నీయింటఁ గుక్కనై పుట్టి నీఋణముఁ దీర్చికొనియెదను. నాకు కొడుకు పుట్టినపక్షమున నీపేరు పెట్టుకొనియెదను.

వజ్ర—ఇదిగోఁ జెప్పెదవినుము. రంభమొదలగు నచ్చరలు మనము స్వర్గమునకు వచ్చినతోడనే పాఱిపోయిరి. అయినను భయము లేదు. యుద్ధములోఁ గడతేరినవా రందఱు రంభాసంభోగము గాంతురు. అందుచే నీవొకకత్తితోఁ బొడిపించుకొని చచ్చి పొమ్ము. అప్పుడు నీకు రంభపొత్తు గలుగును.

మంద—అదిగో మరల హాస్యమునారంభించినాఁడవు. నేనదే వద్దన్నది. నాకుఁ గోపము వచ్చినయెడల నేను మంచివాఁడనుగాను. కాఁబట్టి యామాటను మాని నే నడిగినదాని కుత్తరము చెప్పుము. రంభ పాఱిపోయినదిసరే. ఊర్వశి మన కేమయిన కొంచె ముపకారము సేయునా?

వజ్ర—ఔరా! పిడుగా నీకడుపులో నెంతయూహ లున్నవిరా! మహారాజు గారు మోహించినయూర్వశియే నీకుఁ గావలయునుగా! సరే! జాగ్రత్తగా నుండు. ఈమాట మహారాజుగారితోఁ జెప్పి నీ డొక్క చీలించి ప్రేవులు తోడించి గ్రుడ్లు పీఁకించి వెన్నుచీరించి చెంపలుపగులఁగొట్టించి బుగ్గలు సాగఁదీయించి పిడ్డతో శైగరఁ గొట్టించి మోకాళ్ళచిప్పలు తీయించి నాలుక కోయించి తల గొరిగించి గాడిదమీఁద

నెక్కించి యూరేగించి కొలుతను చేయింపకపోయిన నాపేరు వజ్రకంఠుఁడు గాఁడు. మహారాజుగారియంతరమేమి నీయంతరమేమి తారతమ్య మెఱుఁగక మాటలాడెదవా?

మంద—(వజ్రకంఠునికాళ్ళపైఁబడి) నాతండ్రీ! నన్ను రక్షింపుము. బుద్ధి నేరక నోటి వట్టిపుకూఁతలు కూసితివి. మఱియొకసారి నే నిట్లు ప్రేలుదు నేని నన్ను నీచిత్తము వచ్చినశిక్ష చేయింపుము. కావలసినవాఁడవుగదా యని నీవద్ద నిట్లంటినిగాని యిది తప్పైనచో మరల నందునా?

వజ్ర—సరే! నిన్ను రక్షించితిని. ఇఁకముం దిట్టిమాట లెన్నఁడు ననకుము. ఇఁక నేఁ బోవలయును నన్ను విడువుము.

మంద—(లేచి) మీదయచేత నిప్పటికి గండముగడపి బ్రతికి బయటఁ బడితిని. నీ విప్పు డెక్కడికిఁ బోయెదవు.

వజ్ర—నరకమహారాజుగా రూర్వశీవిరహతాపమున కోర్వక యీరాత్రి వెన్నెలలోఁ బువ్వులపాన్పుపైఁ బవ్వళింతురు. ఊరడించుటకు ప్రియభృత్యుఁడనైన నే నాయనప్రక్క నుండవలయును. ఎన్నివర్తమానముల నంపిన నూర్వశి మహారాజు వద్దకు రాలేదు. అందుచే నామెను దోడితెచ్చుటకు సేనాపతియైన నిశుంభుని మహారాజుగారు పంచినారు. ఎట్లయిన చంద్రోదయ మగునప్పటికి నే నక్కడ నుండవలయు.

మంద—అదిగో విబూదిపండో ముగ్గుబుట్టయో తగరపుపళ్లెమో యన్నట్లు చంద్రమండల ముదయించుచున్నది. నీ వింక సత్వరము పో. నామాట నచ్చట బైలుపెట్టకుసుమా! రంభ నీ కగపడినప్పుడు నాతోఁ గొంచెము చెప్పు.

వజ్ర—వేయేండ్లు తలక్రిందుగఁ దపస్సుచేసిన రంభకు నీవంటిరసికుఁడు దొరకఁడు. ఆమెను నీవే వెదకికొనుము. నేవెతకఁజాలను.

(అని యిద్దఱు నిష్క్రమించుచున్నారు.)

ఇది విష్కంభము.

[అప్పుడు దేవేంద్రమందిరముముందఱ నొకచంద్రకాంతవేదికమీఁదఁ బువ్వుల పాన్పుపైఁ గూర్చుండి నరకాసురుఁడు వజ్రకంఠునితోఁ గూడిప్రవేశించుచున్నాఁడు.]

నర—ఓరీ! వజ్రకంఠా!

చ. అదిమితి నష్టదిక్పతుల నాహవభూమి నటన్న సంతసం
బొదవ దొకింత; రాజ్యరమ నూనితి నంచు మనంబునందు స
మ్మద ముదయింప దించుకయు మక్కువమై నొకసారి యూర్వశీ
పదయుగము న్భజింపఁ గలభాగ్యము నాకు లభింప కుండుటన్. 1.

వజ్ర—దేవా! ఆకోరికయు మీకచిరకాలంబునఁ దీఱఁగలదు. ఊర్వశిం దోడి తెమ్మని మీరు మననిశుంభుని బంపియున్నారుగదా! అతఁడామె నీపాటికి వెంటఁ బెట్టుకొని వచ్చుచుండునని నే నూహించెద.

నర—ఆహాహా! నా కంతభాగ్యము లభించునే? ఒకవేళ లభింపఁ దలఁచు కొన్నను దుస్సహ మయిన యీవిరహతాపము నన్నంతవఱకు బ్రతుకనిచ్చునని నాకుఁ దోఁచదు. ఈమదనునకుఁ దోడగుట కదిగో శీతమయూఖుఁ డుదయించినాఁడు.

తే. గీ. కలసి వేల్పులు భుజియించుకంచ మనఁగ
చంద్రబింబము వెలుగొందుఁ జదల నదిగో
సురలు దినువేళఁ గంచముచుట్టుఁ బడిన
మెతుకులట్టులు చుక్కలు మెఱయుచుండు. 2.

వజ్ర—మహాప్రభూ! మీరు సరిగా వర్ణించినారు. ఆకంచములోఁ బెట్టినప్రాంతే యుసిరికపచ్చడిముద్దవలెఁ జంద్రునిలో మచ్చ కనఁబడుచున్నది.

నర—ఓ చెలికాఁడా!

తే. గీ. విరహతాపాతిశయమున వెచ్చ నూర్చి
వికలచిత్తులై యున్న కాముకులఁ బట్టి
సూటి బొడిచెడు వజ్రంపుటీఁటె లనఁగఁ
జంద్రకిరణము ల్వ్యాపించె జగతియందు. 3.

మఱియు

శా. నీరేజప్రభవాండ మంతయును నిండె న్వెన్నెల ల్తత్పయః
పారావారతరంగమాలల కనుప్రాసంబులై దివ్యత
న్వీరంగన్నవమందహాసములకున్ నెయ్యంబులై సారక
ర్పూరక్షోదపరాగపుంజములకు న్బోరాని వియ్యంబులై. 4.

వజ్ర—ఈవెన్నెలకతమున బ్రహ్మాండ మంతయు సున్నపుకడవవలెఁ దెల్లనయి యున్నది.

నర—ఈచందమామ కాఁకలకు నాపువ్విలుకానిడాకలకు నాశరీర మింక నిలుచుట యరిది. ఈశశాంకునివి శాతశరములుగాని శీతకరములుగావు. సుధాంశుఁ డని పేరొంది నిప్పులం జెరుగుచున్న నితఁడు పయోముఖవిషకుంభమునుమా! అందు చేతనే—

తే. గీ. వనజనాభునికైన నవ్వజ్రికైన
నగ్నిదేవునికైన నయ్యమునికైన
వెఱచి యెఱుఁగని నే నిప్డు వెఱవవలసె
నిందునెలకును బందువెన్నెలకు నకట ! 5.

వజ్ర—కామలరోగము గలవానికి జగ మంతయుఁ బచ్చగఁ దోఁచునట్లు మదనతాపముగల మీకుఁ జల్లనివెన్నెల పీడాకరముగఁ దోఁచుచున్నదికాఁబోలు. చన్నీట దిగినదున్నపోతువలె నే నీవెన్నెలలో హాయిగ నున్నాఁడను.

నర—ఓరీ ! నీకు బలె నా కీజాబిల్లి సుఖప్రదముగ లేదు. నేను త్రిదివముపై దండువిడిసి మహేంద్రాదిదిక్పాలకుల రణరంగమున నోడించిపుచ్చి నాకమునుండి యమరులఁ బాఱఁదోలితి నని మనసునఁ గ్రోధము నిలిపి యమరపక్షపాతులగు మన్మథహతకుఁడు మొదలగువారు హాళాహాళి మెఱయ న న్నేఁచుచున్నవారు. చూడు—

సీ. మందవీజనములు మాటిమాటికి వీచి కసి మనంగఁగఁ జొచ్చె గాలివేల్పు
చలివెలుంగులపేరి పలుబల్లెములఁ గ్రుమ్మి సంహరింపఁగఁ జొచ్చెఁ జందమామ
కలువరేకులపేరి కఱకుఁగత్తులఁ జీల్చి పగఁదీర్చుకొనఁ జొచ్చెఁ బంచశరుఁడు
నవలతాంతములతో నందనమ్మును నింపి యలయింపఁగాఁ జొచ్చె నామనిదొర
అక్కటక్కట వీరియం దొక్కఁడొకఁడె
జగము లొక్కొక్కకడకుఁ దేఁజాలు ననఁగ
దుర్మదమున నీదుష్టచతుష్టయంబు
చేర నొక్కతావున కింకఁ జెప్ప నేల? 6.

వజ్ర—(తనలో) ఈయన యిప్పు డూర్వశిపైఁ గలమోహముచే సమస్తమును మఱచియున్నాఁడు. వీనిమనసును మఱియొకవిషయముమీఁదికి మరలఁ పెదను. (ప్రకాశముగా) దేవా! స్వర్గలోకము జయించియు మీరు విజయఫలము ననుభవింపకున్నారు. ఒక్కసారి యచ్చరలయాటలం జూచి గంధర్వులపాటలు విని మందారపుష్పదామముల మెడఁ దాల్చి నందనోద్యానమున విహరించి మేరుగిరికూటముల నెక్కి సురదీర్ఘికల జలక్రీడఁ గావించి సుఖించి యమరావతిని గొల్లలాడి మాకన్నులకు విందొనరింతురుగాక యని ప్రార్థించుచున్నాఁడను. అమృతకలశము కామధేనువు చింతామణీరత్నము మనపాలఁ బడునేమో యను నీసున నింద్రహతకుఁడు వానిని మనము రాకమున్నె తరలించుకొనిపోయె. ఉన్నవైనను మనసార ననుభవింపవలదే ?

నర—వజ్రకంతా !

తే. గీ. నందనోద్యానవన మేల నాక మేల
కామగవి యేల మణి యేల కల్ప మేల
యప్సరస లేల యిఁక నా కమృత మేల
చెలియ యూర్వశి నను గృప సేయకున్న. 7.

మఱియు నామనోనిశ్చయ మొక్కసారి వినుము.

సీ. ఈవెన్నెలల వేల్పుటెలనాగతోడి సయ్యాటలే కాని యేయాట లొల్ల
నొప్పుల గనియైన యూర్వశీరమణిసంగాత మే కాని సంగీత మొల్ల
వగ లెల్ల మఱపించు సొగసులాడిపసాళీనవ్వు లేగాని యేపువ్వు లొల్ల
నతనుతాప మడంచు నాకాంత యేకాంతసేవలే గాని యేసేవ లొల్ల
అమరగణికాతిలకముకూటము లె కాని
కనకగిరికూటముల నొల్ల గడియగైన
కోమలాంగి సిగ్గులు కొల్లగొను టెగాని
అమరనగరంబు నేఁ గొల్లలాడ నొల్ల. 8.

వజ్ర—సరే! మీనిశ్చయము తెలిసినది. మీ రీవేల్పుభోగముతో తుకూఁతు పొత్తు మరగి ప్రపంచమే మఱచియుందురు. ఈవీలు చూచి దురాత్ములగు నిర్జరులు మరల విజృంభింతురు. అంతట నెండిపోయినచెఱువులో చేఁపలవలె బయలుపడి మేము నశింతుము. ఊర్వశికన్న మిన్నలగు వెలయాండ్రు భూలోకంబున నెందఱు లేరు దీనికై యింత దురపిల్ల నేల?

నర—ఓరీ! నాకవేశ్యలకు భూలోకవేశ్యలకుఁ గలతారతమ్య మెఱుఁగని యరసికుఁడ వగుటచే నీ వి త్తెఱగున ప్రేలఁ జొచ్చితివి. ఆభేదముఁ జెప్పెద వినుము.

వజ్ర—వద్దువద్దు చెప్పనక్కరలేదు. నే నాభేద మిదివఱకే యెఱుఁగుదును. భూలోకవేశ్యాకాంతలకుఁ బలె స్వర్గవారకాంతలకు విటులయెముకలు కటకట కొఱికి వేధించుకొని తినుతల్లిముండ లుండరు. నెత్తురు పీల్చుజలగలట్లు మర్త్యవారాంగనలు విటునిధన మెల్ల హరించి యిల్లు గుల్లఁజేసి తిరిపమెత్తింతురు. సురవేశ్యలకు సొమ్మక్కర లేదు. కాని మనుజలోకమునందలి పణ్యాంగనలకుఁ జావుండుటచే నెప్పటికయిన విరు గడయయి పోవుదురు. ఈస్వర్గలోకపు బోనిసకూఁతులకుఁజావులేదు. పాపీ చిరాయు వన్నట్లు బ్రతుకుదురు. ఇదియే నే నెఱిఁగినభేదము.

నర—ఓరీ! నే నడిగినభేదము సౌందర్యవిషయమున. ఇటు విను—

ఆ. వె. ఎంతకాలమైన నెలజవ్వనమె నిల్చు
ముదిమి రాదు సెడదు మోవికావి
నిడువకనుల బెళుకు నెమ్మేనితళుకును
నంతకంత కెచ్చు నచ్చరలకు. 9.

వజ్ర—నాకంటికాఁడువాండ్రందఱు సొగసుగనే కనఁబడుదురుగావున చక్కఁదనమున నెక్కువతక్కువలు నిర్ణయింపఁజాలను. కాని మీపలుకులంబట్టి వేల్పువెలయాండ్రకు మరణము లేకపోవుటయేగాక ముదిమియు లేదని తేలినది. పోనీ. అందఱు కొంపలు దీయుచు జాల్లలాగున బ్రతుకనిమ్ము

నర—వజ్రకంతా! మననిశుంభుఁడేలొకోకడునాలస్యము చేయుచున్నాఁడు. ఊర్వశి వానికిఁ గనఁబడియుండదా? కనఁబడిన రానొల్లడా? ఆలస్యకారణ మేమో నీవు పోయి తెలిసికొనివచ్చెదవా?

వజ్ర—నా కింతకన్న నుద్యోగ మే మున్నది? అట్లే పోయెదను. ఓ దైవమా? అందఱు నాచుట్టునుదిరిగి నాకాళ్లపైఁబడునట్లు నన్నొకస్వర్గలోకపు భోగముదానిగఁ జేయక యీ దిక్కుమాలినపుట్టుక యేల పుట్టించితివి? (అని కొంచెము నడచి) అమ్మయ్యా! నాయదృష్టము బాగున్నది. ఊర్వశిం దోడ్కొని యదిగో నిశుంభుఁ డిటనే వచ్చుచున్నాఁడు.

నర—(దిగ్గునలేచి) ఏది? ఏది? నాయూఱువప్రాణము?

వజ్ర—అదిగో! మననిశుంభునివెనుక నడుగులు లెక్కపెట్టుకొనుచుఁదలవంచుకొని పెల్లికూఁతువలె నడచి వచ్చుచున్నది.

నర—వజ్రకంతా! మహేంద్రుఁ డూర్వశి నిచ్చట విడిచిపోవుటచేఁ గామగవియు నమృతభాండము మొదలగు దివ్యవస్తువులను దివమునుండి తఱలించుకొనిపోయె నని నా కిప్పుడు విచారము లేదు.

క. నాపాలి సురభి యిదియే
నాపాలిఁటి పారిజాతనగ మియ్యదియే
నాపాలియమృత మిదియే
నాపాలిఁటి రత్న మిదియె నానిధి యిదియే

వజ్ర—వెఱ్ఱికి వేయివిధములు. అందులో నిది యొకటి.

నర—ఓరి! మూర్ఖుఁడ జగన్మోహనమగుదాని యాకార మొక్కసారి కన్నులకఱవు దీరఁ జూడుము. ఆహాహా! నాకన్నులింతకాలమునకుఁ జరితార్థత నొందినవి.

సీ. లావణ్యమును గ్రక్కు — లలనమోమును జూచి చూడ నక్కఱలేదు సోము నింక
సిరికిఁ దానకమైన చెలువఁ జూడ్కిఁ దలంచి తలఁప నక్కఱలేదు తమ్మిరేకు
మిఱుమిట్లు గొలుపు నెమ్మేనివన్నియ నెంచి యెంచ నక్కఱలేదు మించుమాట
యుండి లేనటు లుండు నువిద నెన్నడు మెన్ని యెన్న నక్కఱలేదు మిన్నుత్రోవ
తేట తేనియబావి యా తెఱపమోవి
చెప్పి చెప్ప నక్కఱలేదు చిగురు పేరు
పొలఁతి జఘనమండలి పొంతఁబోయి పిదప
పోవఁ బనిలేదు మిన్నేటిపులినములకు. 11.

మఱియును:

ఆ. వె. ఇంతికన్ను లుండ నించువిల్కానికిఁ
దూణ మేల? పేరుబాణ మేల?
కలికిప్రాపుఁ బడసి కాఁబోలు మరుడిట్టు
లూడలు మఱచి తిరుగుచున్నవాఁడు 12.

[అప్పుడు నిశుంభుఁడనురాక్షసుఁడు, ఊర్వశితోఁ బ్రవేశించుచున్నాడు.]

ఊర్వ—(తనలో) రంభాదులగు నచ్చరల యదృష్టములు తిన్ననగుటచే వారీ రాక్షసునిదృష్టిపథమునఁ బడకుండ నావలకుం దాటిరి. మందభాగ్యురాల నగు నే నంతటిపుణ్యము చేసికొననైతిని. ఇంతకు విధినియోగము దుస్తరము. అచ్చరనైన నేమి? వేల్పువారప్రాపకము గాంచిన నేమి? ఇడుమలు గుడువవలసినకాలము వచ్చినప్పుడు తప్పునా? రాక్షసులే తులువలు: అందు నరకుఁ డధమాధముఁడు. వీనియనుచరుల చర్యలం జూచి మహాపాతకు లందఱుతలలువంచుకొనవలయును. వీనియెదుటికి రాక యుందమని యెన్నివిధములఁ బ్రయత్నించినను సాగదయ్యె. అయినను బడఁతుల బలిమిబట్టి మానభంగము సేయు నరకపాతకునిబారినుండి తప్పించుకొనుటకు దైవమే దైన నొక్కయుపాయము దోఁపింపఁడే? (తలవంచినిలుచున్నది.)

నిశుం—(తనలో) స్వామి కేది మనఃప్రియమగు నది సేయువాఁడె విశ్వాసము గల సేవకుఁడు. యజమానులయాజ్ఞఁ జెల్లింపక వారిమేలుకొఱకే వారిమాటలు మేము నిరాకరించుచున్నవారమని చెప్పుసేవకులు కేవలము కృతఘ్నులు దండ్యులు నని నా యభిప్రాయము. మంచిదే కాని చెడ్డదే కానీ రాజాజ్ఞ చెల్లి తీరవలయు. అందుచేత నే యూర్వశీ విరహతాపమున దురపిల్లుమహారాజునకు నేను వాంఛితార్థసిద్ధిఁ జేసితిని. నా రాజభక్తికి నరకుఁడు శాశ్వతకాలము కృతజ్ఞుఁడై యుండు (రాజునుసమీపించి) (ప్రకాశముగా) మహారాజా! జయము! జయము!

నర—మిత్రుఁడా! నీవు కావించినమహోపకారమునకుఁ గృతజ్ఞుఁడ నగుచున్నాఁడను.

నిశుం—దేవరవారికి నేను జేయవలసిన పనియే జేసితిఁగావున స్తోత్రమున కనర్హుఁడ.

వజ్ర—ఈనిశుంభునకు సైన్యాధిపత్యమునకన్న నేర్పుకంటె మహారాజునకు మిండకత్తెలను దాఁచుటలో నెక్కువప్రజ్ఞ యున్నట్లు కనఁబడుచున్నది. వాని నింక మీఁద నిట్టియుద్యోగములో నుంచుటయే మంచిది.

నిశుం—ఓరి మూర్ఖుఁడా! వజ్రకంఠ! నింగను నాశ్రయించిన చక్రవర్తి రాజాశ్రయమున నీవు నిర్భయముగఁ జరించుచున్నాఁడవు. ఇప్పుడీమహారాజుమొగముఁ జూచియేసుమా నీప్రాణంబులు నీశరీరములోనే నుండనిచ్చినది.

నర—మిత్రమా! ఈయవ్యక్తిమాటలు మొదటనుండియు నీ కెఱిఁగినవేకదా?

నిశుం—దేవా! వానిమాటలు నే సరకుసేయను. ఇదిగో యూర్వశి వచ్చి జంత్రపు బొమ్మవలె నిలుచున్నది. దేవర యపాంగావలోకనముల దీనిపైఁబరపి మన్నింపుఁడు.

నర—మిత్రుఁడా!

తే. గీ. వేయుఁగన్నుల వనరుచు వేల్పుఱేఁడు
తరుణిలావణ్యమును జూచి తనివి సనక
యున్నవాఁడన నేఁ దృప్తి నొందఁగలనె
కనులు రెండింటితో నొక్కగడియ చూచి 13.

గౌతమశాపము మహేంద్రునకు నిజముగ నీవిషయమున వరమె యైనది. ఈసమయమున నేను సహస్రాక్షుఁడనుగాఁ గాకపోవుటయు నొకలోపమె.

వజ్ర—అదియెంత భాగ్యము. ఏమునియో పట్టఁజాలనికోపము వచ్చినప్పుడు మన కంతటిభాగ్యముఁ గలుగఁజేయకపోఁడు.

నిశుం—ఊర్వశీ! కొయ్యబొమ్మవలె నిలిచియుండెదవేల? మహారాజునకు మ్రొక్కుము.

ఊర్వ—(తనలో) కటకటా! మహేంద్రునకు వేల్పులనిండోలగంబున జోహారుఁ జేయుచేతులతో నీదానవాధమునకు మ్రొక్కవలసె. (ప్రకాశముగ) దానవేంద్రా! నమస్కారము.

నర—(తనలో) దీని నెప్పు డేమని దీవింతును? నామనసులోనిభావము తేటఁబడున ట్లాశీర్వచింపవలెను. (ప్రకాశముగ) ఓత్రిభువనరత్నమా?

మ. త్రిజగన్మోహనమై దివాభరణమై దేవేంద్రునిక్షేపమై
యజనిర్మాణముకన్న బ్రౌఢతరమై యామన్మథోద్యజ్జయ
ధ్వజమై కన్నులపంటయై లలితమై ద్రష్టవ్యమై చాల న
క్కజమౌ నీసెజ్జవ్వనం బలరు తన్గళ్యోణియెల్లప్పుడున్ 14.

వజ్ర—తథాస్తు.

ఊర్వ—(తనలో) ఈదురాత్ముఁ డపూర్వమైన యాశీర్వచనముచేఁ దన నింద్యమగుభావనను వెల్లడి చేయుచున్నాఁడు. అయ్యో! నా కీదినమున నేదియో కీడుమూడ నున్నయది.

నిష్ఠుం—ఈదీవనకామె యలిగి మీపై కోరచూపులఁ బ్రసరింపఁజేయుచున్నది.

నర—అట్లయిన నామె చూపులను నేను బ్రసన్నములుగఁ జేసికొనియెద. ఓలావణ్యరాశీ!

మ. చెలులై తేంట్లను సోగలై వెడదలై చెంగల్వచుట్టంబులై
జలజాతంబుల నేలునట్టి కోరలై సౌభాగ్యపుందీవులై
కలుముల్జిమ్ము క్రొవ్వులై కఱకులై కందర్పవాల్తూపులై
చెలువొప్పారెడు నీదుచూపులకుఁ నాశీర్వాద మబ్జాననా! 15.

వజ్ర—తథాస్తు.

నిష్ఠుం—ఈపలుకులంబట్టి మీరు శతమన్యునికంటె నూఱుమడుంగు లెక్కుడు రసికులని యూర్వశి యిప్పుడైన తెలిసికొనకపోదు.

వజ్ర—ఆయన నూఱురెట్లు రసికుఁడు. ఆయనబంటవు నీవేఁ బదిరెట్లు రసికుఁడవు.

నిష్ఠుం—ఓరీ! తుంటవా! నీపాడునోటికి బుద్ధిచెప్పుట కిది సమయముగాదు (రాజుతో) దేవా! మురహాసుగ్రీవులు నారాక నిరీక్షించుచుందురు గావున శిబిరమునకుఁ బోవ నాకానతిండు. యూర్వశీ! లేనిపోని బోగముటెక్కులు చేయక ప్రసన్నురాలవై మహారాజు ననుగ్రహము సంపాదించుకొనుము.

నర—నీమేలు నేనుమఱచిపోను నీవింక శిబిరమునకుఁ బొమ్ము

నిష్ఠుం—చిత్తము. మీబంటున కదియే గావలసినది (అని నిష్క్రమించును)

వజ్ర—(తనలో) ఇప్పుడు మారాజునకు శనిగ్రహము వదలినట్లే యున్నది.

ఊర్వ—దానవేశ్వరా! దేవరవారు నన్నుఁ బిలిపించినకారణ మేమో తెలియఁ గోరుచున్నాను.

వజ్ర—తొందరపడకు. స్వల్పకాలములోనే తెలిసికొనఁగలవు.

నర—ఓసుందరీ!

ఉ. ఇన్నెలఱాలతిన్నియల నిన్ననపొన్నల మేను జేర్చి యీ
వెన్నెలరేల నే నిటుల వేఁగుచు వన్నె దొఱంగి యుండుటల్
కన్నులఁ జూచియు న్బిలుపఁగాఁ గత మే మని నంగనాచి వై
న న్నడుగం దలంచు టిది న్యాయమె కారణ మీ వెఱుఁగవే? 16.

అయినను దత్కారణము నీవు నానోట నే వినఁదలఁచుచున్న దానవు కావున నేఁ జెప్పకపోవుట పాడిగాదు. సహస్రాక్షుని గెలిచి యమరసామ్రాజ్యాధిపత్యమును నేను గైకొంటినిగాని నీవు లేనిచో నింద్రత్వము పరిపూర్ణము గాదు స్వర్గరాజ్యలక్ష్మి నీతోఁ జిరకాలముఁ గలసిమెలసి యుండుటంజేసి తా నొంటిగ నాకడ నుండ నొల్లకున్నయది. కారణము తెలిసెనదా?

వజ్ర—దేవా! దీనికి స్పష్టముగ విప్పి చెప్పినంగాని తెలియదు.

నర—అట్లయిన నిదిగో విస్పష్టముగఁ జెప్పుచున్నాఁడ.

తే. గీ. ఇంచువిలుకాఁడు నన్నది యేమొ కాని
యేఁచుచున్నాఁడు నెనరొకింత లేక
మరునితోఁ జెప్పి యాపీడ మాన్పఁగదవె
మరుఁడు వినకున్న నీవైన మాన్పఁదగవె? 17.

వజ్ర—ఈమాత్రపుఁగార్యమునకు నీ వింత వేఁడవలయునా? నాకలోకవేశ్యలలో నూర్వశి పెద్దపిన్న తారతమ్యము లెఱిఁగినయోగ్యురాలు. మఱియు నిది దానిచేతిలోనున్న పనియే గనుక నీమాటత్రోసివేయదు.

ఊర్వ—(తనలో) ఆహాహా! ఆయజమానునకీసేవకుఁడు దగినవాఁడె. ఈరాక్షసాధముఁడు కామాయత్తుఁడై యొడలు దెలియకయున్నవాఁడు. వీనికి నే నిప్పు డేమి యుత్తరముఁ జెప్పుదును. (అని యాలోచించుచున్నది)

నర—(తనలో) ఇది నామాట కుత్తర మీయకున్న దేమి; (ప్రకాశముగ)

మ. అనుమానించెద వేల సుందరి యహల్యా జారుఁడన్నేను గా
ననియో కన్నులు వేయి లే వనియొ నాకయ్యింద్రునం దున్న మే
ల్గానము ల్నాకడ గానరా వనియొ నీలోఁ జింత నే నెట్టు లు
న్నను మీయింద్రునిపాటి సేయనఁట కాంతా చింత నీ కేటికే? 18.

ఊర్వ—దేవా! ఎదుట లేనిమహేంద్రుని దెప్పుట తగవు కాదు. వారిగుణములు మీకు రావు; మీగొనములు వారికి రావు. వారంతవారు వారు. మీయంతవారు మీరు.

వజ్ర—సరే! నాయంతవాఁడను నేను. నీయంతదానవు నీవు.

నర—ఓకళ్యాణీ! నీకిష్టము లేదుగావున నింక మహేంద్రునిమాట నే నెత్తను. కాని నాప్రార్థన మంగీకరించి నాయంతిపురమునకు రమ్ము. నావలన నేభయంబును నీవు పడనక్కరలేదు.

మ. పాలంతీ కన్నులఁ గప్పుకొందుఁ బువులం బూజింతు నిన్నా స్తవం
బలరం బట్టపుదేవిఁ జేయుదును నీయాజ్ఞం దలం దాల్తు వే
ల్పుల కెల్లం దొరసాని వయ్యెదవు మహాప్రొద్దు న్నినుం గొల్తు దై
త్యు లింక న్నీకనుసన్నల న్మెలఁగి చేతుల్మోడ్చి నీభృత్యులై 19.

తియు నింద్రునికడ నీవనుభవించిన దానికంటె వేయిమడుఁగులు మహదైశ్వర్యము ననుభవింపఁగలవు. అదియునుగాక;

తే. గీ. ఇంతకాల మింద్రునిగూడి యెఱిఁగితి గద
యతనిసరసత్వ మతనియొ ప్పతని నేర్పు
చిగురుఁబోఁడి కొన్నాళ్లు చూచెదవు గాక
నాదురసికత నాసొగసు నాతెలంగు 20.

ఊర్వ—దానవేంద్రా! దుర్నిరీక్ష్య తేజోరాశివై శ్రేయఃకాముఁడ వైన నీనోట నుండి యిట్టిపలుకులు రానిచ్చుట కేవల మనుచితము.

వజ్ర—అబ్బో! ఇది శ్రీరంగనీతులు చాల నేర్చినది.

నర—ఊర్వశీ! ఇది యేటిసరసమే;

మ. వనితా ప్రాపకు తోటకు న్సరసు లెవ్వారైన రావారి గ
న్గొని లాలించుట యొప్పుగాని విరసోక్తు ల్పల్కి తచ్చిత్తరం
జనము న్జేయకఁ జెంగనాడుదురె వేశ్య ల్గారె మీ రింక చా
లును మీసానితికంబు లింతటివసే లోకుల్ నినుక్ నవ్వరే 21.

వజ్ర—అయ్యా! ఇది సరసురాలు గానట్టు నటించుచున్నది గాని సరసము లేక పోలేదు. ఇది యెన్నెన్నో కొంపలు గాల్చిన కొఱవిగాని సామాన్యురాలు గాదు.

ఊర్వ—దేవా! మహారసికులైన యితరవారిచిత్తము రంజనము జేయఁగలపాటి రసికత నావద్ద లేదు.

నర—సుందరీ! ఇది నిశ్చయముగ గర్వోక్తి సుమా!

తే. గీ. ఎంతరసికురాలవోగదే యింతి నీవు
ఎంతదానవుగాకున్న నింద్రుఁ డట్టి
ముజ్జగంబుల దొర కేలుమోడ్చి నీకు
దేవసంతతితోడ విధేయుఁ డగునె 22.

మఱియు

తే. గీ. ఎల్లజగముల గెల్చె దేవేశ్వరుండు
అతని గెల్చితి నేను బాహాబలమున
నన్నుఁ గెలిచితి వీవు విన్నాణమునను
నిన్ను సామాన్యురాలన నేర్తు నెట్లు? 23.

వజ్ర—మహాప్రభూ! ఏలినవారు నిజము గ్రహించినారు.

ఊర్వ—రాక్షసేశ్వరా! చక్కఁదనమున నెఱజాణతనమున నన్నుఁ బూరికింగొనని ప్రోడలు స్వర్గమర్త్యపాతాళములయందు మీకుఁ గావలసినంద ఱుండఁగ నెన్నఁడో యౌవనమంతయుఁ బోయిన ప్రాఁతదానను నన్నుఁ గోరెదరేల?

వజ్ర—ఈవగలాఁడి మిమ్మును బుట్టలోఁ బెట్టుటకుఁ బ్రయత్నించుచున్నది. జాగ్రత్త.

నర—ఏమి! నీవు యౌవనము సెల్లిపోయిన ప్రాఁతదానవా?

తే. గీ. ప్రాఁతవడినను బంగారు వన్నె చెడునె?
ప్రాఁత చెట్టులు తియ్యనిపండ్ల నిడవె?
ప్రాఁతదయ్యును జాఁబిల్లి వసచెడియెనె?
ప్రాఁతకొత్త లేమిటికి సువస్తువులకు? 24.

వజ్ర—ప్రాఁతమానులు చేవఁదేరునట్లు లీమె ప్రాఁతదాటచే నెక్కుడుజాణగానున్నది. మఱియు ప్రాఁతవస్తువులు పథ్యములని చెప్పుదురు. కావున నీమెపొందు మీకు పథ్యమే!

ఊర్వ—నాయందు మీకుఁ గలయనురాగాతిశయముచే మీకన్నుల కట్లు నేఁగనఁబడుచున్నదానను.

నర—కాంతా! అట్లు గాదు.

తే. గీ. మెఱుపుఁదీఁగెకు వన్నెలు తఱుగునేని
కలికి నీమేనిజగ్గులు కగ్గవచ్చు
పుట్టతేనియలోఁ దీపు పోవునేని
పొలఁతి నీయందు రసికత పోవవచ్చు. 25.

ఊర్వ—నరకమహారాజా! జన్మమునుబట్టి నేనొకపణ్యాంగననైనను సకలజగజ్జనకుఁ డగుమహేంద్రునకు వలపుగత్తెనై యుండుటంజేసి నేనట్టియోగ్యులకుఁ దగియుండకపోయినను నింద్రునియందలి గౌరవముననైన లోకమాతగాఁ బరిగణింపఁబడవలసినదానను.

నర—(ఆశ్చర్యముతో) ఏమీ! నీవు లోకమాతవా?

తే. గీ. మగువ నీయందు నింతింతమహిమ లుంట
యింతకాలంబునుండి నే నెన్నఁ డెఱుఁగ
క్రొత్తసంగతు ల్నెఱిఁగికొంటి నహహ
ప్రాఁతలంజె లిప్పుడు లోకమాత లైరి. 26.

వజ్ర—ఓహోహో! ఇది లోకమాతయఁట! మా కందఱకు తల్లి యని పైలుదేరును గాఁబోలు. అట్లయిన నీమె మాపాలిటి పెద్దమ్మయె.

ఊర్వ—అసురనాయకా! నేను లోకమాతననుట నీకు హాస్యాస్పదముగ నున్నయది. అట్లయిన నిటు విను 'పితృసమో జ్యేష్ఠ' యను శాస్త్రవచనమునుబట్టి మహేంద్రుఁడు నీ కగ్రసహోదరుఁ డగుటచే నే మీకు వదిన నైతిని. మోహ మెంత యున్నను వావియైన దలఁపవలదా?

వజ్ర—ఇష్టము లేనప్పుడు కులటలు వావివరుసలు వెదకుదురు.

నర—ఓహో! ఇప్పుడు నీకు వావివరుసలు గావలసివచ్చెనా? నీపూర్వచరిత్ర మించుక దలఁచుకొనుము. కాదు కాదు. నేనే జ్ఞప్తికిఁ దెచ్చెద వినుము.

చ. నెలఁతరో యేమి కావలయు నీ కలపాండవమధ్యముండు నీ
గళమునఁ దాళిగట్టినమగండె? నీకు బురూరవుండు నీ
చెలియగునట్టి మేనకకుఁ జేపడుచుట్టమె గాధిపట్టి నా
వుల వెదకం దలంచెదవె బోగము బోఁటికి వావు లేటికే? 27.

ఊర్వ—(తనలో) ఇతఁడు నాప్రాఁతతప్పు లన్నియుఁ బైఁబెట్టుచున్నాఁడు. ఇఁక నేమివంకఁ జెప్పుదును.

వజ్ర—సూదికొఱకు సోదికిఁబోవఁ బ్రాఁతఱంకులు బైటఁబడినవఁట. ఈకథ యట్లున్నది.

ఊర్వ—రాజా నే నెవ్వతె నైనను నీకుఁ బరకాంతనుగదా!

నర—పరకాంత వెట్లగుదువు? వేశ్యవగుటచే నందఱకు సామాన్యకాంతవు.

తే. గీ. ఎవఁడు ధన మిచ్చు మీకు వాఁడె మగఁ డంచు
బ్రహ్మ మూఁడుబంతులఁ దీర్చి వ్రాసె నుదుట
గడుసుపోకడ లిఁకఁ జాలుఁ గట్టిపెట్టు
నకిలి నీయాట లిచ్చట సాగిరావు. 28.

ఊర్వ—అనురాగము లేనియబలను బలిమిఁబట్టిచూచుట యధర్మము కాదా?

నర—ఏమి! మా కిప్పుడు ధర్మోపన్యాసములు సేయవచ్చితివా?

చ. జిలిబిలి తేనెపల్కులును జెన్నగు తళ్కులు వాలుచూపులున్
జెలువపుఁ గోపులున్ రకపుఁ జిన్నెలు వన్నెలు పెన్వఁగ న్నగల్
నిలుకడలేని హాసములు నింద్యప్రవేశములు న్ధరించి లో
కులఁ బడఁ ద్రోయు వేశ్య లిటఁ గ్రొత్తగ నేర్చిరె కొన్ని ధర్మముల్. 29.

మఱియు

తే. గీ. దనుజులము మేము మా కేల ధర్మ మేల
వావి వరసల నెన్నెడువారు వేరు
వేల్పు లెవరైన నినుఁ గోరి పిలుతురేని
వారికడఁ జెప్పు నీనీతివర్తనములు. 30.

వజ్ర—తొండముదిరి యూసరవెల్లి యయినట్లు ప్రాఁతకులటలు పరమపతివ్రత లగుదురుగాఁబోలు.

ఊర్వ—(కోపముతో) ఓ రాక్షసరాజా! మేము వేశ్యలమైనను పతివ్రతలమే సుమా!

నర—పతి యున్నప్పుడేగదా పతివ్రత యగుట పతియే లేనిదానిమాట యేమి?

ఊర్వ—దివస్పతియే నాపతి.

నర—ఈదివస్పతి కట్లు నీవిదివఱ కెందఱికో పతివ్రతవైతివి. అట్లే నన్నుం బతిఁ జేసికొని నాకునుం బతివ్రత వగుము.

వజ్ర—ఊర్వశీ నీవెట్టిపతివ్రతవో యీయనయు నట్టియేకపత్నీవ్రతస్థుఁడు. నీ వాయనను జేపట్టితివేని మీ కనుకూలదాంపత్య మగును.

నర—మఱియు భుజబలంబున వేల్పులం గెలిచి నే నిప్పుడు దివస్పతి నైతిని. నీవు మాటనిలుకడ గలదానవై దివస్పతినైన నన్నుం జేపట్టుము. నీవు నాకుఁ బ్రసన్నురాల వగుదువేని సకలలోకకళ్యాణంబగు. కావేని నాకరాజ్యలక్ష్మిం గైకొన్నచందంబున నిన్నుం బలిమిఁ గైకొనవలసివచ్చు.

ఊర్వ—(తనలో) ఈదురాత్ముఁడు మానభంగంబు చేయఁ గృతనిశ్చయుఁడై యున్నవాఁడు. మలినవస్త్రమును మాలిన్యముచేతనే శుద్ధిఁ జేయునట్లు దురాత్ములను కపటోపాయములచేత నిర్జించుట యుచితము.

వజ్ర—ఓ వెఱ్ఱిదానా? ఊర్వశీ! ఈమహారాజు మిక్కిలి మంచివాఁడు. చెడఁగొట్టుకొనక యీయన ప్రాపకము సంపాదించుకొని సుఖపడుము.

ఊర్వ—దేవా! ఈవఱకు నాపలికినపరుషోక్తులకు నన్ను క్షమింపవలయు. నే నిప్పటికైన నీదాననే.

నర——(సంతోషముతో) ఓభువనైకసుందరీ!

తే. గీ. నిన్ను క్షమియింప నేటికి నీపలుకులు
చాలఁ గఠినంబు లయ్యును జల్లనగుచుఁ
బరమసుఖ మిచ్చె వడగండ్లపగిది నొప్పి
మదనసంతప్త మైన నామదికి నబల. 31.

వజ్ర——వలపుగలవారు ప్రియురాండ్రు తాళ్ళు రువ్వినఁ బువ్వుల రువ్వినట్లు సంతసింతురు.

ఊర్వ——బావగారూ! నిజముగా నామీఁద మీకు మనసునఁ బ్రేమగలదా?

నర——రమణీ! నన్ను నీవిట్లు వేర యడుగవలయునా? నీకన్న నాకుఁ బ్రేమాస్పద మగుపదార్థ మేది?

ఊర్వ——నేను నమ్మఁజాలను. మగవారి కెదుట నున్నదే పెండ్లికూఁతురు. పురుషులు కామాయత్తచిత్తులై కక్కుఱితి చేతఁదమయక్కఱఁదీర్చుకొనుటకయి లేనిప్రేమముఁ జూపి యిచ్చకపుమాటలాడి బాసలుచేసి యంగనల వంచించి మరల మొగముఁ జూడరు. నిజముగ నాపై ననురాగము మీకున్నయెడల నాకొఱ కొకమాఱయిన నింతకాలము నుండి స్వర్గమున కేల రారైరి?

నర——సుందరీ! నీవు పగవాని యధీనమున నున్నపడఁతుకవు. మిండరికమునకయి నావంటివాఁడు పగతునిపట్టణంబునకు వచ్చుట యనుచితముగదా!

తే. గీ. ఎంతకాలంబునుండియో యేను నిన్ను
గాంచఁ దలఁచిన సమయంబు గలుగదయ్యె
విబుధలోకంబుపై దండువిడియు కతన
వాలుగంటి నిన్గన నేఁడు వీలుగంటి. 32.

వజ్ర——ఇప్పటికి వీరి కిద్దఱకు నొడంబడికలు జరిగినవి. ఇంక మేము ధన్యుల మయితిమి.

ఊర్వ——బావగారూ! ఇది యొకవంకగాని నిజముగా మీకు నాపై ననుగ్రహమున్నయెడలఁ గాకిచే వర్తమాన మంపిన నేను ఱెక్కలు గట్టుకొని మీపాదములపై వ్రాలనా?

నర——సుందరీ! నాకంతటియూహము తోఁచినదిగాదు. నన్ను మన్నింపుము.

వజ్ర——ఆయూహము తోఁచినయెడల మీయిరువురసందునఁ దిరుగలేక నేఁ జచ్చిపోదును. ఇంతకు నాపుణ్యము బాగున్నది.

ఊర్వ—ఓరసికశిఖామణీ! నీమనసున నిజముగ నాపై వలపుగలదో లేదో యని పరీక్షించుటకయి నే నెన్నియోవిధముల నిన్నుం దూలనాడితిని. ముజ్జగంబుల గెలిచి మహావైభవముతోఁ గన్నులపండువుగ రాజ్యమేలుచున్న మీవంటిరసికశేఖరుని విడిచి రాజ్యభ్రష్టుఁడై నిలువనీడలేక కొండలఁ జరియించు మునిశాపోపహతుని మహేంద్రుని గోల్చియుండుటకు నే నంత తెలివిమాలినదాననా? ఎవ్వరుం దగినవారు లేకపోవుటచే నున్నంతలో సరిపెట్టుకొనుట మంచిదని యింద్రునియొండనుండి గౌరవముగఁ గాలము గడపుచుంటిని. ఇంక నేను నీధనము. నీవే నాప్రాణమవు.

నర—ధన్యోస్మి! ధన్యోస్మి! నే నిప్పుడు నిజముగా నింద్రుఁడ నైతిని.

చ. నిజమఁట నీదుపల్కు నను నీబిగికౌఁగిటఁ జేర్పదో కొ యం
గజపరితాపము ల్దొలఁగుకాలము వచ్చెనె నాకు నాదుది
గ్విజయము సార్థకం బగునె కీర్తి యెలంగునె యింక నీముఖాం
బుజమును ముద్దులాడుటకు పుణ్యముఁ జేసితి నే? తలోదరీ! ౩౩.

వజ్ర—మీరేకాదు. నేనును నాపితృదేవతలును పరమానందరసములనఁబడు దరించితిమి.

నర—దేవీ! నందనోద్యానమునకుం బోయి విహరింతము రమ్ము.

ఊర్వ—దేవా! నా కొకప్రతిన యున్నది. ఆప్రతిన చెల్లించి నన్నుం జేపట్టవలయు.

నర—నీప్రతినఁ బాలించుటకై నీసేవకుఁడు సిద్ధముగ నున్నవాఁడు. ఆనతిమ్ము.

ఊర్వ—మీరు పాకశాసనుని గెల్చి మహేంద్రపదవి నాక్రమించుకొంటిరి. కాని బ్రాహ్మణులు మహర్షులు చేయుయజ్ఞంబులలో భాగములు కొన్నప్పుడుకాని దేవేంద్రత్వము సార్థకముగాదు. అప్పుడు నే నిన్ను వరింతు. ఇప్పుడు బదరికావనమున సత్రయాగము జరగుచున్నయది. అక్కడకు మీరరిగి ఋషులనొప్పించి హవిర్భాగముల భుజించి రండు.

నర—(నవ్వుచు) ఇదియా నీప్రతిన! సరిసరి ఇది చెల్లించు టెంతసేపు. ఇంతకన్న మఱియేదియు లేదుగదా! అట్లు చేసినపిదప మఱియొకవంకఁ జెప్పవుగద.

ఊర్వ—ఏవంకయుఁ జెప్పను. మాటఁదక్కితినేని విష్ణునాన. జంపుకొన్నట్లే. ఇంక నాకు సెలవిండు. నేను బోయి మీరాకఁ నిరీక్షించుచుందును.

నర—దేవీ! అట్లే పొమ్ము. నేను నీదాసుఁడ ననుమాట మనసులో నుంచుకొనుము.

ఊర్వ—(తనలో) ఇప్పటికిఁ బులినోటికడవలె తప్పించుకొంటిని. ఈబుద్ధిహీనుఁ డీగండముగడచి బ్రతికినప్పటిమాటగద. విధియె దైవము నాకుఁడు. (అనినిష్క్రమించును).

వజ్ర—(తనలో) ఈ గడుసు బానిసకూఁతు రేదో వంక చెప్పి యీ మందభాగ్యుని కన్నులలో దుమ్ము కొట్టిపోయినది. ఇఁక వీనికి నీమె దక్కినప్పటిమాటకదా?

నర—వజ్రకా! మురనిశుంభాది సైన్యాధిపతులయొద్దకుఁ బోయి దానవ సైన్యంబులు బదరికాశ్రమమునకుఁ బోవలయుఁ గాన ప్రయాణసన్నాహము సేయుమని చెప్పుము.

వజ్ర—చిత్తము (అని కొంచెము నడచి) దేవా! ఎందుకో మురుఁ డిటు వచ్చుచున్నాఁడు. వీని మొగము సంతోషమును సూచించుచున్నది.

[అప్పుడు మురుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

మురు—దేవా! విజయమగు గాక!

నర—మురుఁడా! మీ స్వామిభక్తియు బాహుబలమును మాకు విజయకారణము లయ్యెను.

మురు—దేవా! నే నిప్పుడు కావించిన మహాసాహసమును మీకు విన్నవింపవచ్చితిని.

వజ్ర—ఈమహాసాహస మేదో వినఁదగినదే.

నర—నీసాహసమును వినిపించి మామనములకు విందు సేయుము.

మురు—దేవా! చిత్తగింపుము.

ఆ. వె. అమరమాత యైన యదితి దేవిని జేరి
యామె కుండలముల నపహరించి
తెచ్చినాఁడ నిపుడు దేవరవారికి
నర్పణంబు సేయ నధికభక్తి. 30.

ఇవిగో రత్నకుండలములు (అని యిచ్చుచున్నాఁడు.)

నర—నీసాహసము సంస్తవనీయమైనది. నీపేరు విన్న నిర్జరాంగనలకు గర్భనిర్భేదక మగుఁగాక! ఈకుండలము లూర్వశికి సమర్పించెదను.

వజ్ర—ఆఱు నెలలు సాము చేసి మూలనున్న ముసలిముండను గొట్టినట్లు మఱిమిచేఁ గదలలేక భయముచే సగము చచ్చి యొకమూల నొదిగియున్న వేల్పుటవ్వను గెలిచివచ్చితివా? నీవంటి ధైర్యవంతుఁడు దేవరాక్షసులలో నెచ్చటను లేఁడు.

మురు—ఓరి వాచాటా! నీవు రాజుగారి విదూషకుఁడ వగుటచే నిప్పుడు బ్రతికి పోతివి.

నర—మురుఁడా! మనవజ్రకుని మాటలు పాటింపనక్కఱలేదు. యాగహవిర్భాగములు గ్రహింపనున్న నా కింద్రత్వము సిద్ధింపదు కావున సేనాసమేతులరై మీ రిప్పుడు బదరికాశ్రమమునకుం బోయి యచ్చటి తాపసుల నడిగి నయమున భయమున

వారి నొప్పించి హవ్యంబులఁ గొనవలయు. సేనలకుఁ బ్రయాణముఁ జాటింపుము.

ముర—(సందేహముతో) మహర్షులు మనకు హవిర్భాగముల నిచ్చుటకు సమ్మతింతురో లేదో.

వజ్ర—నే నపశకునపక్షివంటివాఁడ నని మీ రనుకొన్ననుసరేగాని సమ్మతింపని మాట నిజము.

నర—(కోపముతో) ఏమేమీ; చతుర్దశభువనైకవీరుఁడును తృణీకృతపురందరాదిదిక్పాలకుఁడును విజయలక్ష్మీకరుణాపాంగవిలోకనప్రవర్ధితమహావిభవుండును నగు నరకదానవేంద్రునిమాట వారు నిరాకరింతురా?

ఉ. దక్కునె యింక ప్రాణములు తాపసవర్యుల కెల్ల మానము
ల్దక్కునె నేలవేల్పులకు దైవతకోటికి యాగభాగముల్
గ్రక్కున నిచ్చి న న్నరియె కావర మొంది యొసంగ కుండినన్
వ్రక్కలు చేసెదన్ దలలు భస్మముఁ జేసెద నాశ్రమంబులన్ 35.

మఱియు! అచ్చటి మునులు మనపలుకుఁ ద్రోసిపుచ్చిన వారితో ని ట్లనుము.

మహాస్రగ్ధర. సవనంబు ల్సాగ వింక న్జపములు తపముల్ స్నానముల్ సెల్ల వింకన్
భువనంబు ల్నిల్వ వింక న్బొబ్బదలు టరిది గోభూసురవ్రాత మింకన్
దివిజుల్ మర్త్యుల్ భుజంగుల్ నిముసమయిన వర్ధిల్లఁగాఁ జాల రింకన్
రవియు న్జంద్రుండుఁ జుక్క ల్గ్రహములు గతుల న్దప్పి వర్తింతు రింకన్

వజ్ర—మా కింక చేతినిండ పనిగలిగినది.

ముర—చిత్తము. అప్పటికిని మహర్షులు మీయాన తిరస్కరించిన మాయిచ్చ వచ్చిన తెఱంగున మేము సేయవచ్చునా?

నర—ఆహా త్రికరణశుద్ధిగా.

తే. గీ. చెలఁగి యిచ్చ వచ్చినరీతిఁ జేయవచ్చు
నచటి కెవఁడు వచ్చునో చూత మడ్డగింప
బవరమున మగంటిమిఁ జూపి పస యడంతు
నబ్జభవుఁడైన నాతని యబ్బ యైన. 36.

సైన్యంబులు తీసికొని మీరందఱుఁ బదరికాశ్రమమునకుఁ బొండు. నేను ప్రాగ్జ్యోతిషంబునకరిగి యచటనుండి కావలయునన్న బదరికావనంబునకు వచ్చువాఁడ. హయగ్రీవుం డింద్రలోకమును నాకుఁ బ్రతినిధియై యేలుఁగాక. మన మింకఁ బోవుదము.

(అందఱు నిష్క్రమించుచున్నారు.)